




ESTD: 1999

www.voodayam.com

# వుదయం








వరంగల్ 04-08-2026మంగళవారంసంపుటి : 11 | సంచిక : 239 SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily

Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur Follow us on


# 1,000 రోబోటిక్ సర్జరీలు పూర్తి

- మూడేళ్లలో 1,000 రోబోటిక్ శస్త్రచికిత్సలు నిమ్స్ రికార్డు!
- 'ఆరోగ్యశ్రీ' ద్వారా పేదలకూ ఉచితంగా రోబోటిక్ సర్జరీలు
- వైద్య బృందానికి సీఎం రేవంత్ అభినందనలు!





**హైదరాబాద్, ఆగస్టు 3 (వుదయం) :**

హైదరాబాద్‌లోని నైజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఆస్పత్రి అత్యంత అరుదైన మైలురాయిని అధిగమించింది. మూడేళ్ల కంటే తక్కువ వ్యవధిలోనే 1,000 రోబోటిక్ సహాయిత శస్త్రచికిత్సలను (RoboticAssisted Surgeries) విజయవంతంగా పూర్తి చేసి దేశంలోనే సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ చారిత్రాత్మక ఘనత సాధించిన నిమ్స్ వైద్య బృందాన్ని, సిబ్బందిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.ప్రభుత్వ వైద్యంలో విప్లవాత్మక మార్పుఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్య రంగంలో ఇదొక విప్లవాత్మక పరిణామమని కొనియాడారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో అత్యంత వ్యయభరితమైన రోబోటిక్ వైద్యాన్ని సామాన్య, పేద ప్రజలకు సైతం అందుబాటులోకి తీసుకురావడం తెలంగాణ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. వైద్య సేవల్లో ఆవిష్కరణలు, అత్యుత్తమ ప్రమాణాలు పాటించడంలో నిమ్స్ ఆస్పత్రి నిరంతరం ముందుంటోందని కొనియాడారు. విభాగాల వారీగా రోబోటిక్ సర్జరీల వివరాలుఆధునిక రోబోటిక్ సాంకేతికత వల్ల సర్జరీల్లో ఖచ్చితత్వం పెరగడంతో పాటు, నొప్పి మరియు రక్తస్రావం తగ్గి రోగులు త్వరగా కోలుకుంటున్నారని అధికారులు వెల్లడించారు. నిమ్స్‌లో నిర్వహించిన 1,000 సర్జరీల వివరాలు:యూరాలజీ విభాగం: 590 శస్త్రచికిత్సలుసర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం: 248 శస్త్రచికిత్సలుసర్జికల్ ఆంకాలజీ (క్యాన్సర్) విభాగం: 162 శస్త్రచికిత్సలుకిడ్నీ, కాలేయ, జీర్ణశయాంతర, గర్భాశయ మరియు సంక్లిష్టమైన క్యాన్సర్ సంబంధిత వ్యాధులకు ఈ అధునాతన విధానంలో చికిత్స అందించారు.90 శాతానికి పైగా ఉచితంగానే...ఈ సర్జరీలలో 90 శాతానికి పైగా చికిత్సలను 'ఆరోగ్యశ్రీ' మరియు 'ముఖ్యమంత్రి సహాయ నిధి' (CMRF) పథకాల ద్వారా ఉచితంగా అందించడం విశేషం. ఆర్థికంగా వెనుకబడిన పేద కుటుంబాలకు సైతం ఉచితంగా ప్రపంచ స్థాయి వైద్యాన్ని అందిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఉచిత వైద్య సంకల్పానికి నిలువెత్తు రూపంగా నిలిచిందని సీఎం తెలిపారు.వైద్యులకు, సిబ్బందికి ప్రశంసలుఈ చారిత్రాత్మక విజయానికి కృషి చేసిన నిమ్స్ డైరెక్టర్, ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, అస్థీషియా విభాగాలు, నర్సింగ్ సిబ్బంది మరియు ఆపరేషన్ థియేటర్ (OT) బృందానికి ముఖ్యమంత్రి తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## చైనా నిఘా నీడలో 140 కోట్ల మంది



**వాషింగ్టన్ :**

ప్రపంచవ్యాప్తంగా సుమారు 140 కోట్లకు పైగా ప్రజల వ్యక్తిగత వివరాలు, కదలికలపై చైనా ప్రభుత్వం తీవ్రస్థాయిలో 'డిజిటల్ నిఘా' ఏర్పాటు చేసినట్లు అమెరికాకు చెందిన ప్రముఖ పత్రిక వెలువరించిన కథనం అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఈ నిఘా నీడలో కేవలం చైనా పౌరులే కాకుండా, ఆ దేశాన్ని సందర్శించిన విదేశీ పర్యాటకులు, అక్కడ చదువుకుంటున్న అంతర్జాతీయ విద్యార్థులు కూడా ఉన్నట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.వెలుగులోకి వచ్చిన 'రహస్య పోర్టల్'ఈ ఏడాది జనవరిలో మార్క్ హోఫర్ అనే సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు చైనా సర్వైలెన్స్ విధానాలపై పరిశోధన చేస్తుండగా ఈ దిగ్భ్రాంతికర నిజం వెలుగులోకి వచ్చింది. 'డైనమిక్ కంట్రోల్ ప్లాట్‌ఫామ్ ఫర్ ఓవర్సీస్ పర్సనల్' అనే రహస్య వెబ్‌సైట్‌లో ఆయనకు స్వయంగా తన పేరు, పాస్‌పోర్ట్ సంఖ్య, ఫొటో మరియు చైనా పర్యటన సమయంలో వాడిన మొబైల్ నంబర్ కనిపించడంతో షాక్‌కు గురయ్యారు.భారతీయులు, విదేశీ విద్యార్థులే టార్గెట్!ఈ డేటాబేస్‌లో ముఖ్యంగా చైనాలోని 'ఝూంగ్జియాకో' నగరానికి వెళ్లిన విదేశీయుల వివరాలు భారీగా నిక్షిప్తమై ఉన్నాయి. బాధితుల దేశాలు: భారత్, తైవాన్, ఆస్ట్రేలియా, కెనడా, బ్రిటన్, అమెరికా, ఈజిప్ట్, ఇరాన్, ఇజ్రాయెల్, పాకిస్థాన్, సూడాన్ తదితర దేశాల పౌరుల సమాచారం ఇందులో ఉంది.విద్యార్థుల సమాచారం: ఝూంగ్జియాకోలోని హెబే నార్త్ యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్న అంతర్జాతీయ విద్యార్థుల సమగ్ర సమాచారం నమోదైంది.

## న్యాయస్థానంలో పెరగనున్న న్యాయమూర్తుల బలం

- 1950లో 8 మంది.. నేడు 38కి
- 'సుప్రీం కోర్టు సవరణ బిల్లు-2026'కు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్



**న్యూఢిల్లీ, ఆగస్టు 3 (ఎఎంఎస్) :**

దేశ అత్యున్నత న్యాయస్థానంలో కేసుల విచారణ వేగాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సుప్రీం కోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు ఉద్దేశించిన 'సుప్రీం కోర్టు (నంబర్ ఆఫ్ జడ్జెస్) చట్ట సవరణ బిల్లు2026'కు లోక్‌సభ ఆమోదముద్ర వేసింది. ఈ తాజా సవరణ ద్వారా భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)తో సహా జడ్జీల మొత్తం సంఖ్య 34 నుంచి 38కి పెరగనుంది.వర్షాకాల సమావేశాల సందర్భంగా కేంద్ర శాసనసభా వ్యవహారాలు, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టి చర్చను ప్రారంభించారు. అయితే, ఇదే సమయంలో విపక్ష సభ్యులు సభా వేదిక వద్దకు వచ్చి పదేపదే నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ప్రజారోగ్యం, ప్రజా ప్రాధాన్యం ఉన్న ఈ కీలక బిల్లుపై చర్చలో పాల్గొనాలని స్పీకర్ విపక్షాలను కోరినప్పటికీ ఫలితం లేకపోయింది. విపక్షాల తీవ్ర ఆందోళనల మధ్యనే ఎలాంటి చర్చ లేకుండా బిల్లును సభ ఆమోదించినట్లు స్పీకర్ ప్రకటించి, అనంతరం లోక్‌సభను తదుపరి రోజుకు వాయిదా వేశారు.ఆర్డినెన్స్ స్థానంలో చట్టం సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచాలని ఈ ఏడాది మే నెలలోనే కేంద్ర మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. ఆ నిర్ణయాన్ని అమలు చేసే క్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 'సుప్రీం కోర్టు సవరణ ఆర్డినెన్స్2026'ను జారీ చేశారు. 2026వ సంవత్సరంలో కేంద్రం జారీ చేసిన తొలి ఆర్డినెన్స్ ఇదే కావడం గమనార్హం. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఆ ఆర్డినెన్స్ స్థానంలో చట్టాన్ని తీసుకురావడానికి కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకుంది.1950 నుంచి నేటి వరకు...భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 1950 జనవరి 26వ తేదీన సుప్రీం కోర్టులో సీజేఐతో కలిపి మొత్తం 8 మంది మాత్రమే న్యాయమూర్తులు ఉండేవారు. పెరుగుతున్న దేశ జనాభా, కోర్టుల్లో పెండింగ్‌లో పడుతున్న కేసుల సంఖ్యకు అనుగుణంగా సవరణలు చేస్తూ జడ్జీల సంఖ్యను పెంచుకుంటూ వచ్చారు. తాజా ఆమోదంతో అత్యున్నత న్యాయస్థానంలో న్యాయమూర్తుల సంఖ్య 38కి చేరుకుంది.

## ఈదురుగాలులతో జాగ్రత్త
# దంచికొట్టనున్న వర్షాలు



**హైదరాబాద్, ఆగస్టు 3 (వుదయం) :**

రాష్ట్రంలో 'క్యుములోనింబస్' మేఘాల ప్రభావంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. తెలంగాణ వ్యాప్తంగా ఇప్పటికే పలు ప్రాంతాల్లో వానలు కురుస్తుండగా, రాగల కొద్ది గంటల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.ముఖ్యంగా ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో సదరు జిల్లాలకు హెచ్చరికగా 'ఎల్లో అలర్ట్' జారీ చేశారు. వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోవైపు రాజధాని హైదరాబాద్ వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై ఉంటుందని, నగరంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు కురిసే వీలుందని అధికారులు వివరించారు.



## కాంగ్రెస్ తీరుతో
# నిరుద్యోగుల ఆవేదన

- 20 వేల ఖాళీలు ఉంటే 7 వేలకే నోటిఫికేషనా?

**హైదరాబాద్, ఆగస్టు 3 (వుదయం) :**

రాష్ట్రంలో నిరుద్యోగ యువత పడుతున్న ఆవేదనపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను తీవ్రంగా వంచించిందని దుయ్యబట్టారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎన్నికల సమయంలో 'యూత్ డిక్లరేషన్' పేరిట ఊదరగొట్టిన కాంగ్రెస్, అందులో ఇచ్చిన 24 హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. ఉద్యోగాల భర్తీ చేపట్టకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం కలచివేసిందన్నారు. రాష్ట్రంలో 20 వేల పోలీసు ఉద్యోగాల ఖాళీలు ఉన్నప్పటికీ, కేవలం 7 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇచ్చి చేతులు దులుపుకోవడం ఏంటని ప్రశ్నించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు:"ఉద్యోగాలు అడిగిన యువతను ఎండ్రిన్ తాగి చావాలనడం, ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను 'క్రిమినల్ వేస్ట్' అని సంబోధించడం తీవ్ర బాధ్యతారాహిత్యం. ఈ దారుణ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదు?" రాష్ట్రంలో అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న రేవంత్ రెడ్డే అసలైన 'క్రిమినల్ వేస్ట్' అని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "సీఎం అసలు ఏం చదువుకున్నారో కూడా సందేహంగా ఉంది. ఆయన తన ఎన్నికల నామినేషన్ పత్రాన్ని సొంతంగా నింపుకోగలరా? ఆయన జీవితంలో ఒక్క ఉద్యోగ ఇంటర్వ్యూకైనా వెళ్లారా?" అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.


# ఇళ్లు కూల్చే సంస్థగా 'హైడ్రా' ముద్ర

## కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదు



**హైదరాబాద్, ఆగస్టు 3 (వుదయం) :**

హైదరాబాద్:రాష్ట్రంలో పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను దారుణంగా వంచిస్తోందని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో యువత, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనార్టీ వర్గాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.నగరంలో పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'హైడ్రా' తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు:"సామాన్యుల ఇళ్లను కూల్చివేసే సంస్థగా 'హైడ్రా' ముద్ర వేసుకుంది. ఈ సంస్థ చర్యల వల్ల నేడు నగరంలో దాదాపు 95 శాతం మంది ప్రజలు భయాందోళనలతో కాలం గడుపుతున్నారు."మరొకవైపు, రాజధాని హైదరాబాద్‌లో అనేక చెరువులు, కుంటలు క్రమంగా కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని వాగులు, డ్రైనేజీలు రసాయన వ్యర్థాలతో నిండిపోయి కాలుష్య కాసారాలుగా మారాయని దుయ్యబట్టారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న కొత్త కాలనీలు చెరువుల పక్కనే ఉండటంతో, వ్యర్థాల దుర్గంధం తాళలేక ప్రజలు తీవ్ర నరక యాతన అనుభవిస్తున్నారని ఈటల మండిపడ్డారు.

వుదయం





## గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమం

- ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి ఆధ్వర్యంలో

**ఊర్కొండ న్యూస్. 3 (వుదయం ప్రతినిధి)**

నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం.మండల కేంద్రంలో ఈరోజు రైతు వేదిక ఉరుకొండయందు నూతనముగా ఎన్నిక కాబడిన గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమం రోజువారిగా పాల్గొనాలని సంబంధించి వార్డు సభ్యులకు తెలియజేయడం జరిగింది.ఈ శిక్షణలో మీ యొక్క వార్డు గ్రామపంచాయతీ అభివృద్ధిపై శిక్షణ పొంది అభివృద్ధి కార్యక్రమాలు మీ గ్రామంలో చేపట్టాలని కోరినైనది. గ్రామము అభివృద్ధి చెందుతే మండలం అభివృద్ధి చెందుతుంది ,మండలం అభివృద్ధి చెందుతే జిల్లా అభివృద్ధి చెందుతుంది, జిల్లా అభివృద్ధి చెందుతే రాష్ట్రము అభివృద్ధి చెందుతుంది, రాష్ట్రం అభివృద్ధి చెందితే దేశము అభివృద్ధి చెందుతుంది అని తెలియజేయడమైనది ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ లక్ష్మణ్ నాయక్. వివిధ గ్రామాల గ్రామపంచాయతీ కార్యదర్శులు. పాల్గొన్నారు



## అండర్ డ్రైనేజ్ పనులు ప్రారంభం

- పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత - సర్పంచ్ బోనాసి రామకృష్ణ

**బిజినపల్లి, ఆగస్టు 03 (వుదయం ప్రతినిధి) :**

నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం పాలెం గ్రామపంచాయతీ 2వ వార్డులో గ్రామ అభివృద్ధి పనులలో భాగంగా అండర్ డ్రైనేజ్ పనులను సర్పంచ్ బోనాసి రామకృష్ణ సోమవారం ప్రారంభించారు.నరసింహా ఇంటి నుండి పోచమ్మ గుడి వరకు చేపట్టిన ఈ పనులను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఇళ్లలోని మురుగునీటిని, వర్షపు నీటిని సురక్షితంగా బయటికి పంపేందుకు ఈ పనులు చేపట్టామని తెలిపారు. బహిరంగ కాల్వాల సమస్యలు తొలగిపోయి, దుర్వాసనలు రాకుండా, రోగాలు ప్రబలకుండా చూడడమే ప్రధాన లక్ష్యమని అన్నారు. "శుభ్రత పరిశుభ్రత" పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోవిందు శ్రీనివాసులు, పంచాయతీ సెక్రెటరీ శివకృష్ణ, వార్డు సభ్యులు కోట్ల హేమలత, శ్రీకాంత్, చింతల పద్మ, గోవిందు కాశన్న, గ్రామ పెద్దలు ఎండి ఖదీర్, బుర్రి సుదర్శన్ రెడ్డి, సోప్పరి బాలస్వామి, చంద్రారెడ్డి, బాపిరెడ్డి, దామోదర్, శ్రీశైలం, బుచ్చన్న, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు

## కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ



**మరికల్ ఆగస్టు 3 (వుదయం ప్రతినిధి)**

మరికల్ మండల కేంద్రంలో ని సోమవారం కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేయడానికి ముఖ్య అతిథిగా నారాయణపేట మార్కెట్ చైర్మన్ సదా శివరెడ్డి హాజరయ్యారు 25 మంది మహిళలకు కల్యాణ లక్ష్మి చెక్కులు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి లక్ష 116 రూపాయలు పంపిణీ చేశారు చేస్తూ కాంగ్రెస్ పార్టీ పేదలకు అందించే వరమని ఆయన అన్నారు కులమత బేధాలు లేకుండా పార్టీలకు అధికంగా అర్హులైన ప్రతి ఒక్కరికి కళ్యాణ చెక్కులు పంపించేశారు ఈ కార్యక్రమానికి తాసి ల్దార్ రామకోటి కాంగ్రెస్ మండల అధ్య క్షుడు హర్షవర్ధన్ రెడ్డి గ్రామ సర్పంచ్ చెన్నయ్య ఉపసర్పంచ్ కాజా వార్డ్ మెంబర్లు కాంగ్రెస్ నాయకులు వీరన్న హరీష్ కుమార్ రాఘవేందర్ రామకృ ష్ణ గోవర్ధన్ తో పాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## బీవీఆర్ఐటీలో ఘనంగా 30వ ఇండక్షన్ డే వేడుకలు



**హత్నూర , ఆగస్టు 3 వుదయం ప్రతినిధి:**

నర్సాపూర్‌లోని బి.వి.రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీవీఆర్ఐటీ) లో బీటెక్ తొలి సంవత్సరం విద్యార్థుల కోసం నిర్వహించిన 30వ ఇండక్షన్ డే (పరిచయ కార్యక్రమం) సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నూతన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు కె. విష్ణు రాజు నూతన విద్యార్థులను బీవీఆర్ఐటీ కుటుంబంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సోషల్ మీడియా, కృత్రిమ మేధస్సు (AI)ను బాధ్యతాయుతంగా వినియోగించాలని, సాంకేతికతను అభ్యాసానికి తోడ్పడే సాధనంగా ఉపయోగించుకోవాలని సూచించారు. నకిలీ వార్తలకు దూరంగా ఉండాలని, బహుముఖ నైపుణ్యాలను పెంపొందించుకుని లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు.

అలాగే ఫ్రెష్‌మెన్‌ల కోసం రూపొందించిన నూతన పుస్తకాలను ఆవిష్కరించారు.శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ మాట్లాడుతూ..సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని సూచించారు. తరగతి గదిలో నేర్చుకున్న విజ్ఞానాన్ని ప్రాజెక్టులు, పరిశ్రమల అనుభవంతో అనుసంధానం చేసుకోవాలని, పరిశ్రమలు, పూర్వ విద్యార్థులు, సీనియర్లతో వృత్తిపరమైన సంబంధాలను పెంపొందించుకోవాలని చెప్పారు.

కళాశాల ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే మాట్లాడుతూ.. ప్లేస్‌మెంట్లు, ఉన్నత విద్య, పరిశోధన, వ్యవస్థాపకత, సామాజిక బాధ్యత వంటి రంగాల్లో బీవీఆర్ఐటీ విశిష్ట గుర్తింపు సాధించిందన్నారు. జాతీయ స్థాయి ఈబాజా (eBAJA SAEINDIA) పోటీల నిర్వహణతో పాటు, ఇటీవల జాతీయ స్థాయి జటాయువు పోటీలో కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు సాధించిన విజయం కళాశాల ప్రతిష్ఠను మరింత పెంచిందని తెలిపారు.కళాశాల డైరెక్టర్ డా. కె. లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ.. తొలి సంవత్సరం విద్యార్థుల కోసం రూపొందించిన ఏడు రోజుల ఓరియంటేషన్ కార్యక్రమం లక్ష్యాలను వివరించారు. విలువలతో కూడిన విద్యతో పాటు సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి బీవీఆర్ఐటీ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులు నూతన విద్యార్థులకు స్వాగతం పలికి, కళాశాలలోని క్లబ్బులు, ప్రొఫెషనల్ సొసైటీల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. పూర్వ విద్యార్థులు సాత్విక్, విజయ్ తమ అనుభవాలను పంచుకుని విద్యార్థులను ప్రేరేపించారు. కార్యక్రమంలో అన్ని విభాగాధిపతులు, డీన్లు, అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

- బీజేపీ యువమోర్చా జిల్లా నాయకులు కంది సతీష్ రెడ్డి

**కోహెడ ఆగస్టు 03 : (వు దయం ప్రతినిధి)**



రాష్ట్రంలోని సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్న విద్యార్థులను 'క్రిమినల్ వేస్ట్'గా అభివర్ణించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహంకారానికి, విద్యార్థుల పట్ల ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని బీజేపీ యువమోర్చా జిల్లా నాయకులు కంది సతీష్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు తమ హక్కులను కోరితే వారిని అవమానించడం ప్రభుత్వ బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని అన్నారు. విద్యార్థులకు న్యాయం చేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు వారిపైనే విమర్శలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు.రెండున్నరేళ్లుగా విద్యాశాఖ ముఖ్యమంత్రి వద్దే ఉందని గుర్తు చేసిన ఆయన, ఈ కాలంలో విద్యా నాణ్యత పెంపు కోసం తీసుకున్న ఒక్క సంస్కరణనైనా చెప్పగలరా అని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విశ్వవిద్యాలయాల్లో ఖాళీల భర్తీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు, స్కాలర్‌షిప్‌ల సకాలంలో విడుదల, నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన వంటి అంశాల్లో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించలేక ప్రశ్నించే విద్యార్థులనే 'క్రిమినల్ వేస్ట్'గా ముద్ర వేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అసహన వైఖరికి నిదర్శనమని కంది సతీష్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ యువతను అవమానించే హక్కు ముఖ్యమంత్రికి లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వెంటనే "క్రిమినల్ వేస్ట్" వ్యాఖ్యలను ఉపసంహరించుకుని రాష్ట్ర విద్యార్థులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## గాగిల్లాపూర్‌లో ఘనంగా బాల సభ నిర్వహణ

- చిన్నారుల అభిప్రాయాలకు పెద్దపీట వేసిన గ్రామపంచాయతీ

**బెజ్జంకి, ఆగస్టు 3(వుదయం ప్రతినిధి):**



సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని గాగిల్లాపూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం బాల సభను ఘనంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ శ్రీమతి ఎర్రల జానకి రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులు తమ పాఠశాల, తాగునీటి సౌకర్యం, ఆట స్థలాలు, పరిశుభ్రత తదితర అంశాలపై ధైర్యంగా తమ అభిప్రాయాలను వెల్లడించారు.ఈ సందర్భంగా అధికారులు కింద కూర్చుని, పిల్లలు వేదికపై కూర్చొని తమ అభిప్రాయాలను తెలియజేయడం సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామాభివృద్ధిలో చిన్నారుల సూచనలకు ప్రాధాన్యత ఇవ్వాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా అందించారు.సర్పంచ్ ఎర్రల జానకి రాజు మాట్లాడుతూ"ఈ రోజు మనం వింటున్న ప్రతి చిన్నారి మాటే రేపటి గాగిల్లాపూర్ అభివృద్ధికి మార్గదర్శకం అవుతుంది. పిల్లలకు నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం, ఆట స్థలాల కల్పనకు గ్రామపంచాయతీ కట్టుబడి ఉంటుంది" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చింతలపల్లి పద్మ, వార్డు సభ్యులు బండిపెల్లి రమేష్, తడకపల్లి పవన్, చింతలపల్లి లత కొండల్ రెడ్డి, కొమిరే రమ శ్రీనివాస్, చాతరేణి మహేష్, సొల్లు బాలయ్య, న్యాలం శారద శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి పాము రాజేంద్రప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు, మహిళా సంఘం అధ్యక్షురాలు ముత్యం శోభ, సీఏలు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- అన్ని శాఖల సమన్వయంతో వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం :
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, ఆగస్టు 03:-వు దయం:**




స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబించేలా, పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఆగస్టు 15న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే జిల్లా స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. వేదిక, అతిథుల సీటింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా సమగ్ర జిల్లా ప్రగతి నివేదికను సిద్ధం చేయాలని జిల్లా ప్రణాళికాధికారికి కలెక్టర్ ఆదేశించారు. ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ప్రజాప్రతినిధులు, విశిష్ట అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. జాతీయ భావనను పెంపొందించేలా విద్యార్థులతో దేశభక్తిని చాటే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ,సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రశంసా పత్రాల పురస్కారాల కోసం శాఖల వారీగా ఉత్తమ ఉద్యోగుల వివరాలతో కూడిన ప్రతిపాదనలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అలంపూరులోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కొనసాగించాలి

- కలెక్టర్‌కు అలంపూరు అభివృద్ధి కమిటీ వినతి

**అలంపూర్, ఆగస్టు 03 (వు దయం కరస్పాండెంట్)**



అలంపూరు పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని వేరే ప్రాంతానికి తరలించకుండా యథావిధిగా అలంపూరు లోనే కొనసాగించాలని కోరుతూ అలంపూరు అభివృద్ధి కమిటీ నాయకులు, సభ్యులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అలంపూరు మండల ప్రజలు, రైతులు, వ్యాపారులకు చాలా కాలంగా అలంపూరులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా సౌకర్యవంతమైన సేవలు అందుతున్నాయని తెలిపారు. కార్యాలయాన్ని ఇతర ప్రాంతానికి తరలిస్తే ప్రజలు రిజిస్ట్రేషన్ పనుల కోసం అదనపు ప్రయాణం చేయాల్సి వచ్చి సమయం, డబ్బు వృథా అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజల అవసరాలు, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అలంపూరు లోనే కొనసాగించేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను వారు కోరారు.

ఈ కార్యక్రమంలో అలంపూరు అభివృద్ధి కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులు,యువకులు పాల్గొన్నారు.

## ఇల్లు 'డబుల్'... కష్టాలు 'ట్రిపుల్'!

- గూడు దక్కినా.. దాహార్తి తీరలేదు!
- గోనుపాడు డబుల్ బెడ్రూం కాలనీలో అధికారుల ఘోర నిర్లక్ష్యం
- చుక్క నీటి కోసం పొలాల బాట.. 'మిషన్ భగీరథ' ముసుగులో పేదల ఆక్రందన

**గద్వాల ఆగస్టు 03 (వుదయం బ్యూరో)**



సొంతింటి కల నెరవేరిందన్న ఆనందం ఆ పేదల ముఖాల్లో ఒక్క రోజు కూడా నిలవలేదు. "ఇల్లు కట్టి ఇచ్చాం.. ఇక మీ చావు మీరు చావండి" అన్నట్లుగా అధికారుల బాధ్యతారాహిత్యం పేదల పాలిట శాపంగా మారింది. గద్వాల మండలం గోనుపాడు గ్రామంలో ఇటీవల 25 మంది అర్హులైన పేదలకు సర్కారు ఎంతో ఆర్భాటంగా డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించింది. అయితే, ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకముందే, కనీస సౌకర్యాలు కల్పించకుండానే హడావుడిగా ఇళ్లను పంపిణీ చేసి చేతులు దులుపుకోవడంతో లబ్ధిదారులు తీవ్ర అల్లకల్లోలానికి గురవుతున్నారు. అరకొర పనులు.. అప్పుల ఊబిలో పేదలు! కాలనీలో ఇళ్ల నిర్మాణం సగానికి పైగా అసంపూర్తిగానే మిగిలిపోయింది. కనీసం గుమ్మాలు, పూతలు, రంగులు వంటి చిన్న చిన్న పనులు కూడా పూర్తి కాకుండానే లబ్ధిదారులకు తాళాలు చేతిలో పెట్టారు. ప్రతి నెలా అద్దెలు భరించలేక, ఉన్న నివాసాలను ఖాళీ చేసి వచ్చిన పేదలు.. తమ వద్ద ఉన్న అరకొర పొదుపు సొమ్మును, వడ్డీలకు అప్పులు తెచ్చి మరీ ఆ అసంపూర్తి పనులను పూర్తి చేసుకుంటున్నారు. బిందెడు నీటికి 'పొలాల' వేట! ఇదిలా ఉండగా, కాలనీకి కనీస అవసరమైన తాగునీటి వ్యవస్థను అందుబాటులోకి తేకపోవడం లబ్ధిదారుల పాలిట నరక ప్రాయంగా మారింది. 'మిషన్ భగీరథ' ఇంటింటికీ నీరిస్తామని గొప్పలు చెబుతున్నా.. ఇక్కడ కనీసం పైప్‌లైన్ కనెక్షన్ కూడా ఇవ్వకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట. మైళ్ల కొద్దీ నడక: రోజువారీ తాగునీటితో పాటు శౌచాలయాలు, ఇతర గృహ అవసరాల కోసం మైళ్ల కొద్దీ నడిచి సమీపంలోని వ్యవసాయ పొలాల వద్ద ఉన్న బోరుబావుల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. పసిపిల్లలు, వృద్ధుల అవస్థలు: బిందెడు నీటి కోసం కాళ్లు అరిగేలా తిరగాల్సి రావడంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర రోగాల బారిన పడుతున్నారు.

**డబుల్' పథకం.. 'జీరో' వసతులు!**

కేవలం సిమెంట్ భవనాలు నిర్మించి చేతులు దులుపుకుంటే సరిపోదు. తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, తారు రోడ్లు వంటి మౌలిక వసతులు కల్పించినప్పుడే డబుల్ బెడ్రూం పథకానికి సార్థకత చేకూరుతుంది. రూ.లక్షలు వెచ్చించి కట్టిన ఇళ్లలో చుక్క నీరు లేకపోవడం పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి ప్రత్యక్ష నిదర్శనం." బాధితులు, గోనుపాడు డబుల్ బెడ్రూం కాలనీ ఇప్పటికైనా కదిలేనా యంత్రాంగం? ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు నిద్రమత్తు వీడి తక్షణమే స్పందించాలి. యుద్ధప్రాతిపదికన గోనుపాడు డబుల్ బెడ్రూం కాలనీకి మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని, అలాగే విద్యుత్, రహదారి సదుపాయాలు కల్పించి పేదల దాహార్తిని తీర్చాలని కాలనీవాసులు ఆవేదనతో విజ్ఞప్తి చేస్తున్నారు.

## గర్భిణీలు, చిన్నారుల సంక్షేమానికి అంకితభావంతో పనిచేయాలి

- అంగన్వాడీ సిబ్బందికి కౌన్సిలర్ రాధా చిన్న కృష్ణ సూచన
- గర్భిణీలకు పౌష్టికాహారం చిన్నారులకు బాలామృతం పంపిణీ

**అయిజ, ఆగస్టు 03 (వుదయం ప్రతినిధి)**



గర్భిణీలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా అంగన్వాడీ సిబ్బంది పనిచేయాలని అయిజ మున్సిపాలిటీ 10వ వార్డు కౌన్సిలర్ రాధా చిన్న కృష్ణ సూచించారు. సోమవారం దుర్గా నగర్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో గర్భిణీలకు కోడిగుడ్లు, ఇతర పౌష్టికాహారం, చిన్నారులకు బాలామృతాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలకు పోషకాహారం, క్రమం తప్పని ఆరోగ్య పరీక్షలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిరంతరం అవగాహన కల్పించాలని అంగన్వాడీ టీచర్లకు సూచించారు. చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన ప్రాథమిక విద్య అందించి, వారి శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ఎల్లమ్మ, ఆరోగ్య కార్యకర్త భాగ్యమ్మ, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## దుబ్బాకలో ఎస్ఐఆర్ కార్యక్రమం 100 శాతం పూర్తి

- సోలిపేట ప్రసాద్ రెడ్డి

**వుదయం, దుబ్బాక:**



దుబ్బాక నియోజకవర్గంలో ఎస్ఐఆర్ (S.I.R.) కార్యక్రమాన్ని 100 శాతం విజయవంతంగా పూర్తి చేశామని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ సోలిపేట ప్రసాద్ రెడ్డి తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాలు, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి మార్గదర్శకత్వంలో కార్యక్రమాన్ని లక్ష్యానికి అనుగుణంగా పూర్తిచేసినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతం, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ గద్దర్ వెన్నెలక్క, శ్రీకాంత్ గౌడ్‌తో పాటు బీఎల్ఏలు, సూపర్వైజర్లు, మండల అధ్యక్షులు, ఆత్మ కమిటీ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, యువజన నాయకులు, పార్టీ కార్యకర్తలు, బీఎల్వోలు, ప్రభుత్వ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సమిష్టి కృషి, అంకితభావం, క్రమశిక్షణ, ఐక్యత వల్లే ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయగలిగామని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



- 6000 అందజేసిన బుద్ధులు మమతా బిక్షపతి

**వుదయం న్యూస్ శివ్వంపేట ఆగస్ట్ 3**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని దొంతి గ్రామ పంచాయతీ పరిధిలో 10. వార్డు సభ్యులు బుద్ధులు మమతా బిక్షపతి ఎలక్షన్ల సమయంలో ఇచిన మాట ప్రకారం పదవ వార్డులో దురదృష్ట శత్తు ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబానికి తన వంతు సహాయంగా 6000 రూపాయలు ఆర్థిక సాయం అందజేస్తామని మాట ఇవ్వడం జరిగింది. బాధిత కుటుంబం పుట్టెడు దుఃఖంలో ఉంటుంది గనుక వారిని ఓదార్చి మనో ధైర్యాన్ని నింపి నేడు చెనగరి పోచమ్మ కుటుంబానికి ఆర్థిక సాయం అందించడం జరిగింది. 9వ వార్డు సభ్యులు పిట్ల కృష్ణ తన వంతు బాధ్యతగా బాధిత కుటుంబానికి నిత్యవసర సరుకులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల మాజీ కోఆప్షన్ సభ్యులు లాయర్. సుకుమార్. వార్డు సభ్యులు రాములు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## తల్లిపాల వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్ కర్నూల్, ఆగస్టు 03 (వుదయం బ్యూరో):**

పోషక అభియాన్‌లో భాగంగా జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల అవగాహన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన వరమని, పుట్టిన తొలి గంటలోనే తల్లిపాలు పట్టించడం, మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల శిశువు ఆరోగ్యవంతంగా ఎదుగుతాడని అన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని మహిళా శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య శాఖలకు సూచించారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన సమావేశాలు, ఇంటింటి ప్రచారం నిర్వహించి తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగించాలన్నారు. పోషకాహార లోపం, శిశు మరణాలు తగ్గించడంలో తల్లిపాలు కీలకమని, పోషక అభియాన్ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు.ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవ సహాయం, డీఆర్వో, సంక్షేమ శాఖ అధికారి పాండు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్ కర్నూల్, ఆగస్టు 03 (వుదయం బ్యూరో):**

ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 56 వినతిపత్రాలను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ప్రజల సమస్యలను ఓపికగా విని, సంబంధిత శాఖల అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రతి అర్జీపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి అర్హులకు న్యాయం చేయాలన్నారు. ప్రజలకు పారదర్శక పాలన అందించడమే లక్ష్యమని, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం సహించబోమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవ సహాయం, డీఆర్వో పాండు, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువుకు అమృతం

- బలిజపేట అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం

**ఐజ, ఆగస్టు 03 (వుదయం ప్రతినిధి)**



ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మున్సిపాలిటీ పరిధిలోని బలిజపేట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో, ఏఎన్ఎం ప్రమీల సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రయోజనాలపై వివరించారు. తల్లిపాలలో శిశువు ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలు సమృద్ధిగా ఉండటంతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. తల్లిపాలు శిశువులను అనేక అంటువ్యాధుల నుంచి రక్షించడంతో పాటు ఆరోగ్యకరమైన శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని వివరించారు. ఆరు నెలల అనంతరం పౌష్టికాహారంతో పాటు రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలు కొనసాగించడం తల్లి, బిడ్డ ఇద్దరి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని సూచించారు. ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి శిశువులకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు ఉష, అరుణ, గర్భిణీలు, బాలింతలు, తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుదారులు మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి తీసుకోవాలి

- జిల్లా వైస్ ప్రెసిడెంట్ కురువ రాములు

**ఐజ, ఆగస్టు 03 (వుదయం ప్రతినిధి)**



ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భారత ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా రేషన్ కార్డుదారులకు మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడానికి అనుమతి ఇచ్చినట్లు జిల్లా వైస్ ప్రెసిడెంట్ కురువ రాములు తెలిపారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన బియ్యాన్ని ఒకేసారి చౌకధర దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్నందున, అర్హులైన రేషన్ కార్డుదారులు తమకు కేటాయించిన రేషన్ షాపులకు వెళ్లి బియ్యాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మూడు నెలల బియ్యం పంపిణీ జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అపోహలకు తావివ్వకుండా, నిర్ణీత సమయంలో చౌకధర దుకాణాలను సందర్శించి బియ్యాన్ని స్వీకరించాలని జిల్లా వైస్ ప్రెసిడెంట్ కురువ రాములు విజ్ఞప్తి చేశారు.



# గ్రేటర్ హైదరాబాద్



## కృష్ణవేణిలో గోరింటాకు పండుగ వేళ అతివల ఆనంద హేల



స్థానిక కృష్ణవేణీ ఉన్నత పాఠశాల ఆవరణలో నేడు ఆశాడ మాసం సందర్భంగా విద్యార్థిని విద్యార్థుల మాతృమూర్తులు మరియు పాఠశాల ఉపాధ్యాయినుల ఆధ్వర్యంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి రఫత్ సుల్తాన గారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులను మా తృ మూ రు_ లం ద రి ని గోరింటాకుతో వారి చేతులను ఎంతో అందంగా అలంకరించారు ఇందులో పాఠశాల ప్రిన్సిపాల్ గారు మాట్లాడుతూగోరింటాకును ముద్దగా నూరి చేతికి, పాదాలకు పెట్టుకుంటే ఎర్రని రంగుతో అందంగా ఉంటాయని, ఇది గౌరీ దేవి ప్రతీక మరియు అమ్మాయిలకు గోరింటాకు ఎర్రగా పండితే మంచి మొగుడు వస్తాడని చెప్పేవారు. భారతీయులు పెళ్ళి సమయంలో దీన్ని తప్పనిసరిగా వాడతారనీ గోరింటాకు విశిష్టతను ప్రిన్సిపల్ గారు వివరించారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఫెన్సింగ్ తీసిన వారిపై పోలీస్ కేసు నమోదు చేయాలి...

: ఆకుల సతీష్

కుత్బుల్లాపూర్,
ఆగష్టు 3,(వుదయం ప్రతినిధి )



సర్వే నెంబర్ 23 పేట్ బషీర్ బాద్ నందు విలువైన రెండు ఎకరాల స్థలానికి రెవెన్యూ అధికారులు జూన్ నెలలో ఫెన్సింగ్ వేస్తే ఫెన్సింగ్ ని తొలగించి కబ్జా చేయడానికి ప్రయత్నించిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, ప్రభుత్వ భూమికి మళ్లీ ఫెన్సింగ్ వేసి రక్షించి ప్రజా అవసరాలకు కేటాయించాలని ఆకుల సతీష్ ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ కు ఫిర్యాదు చేసారు. ఈ ప్రభుత్వ భూమిని గతంలో కేటాయించిన విధంగా డీసీపీ కార్యాలయానికి వాడుకునే విధంగా చూడాలని లేనియెడల ప్రజా అవసరాల కోసం కేటాయించి కాపాడాలని అన్నారు. కుత్బుల్లాపూర్ అధికారులు ప్రభుత్వ భూమిని ప్రైవేటు బిల్డర్ వాడుకోకుండా కందకాలు తవ్వడం జరిగిందని ఇప్పటి వరకు పోలీసులకి ఫిర్యాదు చేయనట్టు సమాచారం, తక్షణమే ఫెన్సింగ్ బోర్డు తొలగించి కబ్జాకు ప్రయత్నించిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయలని సతీష్ కోరారు.

## 275 డివిజన్ లో కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

బాచుపల్లి,
ఆగష్టు 3,(వుదయం ప్రతినిధి ),



నిజాంపేట సర్కిల్ లో నూతనంగా ఏర్పాటు చేసిన బండారి లేఅవుట్ డివిజన్ 275 పరిధిలో పెరుగుతున్న జనాభా ఓటర్ల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని డివిజన్ పరిధిలో కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిజాంపేట్ బిజెపి అధ్యక్షులు భిక్షపతి యాదవ్ నిజాంపేట్ సర్కిల్ కు సంబంధించిన అధికారులను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాంపేట సర్కిల్ కు డిప్యూటీ కమిషనర్ అసిస్టెంట్ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారిగా వ్యవహరిస్తున్నారని ఈ డివిజన్ పరిధిలోని బండారి లేఅవుట్ కమ్యూనిటీ హాల్, పూజిత్ ఎన్క్లేవ్ కమ్యూనిటీ హాల్ లను కొత్త పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేసేందుకు వాటిని పరిశీలించాలని ఈ ప్రాంతాల్లో పెరుగుతున్న ఓటర్ల సంఖ్యను, ప్రస్తుత పోలింగ్ కేంద్రాలకు కొంతమంది ఓటర్లు ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తున్నందున వయోవృద్ధులు పెద్దవారు ఓటింగ్ సరళికి దూరంగా ఉంటున్నారని దీనిని దృష్టిలో ఉంచుకొని పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ పైన అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సంబంధిత అధికారులు ఎన్నికల నిబంధనలు, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతిపాదనను పరిశీలించి, అవసరమైన చోట కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచిన్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పట్నం రుక్కమ్మకు ప్రముఖుల ఘన నివాళి

చేవెళ్ల
ఆగస్ట్ 3 (వుదయం)



శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాతృమూర్తి పట్నం రుక్కమ్మ దశదినకర్మ కార్యక్రమం ఆదివారం మొయినాబాద్‌లోని జేపీఎల్ కన్వెన్షన్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, పలువురు మంత్రులు, మాజీ మంత్రులు కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు హాజరై పట్నం రుక్కమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం పట్నం మహేందర్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.అంతకుముందు షాబాద్ మండలం గొల్లూరుగూడలోని పట్నం రుక్కమ్మ స్వగ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్కెపల్లి మాజీ ఎంపీటీసీ వనం మాధవి, సీనియర్ యువ నాయకుడు వనం లక్ష్మీకాంత్ రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి పట్నం రుక్కమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం మొయినాబాద్‌లోని జేపీఎల్ కన్వెన్షన్‌లో జరిగిన దశదినకర్మ కార్యక్రమానికి హాజరయ్యారు.కార్యక్రమంలో శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ జడ్పి చైర్ పర్సన్ సునీతమహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు జగదీష్ రెడ్డి, షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి, సీనియర్ యువ నాయకుడు వనం లక్ష్మీకాంత్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దుండిగల్ లో యూజీడీ పనులకు శంకుస్థాపన

దుండిగల్,
ఆగష్టు 3,(వుదయం ప్రతినిధి ),



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్ 296 డివిజన్ లో డ్రైనేజీ, మౌలిక సదుపాయాల సమస్యలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి రాగా ఆయన ప్రత్యేక చొరవతో సిఎంసీ నిధుల నుంచి రూ.70 లక్షలు మంజూరు చేయించి ఈ నిధులతో దుండిగల్ గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ ) అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించడంతో పాటు దుండిగల్ గ్రామం, 296వ డివిజన్ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు అమరం ముత్యం రెడ్డి, మాజీ సర్పంచ్ కావలి గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వరగాని వాసు, ఆకుల ప్రేమ్ కుమార్ పటేల్, కావలి శశి కుమార్, ఆకుల మధు, చిన్న ముత్యం రెడ్డి, బిక్షపతి రెడ్డి, ఉదయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ రహిత తెలంగాణయే లక్ష్యంగా "సురక్ష కా తిరంగా"

సిద్దిపేట,
ఆగస్టు 3 (వుదయం బ్యూరో)

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (హైదరాబాద్) ఆదేశాల మేరకు జాతీయ సైబర్ జాగ్రూకత దివస్‌ను పురస్కరించుకుని "సురక్ష కా తిరంగా - సైబర్ స్వతంత్ర తెలంగాణ వైపు" అనే నినాదంతో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త సైబర్ అవగాహన ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ చొరవలో భాగంగా ఈ నెల 5వ తేదీ (బుధవారం) ఉదయం 10:00 గంటలకు సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ప్రస్తుత కాలంలో పౌరులను తీవ్ర ఆర్థిక నష్టాలకు గురిచేస్తున్న స్టాక్ ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ మరియు బిజినెస్ స్కామ్‌లపై ఈ సందర్భంగా ప్రజలకు ప్రత్యేకంగా అవగాహన కల్పించనున్నారు. ప్రారంభ రోజున ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు బహిరంగ అవగాహన ర్యాలీలు, సమావేశాలతో పాటు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారు. అలాగే సైబర్ సేఫ్టీ పోస్టర్లను విడుదల చేయడంతో పాటు, సైబర్ నేరాల నివారణకు "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" ప్రతిజ్ఞ చేయిస్తారు. పెట్టుబడి మోసాలపై రూపొందించిన అవగాహన చిత్రం, 1930 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ ప్రచార చిత్రాన్ని ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమాలు కేవలం ఒక్క రోజుకే పరిమితం కాకుండా, ఆగస్టు నెల పొడవునా కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పాఠశాలలు, కళాశాలలు, ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు మరియు సాధారణ ప్రజలను భాగస్వామ్యం చేస్తూ నిర్వహించనున్నారు. ఈ ప్రచారాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రజల నుంచి సృజనాత్మక రచనలు, కళారూపాలను ఆహ్వానిస్తున్నట్లు కమిషనరేట్ వర్గాలు తెలిపాయి. వయోపరిమితితో సంబంధం లేకుండా సైబర్ భద్రతపై పాటలు, లఘు చిత్రాలు (గరిష్టంగా 3 నిమిషాలు), వీడియోలు, పెయింటింగ్స్, పోస్టర్లు, వ్యాసాలను రూపొందించి commissioneratesdpt@gmail.com ఇమెయిల్ లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ అధికారిక ఇన్స్టాగ్రామ్ పేజీకి ఈ రోజు నుంచి ఈ నెల 30వ తేదీ ఉదయం 6:00 గంటల లోపు పంపాలని కోరారు. తెలంగాణను సైబర్ భద్రత కలిగిన రాష్ట్రంగా మార్చే ఈ కార్యక్రమంలో పౌరులందరూ చురుగ్గా పాల్గొని విజయవంతం చేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పిలుపునిచ్చింది.

## ఎస్సీ వర్గీకరణను ఉపసంహరించుకోవాలి



- శాంతియుత పోరాటానికి మాలలు సిద్ధం కావాలి
- వర్గీకరణ పేరుతో దళితులపై కుట్ర - సామాజిక న్యాయం అమలు చేయాలి
- డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్

నాగర్ కర్నూల్,
ఆగస్టు 03 (వుదయం బ్యూరో):

ఎస్సీ వర్గీకరణను వెంటనే ఉ ప సం హ రిం చు కో వా ల ని లేనిపక్షంలో శాంతియుత పోరాటానికి సిద్ధం కావాలని మాల మహానాడు నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్. ఆర్ఎస్ రత్నాకర్ పిలుపునిచ్చారు. వర్గీకరణ పేరుతో దళితులపై రాజకీయ కుట్ర జరుగుతుందని ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో మాల సామాజిక వర్గం ఉనికికే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఎస్సీ జాబితాలో ఉన్న 1108 కులాలకు, తెలుగు రాష్ట్రాల్లో 59 కులాలకు రెండు సీట్లు ఎలా పంచుతారని ప్రశ్నించారు.
సామాజిక న్యాయం అనేది రిజర్వేషన్లలో మాత్రమే కాకుండా దేశ సంపద, మంత్రి పదవుల పంపిణీలో కూడా అమలవ్వాలన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో చట్టం వచ్చేంతవరకు నిరంతరం శాంతియుత ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు.
ప్రజలు కోరితే ఏ చట్టమైనా, ఏ ప్రభుత్వమైనా ప్రజాస్వామ్యంలో వెనక్కి తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని టార్గెట్ చేస్తున్నాయని, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు.
ఈ సమావేశంలో బీరం సతీష్‌కుమార్, కూన సుధాకర్, నూనె క్రాంతి కుమార్, డాక్టర్. చెన్నయ్య, డాక్టర్. శంకరయ్య, కె. గిరీష్, బి. బసవరాజ్, తైలి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అరచేతిలో ఎర్రటి కాంతి.. ఆధునికతపై సంప్రదాయ విప్లవం!

ధరూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హోరెత్తిన 'గోరింటాకు' సంబరాలు
* పాశ్చాత్య సంస్కృతికి చెక్.. బడి ప్రాంగణంలో బతుకు పండుగ!
* తరగతి గది దాటి పాఠాలు చెప్పిన 'ధరూర్' బడి

ధరూర్
ఆగస్టు 03 (వుదయం బ్యూరో)




పాశ్చాత్య సంస్కృతి వ్యామోహంలో పడి సొంత మూలాలను మర్చిపోతున్న నేటి తరానికి పాఠశాల ప్రాంగణమే ఒక మార్గదర్శిగా నిలిచింది! కనుమరుగవుతున్న మన సనాతన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రాణం పోస్తూ, జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒక అద్భుత ఘట్టానికి వేదికైంది. పవిత్ర ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన 'గోరింటాకు మహోత్సవం' పాఠశాల ఆవరణను సంస్కృతీ శోభతో ముంచెత్తింది. అరచేతులపై విరిసిన ఆర్ట్... అచ్చెరువొందిన ఉ పా ధ్యా యు లు ! పా ఠ శా ల ప్రధానోపాధ్యాయులు శ్రీ నరేష్ పర్యవేక్షణలో సాగిన ఈ వేడుకల్లో విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణతో అదరగొట్టారు. డిజిటల్ తెరలకే పరిమితమవుతున్న విద్యార్థుల వేళ్లు, కాగితం లేకుండానే తమ అరచేతులపై గోరింటాకుతో అద్భుత కళాఖండాలను ఆవిష్కరించాయి. విద్యార్థినుల సృజనాత్మకతను, ఆకర్షణీయమైన అలంకరణలను చూసి మహిళా ఉపాధ్యాయినులు, తోటి ఉపాధ్యాయులు ఎంతగానో ప్రశంసించారు. పుస్తకాల మోజులో మూలాలను మరవొద్దు: ప్రధానోపాధ్యాయులు నరేష్ ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీ నరేష్ గంభీరంగా మాట్లాడుతూ— "కేవలం మార్కులు, ర్యాంకుల వెంట పరిగెత్తే చదువు వ్యర్థం! సాంకేతికత ఎంత పెరిగినా మన మూలాలను, సాంప్రదాయ విలువలను మర్చిపోతే మన ఉనికికే ప్రమాదం. విద్యార్థుల్లో సాంస్కృతిక చైతన్యాన్ని రగిలించి, భావితరాలకు మన వారసత్వాన్ని అందించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించాం" అని స్పష్టం చేశారు. కేవలం పుస్తకాల పాఠాలకే పరిమితం కాకుండా, సంస్కృతిని ఆచరణలో చూపిస్తూ ధరూర్ ఉన్నత పాఠశాల నిర్వహించిన ఈ వేడుక జిల్లా వ్యాప్తంగా ఆదర్శంగా నిలిచింది!

## అంగరంగ వైభవంగా ముగిసిన విశ్వశాంతి మహాయాగం

వెల్దండ
ఆగస్టు 3 (వు దయం )



కల్వకుర్తి పట్టణంలో జూలై 19 నుంచి ఈనెల మూడు వరకు నిర్విరామంగా 15 రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించిన శ్రీకృష్ణ కాలచక్ర మహాయాగం సోమవారం చివరి రోజు నిర్వహించిన పూర్ణాహుతి మహోత్సవంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి , మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి , లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి చండీయాగం నిర్వహించడం కల్వకుర్తి నియోజకవర్గ పాడి పంటలతో సస్యశ్యామలంగా జన జీవితం కొనసాగాలని ప్రజలు అభినందనీయమని అన్నారు అనంతరం స్వామివారి ఆశీస్సులు పొందారు చివరి రోజు సుమారు 5000 మంది దాకా భక్తులు పాల్గొన్నారుఈ పుణ్య కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ,మండల, పట్టణ కాంగ్రెస్ ముఖ్య నాయకులు, మండల మరియు పట్టణ ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## సెప్టెంబర్ 9 వరంగల్ జాతీయ సమావేశాన్ని విజయవంతం చేద్దాం

డివిజన్, బస్తీ కమిటీల నిర్మాణంతో ఉద్యమాన్ని బలోపేతం చేయాలి: MRPS నాయకులు

ముషీరాబాద్,
ఆగస్టు 03(వుదయం)

పద్మశ్రీ మందాకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు MRPS-MSP మరియు అనుబంధ సంఘాల ముషీరాబాద్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం బాగ్‌లింగంపల్లి డివిజన్‌లోని MRPS ముషీరాబాద్ నియోజకవర్గ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎడవెల్లి యాదయ్య మాదిగ, కోఇన్‌చార్జ్ మునిరాతి రామకృష్ణ మాదిగ మాట్లాడుతూ, పద్మశ్రీ మందాకృష్ణ మాదిగ నాయకత్వంలో సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించనున్న MRPS- పిలుపునిచ్చారు.జాతీయ సమావేశం విజయవంతం కమిటీలను రాములు మాదిగ (MSP బాగ్‌లింగంపల్లి డివిజన్ ఇన్‌చార్జ్), తొట్ల గోపి మాదిగ (MRPS బాకారం డివిజన్ ఇన్‌చార్జ్), అమ్మగూడెం దశరథ్ మాదిగ (MRPS భోలక్‌పూర్ డివిజన్ ఇన్‌చార్జ్), రోషన్ వినాయకరావు మాదిగ (MSP ముషీరాబాద్ డివిజన్ ఇన్‌చార్జ్), జేరిపోతుల చంద్రవాస్ మాదిగ, రెడ్డి సంగయ్య మాల, మినప నర్సింగ్‌రావు మాదిగతో పాటు MRPS కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


**IN THE COURT OF THE HON`BLE IIIADDL. JUNIOR CIVIL JUDGE-CUM- III ADDL. JUDICIAL FIRST CLASS MAGISTRATE, RANGA REDDY DISTRICT AT: L.B. NAGAR**
**O.S. NO: 518 OF 2026**

***Between:***
Boddupally Shobha & Others
**... Plaintiffs**
**AND**
All Concerned & Others
**... Defendants**

Please take notice that the plaintiffs herein have filed above suit to declare them as legal heirs of BODDUPALLY RAMULU, who is the husband of plaintiff no: 2 and father of plaintiff no: 3-6 Therefore, if any person (or) persons have got any objections they may appear before this court on 11-August-2026 at 10:30 A.M. with all relevant documents, failing which the matter will be decided on merits.

**[By order of the court ]**
**sd/-**
***V. JAHNAVIVISHNU PRIYA***
***ADVOCATE***
***PH: 6302422477***
***HYDERABAD***

**IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE AT:SECUNDERABAD**
**O.S NO. 499 OF 2026**

***Between:***
Buchamagari Advaiah (Died)& Others
**... Plaintiffs**
**AND**
THE TAHSILDAR, Bowenpally, Secunderabad and Others
**... Defendants**

Please take notice that the above-named Petitioners filed above suit against all concerned and another for issuance of Legal Heir Certificate to Plaintiffs who are legal heirs of late Buchamagari Advaiah died The said case stands posted to 20-08-2026 for objections if any from all concerned. Therefore, make it to be convenient to present at 10.30 A.M. on 20-08-2026 before the Hon'ble XI Junior Civil Judge at Secunderabad with your objections or claims if any. Failing which the matter will be heard and decided in your absence as per the records available on record.

**[By order of the court ]**
**sd/-**
***E.SUBHAVATHI***
***ADVOCATE***
***OFFICE : - 20/1, Railway Colony , South Lallaguda ,Mettuguda Secunderabad -500017***
***Mobile : 9573099798***

**IN THE COURT OF HON'BLE CHIEF JUDGE CITY CIVIL COURT HYDERABAD**
**O.S. NO. 294 OF 2026**

***Between:***
Sunnam Ashok Kumar, others
**... Plaintiffs**
**AND**
Tahasildar, Musheerabad Mandal & others
**... Defendants**

To
All Concerned
**Defendant no.4**

Please take notice that, plaintiffs herein i.e. Sunnam Ashok Kumar and others have filed OS. No.294 of 2026 on the file of Hon'ble Chief Judge, City Civil Court, Hyderabad to declare them as legal heirs in view of death of Smt. Sunnam Susheela who died on 18-3-2019 in respect of (3) proper ties (1) House bearing no. 1-6-174/14 admeasuring 291 sq. yards equivalent to 242.27 sq. meters consisting of ground + 2 floors situated at Bahadur Yar Jung colony, Zamisthanpur, Musheerabad Mandal, Hyderabad, bounded by: North : H.no.1-6-174/13 of N. Sathyanarana South: Neighbour's property East : 30' wide Road and West : H.no.1-6-174/21 of Neighbours which is referred as Schedule A Property; (2) All that agriculture land admeasuring Ac.2-00 in Sy.no.54 situated at Gudur (v) Bibinagar Mandal, presently Yadadri Bhuvanagiri District, bounded by; North : Neighbour's Agriculture land South: part of Agriculture land in Sy.no.54 now purchased by S.Ashok Kumar East : Neighbour's Agriculture land and West : Neighbour's Agriculture land which is referred as Schedule B Property; and (3) All that, piece and parcel of open plot vide plot no. 203A admeasuring 200 sq. yards in Sy.nos. 248/EE, 248/A, 249/A, 248/VU, 248/E, 249/E, 249/EE, 244 & 244/A/3, 244/EE, 249/A and 244/VUU situated at Padakal (v) Talakondapally (M) Presently Ranga Reddy District, bounded by: North : Plot no. 202 South: Plot no.203B East : 33' -0" wide Road West :blic) are hereby intimated that if anybody is having any objection or claim over the above said property or objection may respond immediately and appear before the Hon'ble Chief Judge, City Civil Court Hyderabad, on 21-8-2026 at 10-30 A.M. for filing objections if any, failing which the matter will be decided ex-parte.

**[AS PER THE ORDERS OF THE HON'BLE COURT]**
**sd/-**
***K. SEETHARAMARAO***
***D.N. GOUTHAM***
***ADVOCATES***
***H.NO.1-3-183/40/68/C/2 GANDHINAGAR, HYDERABAD -80***
***mobile no : 9948130900***




### స్థాయిని దిగజార్చుకోవద్దు

"ఎంతటి వ్యక్తులైనా సరే.. తమకు అధికారం, అజమాయిషీ ఉంది కదాని ఎదుటి వారితో ఇష్టానుసారంగా వ్యవహరించకూడదు. నోటిని అదుపులో పెట్టుకోవాలి. హద్దు మీరి ప్రవర్తించకూడదు. తమ తమ పద్ధతులు, పరిధులు, పరిమితుల్లో ఉండాలి. అంతేతప్ప తమ స్థాయిని దిగజార్చుకోవద్దు. కానీ అందుకు భిన్నంగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. చదువుకున్న పిల్లలు ఉద్యోగాలు అడిగితే ఎండ్రిన్ తాగి చావండంటూ ముఖ్యమంత్రి అనొచ్చా..? ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను క్రిమినల్ వేస్ట్ అని సీఎం అనటం ఎంతవరకు సమంజసం? ఆయన బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారు. గ్రాడ్యుయేట్ల గురించి మాట్లాడుతున్న సీఎం ఎప్పుడైనా, ఏ ఒక్క ఇంటర్వ్యూకైనా వెళ్లారా."

**- కేటీఆర్, బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**

## వే'మన' పద్యం

**గంగ పారునెపుడు గదలని గతితోడ**
**మురికివాగు పారు మ్రోతతోడ**
**పెద్ద పిన్నతనము పేర్మియీలాగురా,**
**విశ్వదాభిరామ వినుర వేమా.**



# సంపాదకీయం

కిరీటాలు తగిలించుకొని ఊరేగుతున్న అహంభావాలకు గుండెలు గుభేలుమం టున్నాయి. జరిగిన పరిణామాలు మింగుడు పడటం లేదు. అసలు జీర్ణమవటం లేదు. జంతర్ మంతర్ ఉద్యమ ఘటన వాళ్లను నిద్రపోనీయటం లేదు. ఉద్యమానికి ఒక అడుగు వెనక్కి వేసామని కూడా అనుకోవడంతో లేదు. అసలు మంత్రి రాజీనామా చేస్తూ చెప్పిన మాటలు వింటే జెన్ జీ పోరాటాన్ని హేళన చేస్తున్నట్లుగానే ఉంది. ఇక మొత్తం బీజేపీ నాయకత్వం ఎదురుదాడితో, అబద్ధాలతో, అర్ధ సత్యాలతో విష ప్రచారానికి పూనుకొంటున్నది. పార్లమెంటులో ప్రతిపక్షాలు అడిగిన సూటియైన ప్రశ్నలకు ఒక్కదానికి సమాధానం చెప్పలేదు. పోలీసుల క్రూర దాడిలో క్షతగాత్రుల గురించి ఒక్కమాట లేదు. 'ఫ్రెండ్స్' అని సంబోధించిన మోడీ కక్షపూరితంగా విద్యార్థుల వేట, వారిపై కేసులు కొనసాగిస్తున్నాడు. అంతకుమించి విద్యార్థుల మీద అవమానకరమైన దాడికి పూను కుంటున్నారు. వారి మీడియా, అంధ భక్తులు, ఇన్ఫ్లుయెన్సర్లు ఇప్పటికీ నీచ ప్రచారానికి దిగుతూనే ఉన్నారు. బెదిరింపులకూ పాల్పడుతున్నారు. ఇదంతా దొంగే దొంగ దొంగ అన్న చందంగా ఉంది. వారి అజ్ఞానం అంధభక్తి శిఖరస్థాయికి చేరుతున్నది. చాలామంది ఈ ఉద్యమంతో కండ్లు తెరిచినా, మురికి కూపంలో మసలుతున్న వాళ్లు మాత్రం ఆగడం లేదు. అందులోనూ సినీ పరిశ్రమలో హీరోయిన్‌గా పేరొందిన ప్రస్తుత లోక్‌సభ సభ్యురాలు కంగనా రనౌత్ చేస్తున్న వ్యాఖ్యలు దేశ యువతను, కుటుంబాలను, తల్లిదండ్రులను కించపరిచే విధంగా ఉన్నాయి. ఆమె ఎందుకు అంత రెచ్చిపోయి మాట్లాడుతుందో, ఏమి ఆశిస్తున్నదో తెలియదు. ఈ దేశంలోనే కాదు, ప్రపంచ వ్యాప్తంగా, జెన్ జీ చేసిన ఉద్యమాన్ని, వారి శాంతియుత మార్గాన్ని పొగుడుతుంటే, గొప్ప ఉద్యమని ప్రశంసిస్తుంటే, మన రనౌత్ "గట్టర్ జనరేషన్" అన్నారు. అంటే మురికి కాలువ వంటివారని ఆమె పేర్కొన్నారు. అంతేకాదు, నా జీవితంలో ఇంత కంపును ఎప్పుడూ చూడలేదని, జెన్ జీ నిరసనకారుల రీల్స్ వాంతులు తెప్పించేలా ఉన్నాయని చెప్పారు. వాళ్లు మాట్లాడే భాష, విధానం నేనెప్పుడూ చూడలేదని వ్యాఖ్యానించారు. అంతేకాదు మరింత ముందుకు పోయి, ఇలాంటి వారిని ఎవరు కంటున్నారూ? అప్పుడు ఒక రైతు కుటుంబం నుండి వచ్చిన కానిస్టేబుల్ కుల్వీందర్ కౌర్ ఎయిర్ పోర్టులో తీవ్ర ఆగ్రహంతో చెంప చెల్లుమనిపించారు. ఇప్పుడు ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులను చాలా నీచంగా అభివర్ణించడంపై విద్యార్థిలోకం, తల్లిదండ్రులూ మండి పడుతున్నారు. సీజేపీ నాయకుడిని ఎందుకు పనికిరానివాడని, చదువు, ఉద్యోగం లేనివాడని తిట్టిపోశారు. అతను జర్నలిస్టు, కాక్రోచ్ ఉద్యమంలో పాల్గొంటున్న విద్యార్థులంతా ఉన్నత చదువులు చదువుతున్నవాళ్లే. స్వాతంత్ర్యం తర్వాత ప్రధాని సుభాష్

## అది నోరా? మోరీయా?

చంద్రబోస్ అని వాదించిన కంగనకు ఎంత చదువు వచ్చో అందరికీ తెలిసిందే. అందుకే ఆమెకు సమాధానం చెప్పడం కూడా వ్యర్థమని భావిస్తున్నారు. ఉద్యమంలో నేరస్తులున్నారని చెబుతున్న ప్రభుత్వం, పార్లమెంటులో నేరపూరిత కేసులున్న యాభై శాతం సభ్యులున్నారని, అందులో వందమంది బీజేపీ వారేనని, వాళ్లపై చర్యలు తీసుకోవాలని వాళ్లు కోరుతున్నారు. ఇప్పుడు మోడీని తిట్టినందుకు కేసులు పెడుతూ నిర్బంధిస్తున్నారు. విపరీతమైన అశ్లీల భాషను వాడుతున్నవాళ్లు సోషల్ మీడియాలో సంఘ పరివారమే. ఇక కంగనా రనౌత్ వేష భాషలు, ఫొటోషూట్‌లు, విచ్చలవిడి ప్రవర్తనలు ఎవరికీ తెలియనివి కావు. అలాంటి వ్యక్తులే అశ్లీలత గురించి మాట్లాడటం మరీ విడ్డూరంగా ఉంది. పైగా జెన్ జీ నాయకులను విమర్శించినవాళ్లు, హేళన చేసినవాళ్లు, బీజేపీలోకి రమ్మని కోరటం చూస్తే వాళ్లెంత దిగజారి ఉన్నారో అర్థమవుతోంది. ఇక కేరళకు చెందిన టి.జి.మోహన్ దాస్, సంఘ్ సభ్యుడు మరింత దారుణంగా మాట్లాడాడు. 'నా కంట్రోల్‌లో ఉంటే జంతర్ మంతర్‌లో జెన్ జి ఉద్యమకారులను కాల్చేసేవాన్ని, కొందరు చచ్చేవాళ్లు, ఇంకొందరి కాళ్లూ చేతులు విరిగేవి' అన్నాడు. మరీ దుర్మార్గంగా అమ్మాయిలపై వ్యాఖ్యలు చేశాడు. ఇతనిపై ఏ కేసూ నమోదు చేయడం లేదు మరి! మహిళలు ఇంటికే పరిమితం కావాలన్న ఆలోచనలున్నవారికి, ఇంతకంటే మంచి మాటలేమి వస్తాయి. ప్రాణాలకు తెగించి పోరాడిన విద్యార్థులను అవమానించడం, తల్లిదండ్రులనూ నిందించడం కేవలం గట్టర్ మౌత్‌లే చేయగలవు!

**రచనలు పంపండి**

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# ప్రశ్నకు కావాల్సింది సమాధానమే

**భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను కల్పించింది. అదే సమయంలో ఆ స్వేచ్ఛకు రాజ్యాంగపరమైన పరిమితులు కూడా ఉన్నాయి. వ్యక్తిగత దూషణలు, ద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు, హింసకు ప్రేరేపించే చర్యలు చట్టపరమైన పరిశీలనకు లోబడతాయి. అయితే ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ విధానాలను, ప్రధానమంత్రిని లేదా ఇతర ప్రజాప్రతినిధులను విమర్శించడం మాత్రమే నేరంగా పరిగణించబడదు. అందువల్ల ప్రతి కేసును దాని వాస్తవ పరిస్థితులు, వర్తిం చే చట్టాలు, న్యాయస్థానాల పర్యవేక్షణ ఆధారంగా పరిశీలించడం అవసరం. అదే సమయంలో చట్టం ఎంపికచేసి అమలవుతోందనే భావన ప్రజల్లో ఏర్పడకుండా ప్రభుత్వం జాగ్రత్త పడాలి.**

ప్రజాస్వామ్య వ్యవస్థలో విద్యార్థి ఉద్యమాలు, యువజన నిరసనలు కొత్త విషయం కావు. ప్రపంచ చరిత్రను పరిశీలించినా, భారతదేశ రాజకీయ పరిణామాలను విశ్లేషించినా, సామాజిక మార్పులకు, విద్యా సంస్కరణలకు, ప్రజాస్వామ్య పునరుజ్జీవనానికి యువతే ప్రధాన చోదకశక్తిగా నిలిచింది. అధికార వ్యవస్థలు ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోయిన సందర్భాల్లో విద్యార్థులే ముందుకు వచ్చి ప్రజా చర్చను నిర్మించారు. ఇటీవల పరీక్షల నిర్వహణలో లోపాలు, ప్రశ్నాపత్రాల లీకులు, ఉపాధి అవకాశాలపై అనిశ్చితి, ప్రభుత్వ జవాబుదారీతనం వంటి అంశాల నేపథ్యంలో దేశవ్యాప్తంగా యువతలో పెరిగిన అసంతృప్తి జంతర్ మంతర్ వేదికగా మరోసారి బయటపడింది.

కాక్రోచ్ జనతా పార్టీ పిలుపుతో జరిగిన ఈ నిరసనల్లో విద్యార్థులు, యువతతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సాధారణ పౌరులు కూడా పాల్గొనడం ఉద్యమానికి విస్తృత సామాజిక మద్దతు లభించిందనే సంకేతాన్ని ఇచ్చింది. ఉద్యమం తీవ్రతరమైన తర్వాత కేంద్ర ప్రభుత్వం పరీక్షా వ్యవస్థలో సంస్కరణల అవసరాన్ని అంగీకరించడం, కొన్ని రాజకీయ పరిణామాలు చోటు చేసుకోవడం, విద్యార్థులపై నమోదైన కొన్ని కేసులను ఉపసంహరించుకునే దిశగా చర్యలు తీసుకుంటామని ప్రకటించడం ప్రజాస్వామ్య ఒత్తిడికి ప్రభుత్వాలు ఎలా స్పందిస్తాయో చూపించింది. అయితే మరోవైపు, నిరసనల్లో పాల్గొన్న కొందరిపై నమోదైన కేసులు కొనసాగుతున్నాయనే వార్తలు ప్రజల్లో కొత్త ప్రశ్నలను లేవనెత్తాయి.

ప్రత్యేకంగా విద్యార్థిని రుచిగా సింగ్‌పై ప్రధానమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో ఎఫ్.ఐ.ఆర్. నమోదు కావడం, ఆ కేసు కొనసాగుతుండడం రాజకీయంగానూ, న్యాయపరంగానూ చర్చనీయాంశమైంది. ఈ చర్యను ప్రతిపక్ష నాయకులు రాజకీయ కక్షసాధింపుగా అభివర్ణిస్తుండగా, చట్టాన్ని అమలు చేయడం పోలీసుల బాధ్యత అని అధికార వర్గాలు వాదిస్తున్నాయి. ఈ రెండు వాదనల మధ్య అసలు ప్రశ్న మాత్రం ఒకటే—ప్రజాస్వామ్యంలో విమర్శకు ఉన్న హద్దులు ఏమిటి? అలాగే చట్ట అమలులో సమానత్వం ఎంతవరకు పాటించబడుతోంది? భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను కల్పించింది. అదే సమయంలో ఆ స్వేచ్ఛకు రాజ్యాంగపరమైన పరిమితులు కూడా ఉన్నాయి. వ్యక్తిగత దూషణలు, ద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు, హింసకు ప్రేరేపించే చర్యలు చట్టపరమైన పరిశీలనకు లోబడతాయి. అయితే ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ విధానాలను, ప్రధానమంత్రిని లేదా ఇతర ప్రజాప్రతినిధులను విమర్శించడం మాత్రమే నేరంగా పరిగణించబడదు. అందువల్ల ప్రతి కేసును దాని వాస్తవ పరిస్థితులు, వర్తించే చట్టాలు, న్యాయస్థానాల పర్యవేక్షణ ఆధారంగా పరిశీలించడం అవసరం. అదే సమయంలో చట్టం ఎంపికచేసి అమలవుతోందనే భావన ప్రజల్లో ఏర్పడకుండా ప్రభుత్వం జాగ్రత్త పడాలి. ఈ ఉద్యమం మరో ముఖ్యమైన అంశాన్ని కూడా తెరపైకి తీసుకొచ్చింది. రాజకీయ పార్టీల నిధుల పారదర్శకత. దేశంలో అన్ని రాజకీయ పార్టీల ఆదాయ వనరులు, విరాళాల వివరాలు, వ్యయ విధానం ప్రజలకు మరింత పారదర్శకంగా అందుబాటులో ఉండాలనే డిమాండ్ గత కొన్నేళ్లుగా బలపడుతోంది. ప్రజాస్వామ్యంలో పారదర్శకత ఏ ఒక్క పార్టీకి మాత్రమే వర్తించే సూత్రం కాదు. అధికార పార్టీ అయినా, ప్రతిపక్ష పార్టీ అయినా, కొత్తగా ఏర్పడిన రాజకీయ సంస్థ అయినా ఒకే ప్రమాణాలకు లోబడి ఉండాలి. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేది చట్టపరమైన సమానత్వమే. అలాగే రాజకీయ నాయకులపై నమోదైన క్రిమినల్ కేసుల అంశం కూడా నిరంతరం చర్చలో ఉంది. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులపై తీవ్రమైన ఆరోపణలు నమోదైన సందర్భాలు ఉన్నాయి.



అయితే ఆరోపణ నమోదు కావడం, నేరం నిరూపితమవడం రెండూ ఒకటి కావు. ప్రతి ఒక్కరికీ న్యాయపరమైన విచారణ, సహజ న్యాయ సూత్రాల ప్రకారం తన వాదన వినిపించే హక్కు ఉంది. అదే సమయంలో ప్రజాప్రతినిధులపై ఉన్న తీవ్రమైన కేసులను సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంచడం కూడా ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. వేగవంతమైన, నిష్పాక్షిక విచారణే ప్రజల విశ్వాసాన్ని పెంచుతుంది. ఇటీవలి కాలంలో యువత ఉద్యమాల స్వరూపం కూడా మారింది. ఒకప్పుడు రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో మాత్రమే ఉద్యమాలు జరిగేవి. ఇప్పుడు సామాజిక మాధ్యమాల ద్వారా స్వయంగా యువత అభిప్రాయాలను వ్యక్తం చేస్తోంది. సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతున్న ఈ కాలంలో ప్రభుత్వ నిర్ణయాలు, పోలీసు చర్యలు, న్యాయపరమైన పరిణామాలు క్షణాల్లో దేశవ్యాప్తంగా చర్చకు వస్తున్నాయి. ఈ కొత్త వాస్తవాన్ని ఏ ప్రభుత్వం కూడా విస్మరించలేను. సంభాషణకు బదులుగా అనుమానంతో స్పందిస్తే అసంతృప్తి మరింత పెరిగే ప్రమాదం ఉంటుంది. అదే సమయంలో ఉద్యమాలు కూడా బాధ్యతాయుతంగా ఉండాలి. రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కు ప్రజాస్వామ్యానికి బలం. అయితే శాంతియుత నిరసన, వాస్తవాధారిత విమర్శ, ప్రజా ఆస్తుల రక్షణ, వ్యక్తిగత గౌరవాన్ని కాపాడడం వంటి విలువలు కూడా అంతే ముఖ్యమైనవి. ప్రజాస్వామ్యం ప్రభుత్వం మాత్రమే కాపాడాల్సిన వ్యవస్థ కాదు; పౌరులు కూడా అదే బాధ్యతను పంచుకోవాలి. ఈ మొత్తం పరిణామం నుంచి ఒక స్పష్టమైన సందేశం వెలువడుతోంది. నేటి యువతకు అధికార భాష కంటే జవాబుదారీతనం ముఖ్యమైంది; ప్రచారం కంటే పారదర్శకత ముఖ్యమైంది; హామీల కంటే ఫలితాలు ముఖ్యమయ్యాయి. విద్య, ఉపాధి, పరీక్షల విశ్వసనీయత, సమాన అవకాశాలు, అవినీతి నియంత్రణ వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకుంటేనే యువత విశ్వాసాన్ని తిరిగి పొందగలదు. విమర్శలను శత్రుత్వంగా కాకుండా ప్రజాస్వామ్య స్పందనగా స్వీకరించినప్పుడే పరిపాలన బలపడుతుంది. చరిత్ర చెబుతున్న ఒక గొప్ప పాఠం ఏమిటంటే—ప్రజల ప్రశ్నలను తాత్కాలికంగా అణచివేయడం సాధ్యమవచ్చు; కానీ వాటిని శాశ్వతంగా మూయించడం సాధ్యం కాదు. ముఖ్యంగా చదువుకున్న, సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించే నేటి యువతతో ప్రభుత్వాల సంబంధం భయపెట్టడం పై కాకుండా ప్రభుత్వం బాధ్యతాయుతంగా, పారదర్శకతతో వ్యవహరించాలి, ఇప్పటికే ప్రజలు విశ్వాసం కోల్పోయిన కేంద్ర ప్రభుత్వం మరింత ఆత్మవిమర్శతో నిజాయితీగా రాజ్యాంగ నియమాలకు, పౌర హక్కులకు విలువ ఇస్తూ. ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారానికి నిజమైన బలం ప్రతిపక్షాన్ని బలహీనపరచడంలో కాదు; విమర్శలను వినగల ధైర్యంలో, తప్పులను సరిదిద్దుకునే సంస్కృతిలో, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే పరిపాలనలో ఉంటుంది అనే విషయాన్ని గ్రహించటం మంచిది. జన్ జీ యువత కు ఇచ్చిన మాటను నిలబెట్టుకోనే బాధ్యత పూర్తిగా కేంద్ర ప్రభుత్వం పైనే ఉంది. మాట తప్పితే కేంద్ర ప్రభుత్వం అధికారానికే ప్రమాదం ముంచుకు రావచ్చు.



డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.

# జర్నలి(జం)స్టుల దుస్థితి

ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం ఎదుర్కొంటున్న సవాళ్లు – సమగ్ర విశ్లేషణ


**భాగం—1: గౌరవం నుంచి గందరగోళం వరకు – జర్నలిజం ప్రయాణం**

"కలం కత్తికంటే గొప్పది" అని చరిత్ర చెబుతుంది. కానీ ఆ కలం పట్టిన చేతికి నేడు సమాజంలో ఎంత గౌరవం ఉంది? అధికారాన్ని ప్రశ్నించే గొంతుకు ఎంత రక్షణ ఉంది? ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టు జీవితానికి ఎంత విలువ ఉంది? ఈ ప్రశ్నలు కేవలం పాత్రికేయ వర్గానివి మాత్రమే కాదు; ప్రజాస్వామ్య భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్నలు కూడా.

భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను పరిశీలిస్తే, జర్నలిజం కేవలం వార్తలు అందించే వృత్తి కాదు. అది ఒక ఉద్యమం. అన్యాయాన్ని ఎదిరించే ఆయుధం. ప్రజలలో చైతన్యం నింపిన శక్తి. ఎన్నో పత్రికలు ప్రజల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించాయి. అధికారాన్ని ప్రశ్నించాయి. ప్రజల గొంతుకగా నిలిచాయి. అందుకే మీడియాను ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా పేర్కొన్నారు.

స్వాతంత్ర్యం తర్వాత కూడా పాత్రికేయ రంగం ఎన్నో చారిత్రక ఘట్టాలకు సాక్ష్యమైంది. కరవులు, వరదలు, అవినీతి, ప్రజా ఉద్యమాలు, ఎన్నికలు, సామాజిక మార్పులు—ప్రతి సందర్భంలోనూ జర్నలిస్టులు ప్రజలకు నిజమైన సమాచారాన్ని అందించేందుకు కృషి చేశారు. ఒక చిన్న వార్తతో గ్రామానికి రోడ్డు వచ్చింది. ఒక కథనంతో ఆసుపత్రిలో వైద్యుడు నియమితుడయ్యాడు. ఒక పరిశోధనాత్మక కథనం వల్ల అవినీతి వెలుగులోకి వచ్చింది. ఇవే జర్నలిజం గొప్పతనానికి నిదర్శనాలు.

అయితే కాలం మారింది. సాంకేతిక విప్లవం వచ్చింది. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు సమాచార ప్రపంచాన్ని పూర్తిగా మార్చేశాయి. ఇప్పుడు వార్తలు నిమిషాల్లో ప్రపంచమంతా చేరుతున్నాయి. ఇది ఒక గొప్ప అవకాశం అయినప్పటికీ, అదే సమయంలో ఒక పెద్ద సవాలుగా కూడా మారింది.నేడు సోషల్ మీడియాలో ఎవరైనా ఏ సమాచారాన్నైనా ప్రచారం చేయగలరు. కానీ ప్రతి సమాచారం వార్త కాదు. ప్రతి వైరల్ వీడియో వాస్తవం కాదు. ప్రతి పోస్టు నిజం కాదు. ఈ పరిస్థితుల్లో వాస్తవాలను నిర్ధారించి ప్రజలకు అందించే బాధ్యత మరింతగా జర్నలిస్టులపై పడింది.జర్నలిజం అంటే కేవలం సంఘటనను



చెప్పడం కాదు; నిజాన్ని నిర్ధారించడం, అన్ని కోణాలను పరిశీలించడం, ప్రజలకు సమతుల్య సమాచారాన్ని అందించడం. అదే మంచి జర్నలిజం. అదే ప్రజాస్వామ్య బలం.

అయితే ఈ విలువలతో పనిచేసే జర్నలిస్టుల పరిస్థితి నేడు ఆందోళన కలిగిస్తోంది. పెద్ద నగరాల్లోనే కాదు, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే అనేక మంది విలేకరులు తక్కువ వేతనాలు, అధిక పనిభారం, ఉద్యోగ భద్రత లేకుండా తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ప్రజల కోసం పరితపించే వ్యక్తి తన కుటుంబ భవిష్యత్తు గురించి ఆందోళన చెందాల్సిన పరిస్థితి రావడం బాధాకరం.

ప్రజల దృష్టిలో కూడా మార్పు వచ్చింది. ఒకప్పుడు పత్రికలో వచ్చిన వార్తకు విశ్వసనీయత ఉండేది. ఇప్పుడు "ఇది నిజమా? లేక సోషల్ మీడియాలో వచ్చిన ప్రచారమా?" అనే సందేహం ముందుకు వస్తోంది. ఈ పరిస్థితి నిజాయితీగా పనిచేసే పాత్రికేయులకు కూడా సవాలుగా మారింది.

అయితే ఒక విషయాన్ని మర్చిపోవద్దు. మంచి జర్నలిజం ఎప్పుడూ చనిపోదు. నిజం కోసం కష్టపడే జర్నలిస్టు ఎప్పుడూ సమాజానికి అవసరమే. ప్రకృతి విపత్తులు వచ్చినా, ప్రమాదాలు జరిగినా, ఎన్నికలు జరిగినా, ప్రజలు చివరకు విశ్వసనీయ సమాచారానికే ఎదురుచూస్తారు. ఆ విశ్వసనీయతను నిలబెట్టేది బాధ్యతాయుత జర్నలిజమే.ఇప్పుడు సమాజం, ప్రభుత్వాలు, మీడియా సంస్థలు, జర్నలిస్టులు—అందరూ కలిసి ఒక ప్రశ్నకు సమాధానం వెతకాలి. జర్నలిస్టు కేవలం వార్తలు రాసే ఉద్యోగి మాత్రమేనా? లేక ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యతగల ప్రజాసేవకుడా? సమాధానం రెండోది అయితే, ఆ బాధ్యతకు తగిన గౌరవం, రక్షణ, వృత్తిపరమైన స్వేచ్ఛ కూడా ఉండాలి.జర్నలిజం నిలబడితేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది. ప్రజాస్వామ్యం బలపడితేనే ప్రజల హక్కులు సురక్షితంగా ఉంటాయి. అందుకే జర్నలిస్టు గౌరవం అనేది ఒక వ్యక్తి గౌరవం మాత్రమే కాదు; అది ప్రజల తెలుసుకునే హక్కుకు ఇచ్చే గౌరవం.

**భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను పరిశీలిస్తే, జర్నలిజం కేవలం వార్తలు అందించే వృత్తి కాదు. అది ఒక ఉద్యమం. అన్యాయాన్ని ఎదిరించే ఆయుధం. ప్రజలలో చైతన్యం నింపిన శక్తి. ఎన్నో పత్రికలు ప్రజల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించాయి. అధికారాన్ని ప్రశ్నించాయి. ప్రజల గొంతుకగా నిలిచాయి. అందుకే మీడియాను ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా పేర్కొన్నారు.**

**స్వాతంత్ర్యం తర్వాత కూడా పాత్రికేయ రంగం ఎన్నో చారిత్రక ఘట్టాలకు సాక్ష్యమైంది. కరవులు, వరదలు, అవినీతి, ప్రజా ఉద్యమాలు, ఎన్నికలు, సామాజిక మార్పులు—ప్రతి సందర్భంలోనూ జర్నలిస్టులు ప్రజలకు నిజమైన సమాచారాన్ని అందించేందుకు కృషి చేశారు. ఒక చిన్న వార్తతో గ్రామానికి రోడ్డు వచ్చింది. ఒక కథనంతో ఆసుపత్రిలో వైద్యుడు నియమితుడయ్యాడు. ఒక పరిశోధనాత్మక కథనం వల్ల అవినీతి వెలుగులోకి వచ్చింది. ఇవే జర్నలిజం గొప్పతనానికి నిదర్శనాలు.**

**అయితే కాలం మారింది. సాంకేతిక విప్లవం వచ్చింది. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు సమాచార ప్రపంచాన్ని పూర్తిగా మార్చేశాయి.**

**(భాగం–2లో: "జర్నలిస్టు బతుకు – సేవ ఎక్కువ, భద్రత తక్కువ")**



ఎం రవీందర్
7901503777



# వంట నూనెలపై దృష్టి సారించాలి

**భారతదేశంలో కొనసాగుతున్న ఎల్‌నినో ప్రభావం నైరుతి రుతుపవనాలను బలహీనపరుస్తూ, తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు, వర్షా ధార నూనెగింజల పంటల దిగుబడిలో గణనీయమైన తగ్గుదలకు దారితీస్తోంది. దేశీయ ఉత్పత్తి తగ్గడం వల్ల దిగుమతి చేసుకునే వంటనూనెలపై ఆధారపడాల్సిన పరిస్థితి మరింత పెరిగే అవకాశం ఉంది. ఇది లక్షలాది మంది రైతుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సోయాబీన్, వేరుశెనగ, పొద్దుతిరుగుడు తదితర ఖరీఫ్ నూనెగింజల పంటలు ఈ ప్రభావానికి ఎక్కువగా గురవుతున్నాయి**

భారతదేశంలో కొనసాగుతున్న ఎల్‌నినో ప్రభావం నైరుతి రుతుపవనాలను బలహీనపరుస్తూ, తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు, వర్షాధార నూనెగింజల పంటల దిగుబడిలో గణనీయమైన తగ్గుదలకు దారితీస్తోంది. దేశీయ ఉత్పత్తి తగ్గడం వల్ల దిగుమతి చేసుకునే వంటనూనెలపై ఆధారపడాల్సిన పరిస్థితి మరింత పెరిగే అవకాశం ఉంది. ఇది లక్షలాది మంది రైతుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సోయాబీన్, వేరుశెనగ, పొద్దుతిరుగుడు తదితర ఖరీఫ్ నూనెగింజల పంటలు ఈ ప్రభావానికి ఎక్కువగా గురవుతున్నాయి. మొలకెత్తడం, పుష్పించడం, కాయలు ఏర్పడే దశల్లో ఈ పంటలకు సకాలంలో వర్షాలు అత్యంత అవసరం. అయితే ఆలస్యంగా లేదా తక్కువగా కురుస్తున్న వర్షాల కారణంగా అనేక వర్షాధార ప్రాంతాల్లో విత్తనాలు ఆలస్యమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో సాగు విస్తీర్ణం సాధారణంతో పోలిస్తే దాదాపు నలభై శాతం వరకు తగ్గినట్లు ప్రాథమిక అంచనాలు సూచిస్తున్నాయి.దీర్ఘకాలంగా కొనసాగుతున్న వర్షాభావం నేలలో తేమను తగ్గించి పంటల ఎదుగుదలను దెబ్బతీస్తోంది. పంటల కీలక దశల్లో ఏర్పడుతున్న అధిక ఉష్ణోగ్రతలు కాయల ఏర్పాటును, గింజల అభివృద్ధిని ప్రభావితం చేసి మొత్తం దిగుబడిని తగ్గిస్తున్నాయి. ఎల్‌నినో సంవత్సరాల్లో పురుగుల ఉధృతి కూడా వేగంగా పెరుగుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. వేడి, పొడి వాతావరణం వల్ల అఫిడ్స్, వైట్‌ఫ్లై వంటి రసం పీల్చే పురుగులు అధికంగా వ్యాపించి రైతులు పురుగు మందులపై ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో సాగు వ్యయం పెరిగి రైతుల ఆదాయం తగ్గుతోంది.దేశీయ నూనెగింజల ఉత్పత్తి తగ్గడం దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతోంది. ఇప్పటికే భారతదేశం తన వంటనూనెల అవసరాల్లో పెద్ద భాగాన్ని దిగుమతుల ద్వారానే తీర్చుకుంటోంది. దేశీయ ఉత్పత్తి మరింత తగ్గితే దిగుమతి బిల్లు భారీగా పెరిగే అవకాశం ఉంది. గతంలో బలహీన రుతుపవనాల కారణంగా వంటనూనెల దిగుమతులు రికార్డు స్థాయికి చేరుకోవడంతో విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి పెరిగి, అంతర్జాతీయ ధరల మార్పులు నేరుగా వినియోగదారులపై ప్రభావం చూపాయి. పైగా వంటనూనెల లభ్యతపై వస్తున్న వార్తల నేపథ్యంలో ఆరోగ్యకరమైన వంటనూనెలపై ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. ఎందుకంటే, ఈ భారాన్ని సామాన్యులే ఎక్కువగా భరించాల్సి వస్తుంది. వంటనూనెల ధరలు పెరగడంతో కుటుంబాల నెలవారీ ఖర్చులు అధికమవుతాయి. ముఖ్యంగా తక్కువ, మధ్యతరగతి కుటుంబాలపై ద్రవ్యోల్బణం మరింత భారంగా మారి, ఇతర అవసరాలపై చేసే ఖర్చులను కూడా తగ్గించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రైతుల ఆదాయం తగ్గడం, వినియోగదారులకు ధరల భారం పెరగడం వల్ల గ్రామీణ, పట్టణ ఆర్థిక వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. తక్కువ ధర, విస్తృత లభ్యత కారణంగా భారతదేశం దిగుమతి చేసుకునే వంటనూనెల్లో పామ్ ఆయిల్, పామోలిన్ ఆయిల్ ప్రధాన స్థానంలో ఉన్నది.దేశీయ నూనెగింజల ఉత్పత్తి తగ్గడం దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతోంది. అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే గుణం ఉండటంతో ఇది దీప్ ఫ్రై, రోజువారీ వంటలకు అనుకూలంగా ఉం టుంది. ఇందులో విటమిన్‌ఈ తో పాటు సహజ యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉంటాయి.అయితే పామోలిన్ వినియోగంలో పరిమితి పాటించాలని పోషకాహార నిపుణులు సూచన. ఇందులో సుమారు యాభై శాతం సంతృప్త కొవ్వు (సాచ్యురేటెడ్ ఫ్యాట్) ఉండటం,దేశీయ నూనెగింజల ఉత్పత్తి తగ్గడం దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతోంది. అధికంగా తీసుకుంటే ఎల్‌డీఎల్ (చెడు) కొలెస్ట్రాల్ పెరిగి గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం అధికమవుతుందని హెచ్చరిస్తున్నారు. అందువల్ల ఆవనూనె, వేరుశెనగ నూనె, నువ్వుల నూనె, పొద్దుతిరుగుడు నూనె, రైస్ బ్రాన్ ఆయిల్, ఆలివ్ ఆయిల్ వంటి ఆరోగ్యకరమైన నూనెలను వినియోగించాలని కోరుతున్నారు. పామాయిల్ సాగు వేగంగా విస్తరించడం వల్ల అనేక ఉష్ణమండల దేశాల్లో అడవుల నరికివేత, జీవ వైవిధ్యానికి నష్టం వాటిల్లుతున్నది. పర్యావరణ హిత పద్ధతుల్లో ఉత్పత్తి చేసిన పామ్ ఆయిల్‌ను ప్రోత్సహిం చడంతో పాటు దేశీయ నూనెగింజల ఉత్పత్తిని పెంచి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాల్సిన అవసరం ఉన్నది. అయితే ఆలస్యంగా లేదా తక్కువగా కురుస్తున్న వర్షాల కారణంగా అనేక వర్షాధార ప్రాంతాల్లో విత్తనాలు ఆలస్యమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో సాగు విస్తీర్ణం సాధారణంతో పోలిస్తే దాదాపు నలభై శాతం వరకు తగ్గినట్లు ప్రాథమిక అంచనాలు సూచిస్తున్నాయి.దీర్ఘకాలంగా కొనసాగుతున్న వర్షాభావం నేలలో తేమను తగ్గించి పంటల ఎదుగుదలను దెబ్బతీస్తోంది.వాతావరణ మార్పులు భారత వ్యవసాయాన్ని నిరంతరం ప్రభావితం చేస్తున్న నేపథ్యంలో, వాతావరణానికి అనుగుణంగా వ్యవసాయ విధానాలను బలోపేతం చేయడం ముఖ్యం. రైతులకు సాంకేతిక సహాయం అందించడం, ప్రజల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన పెంచడం ద్వారా మాత్రమే దేశ ఆహార భద్రత, ప్రజల ఆరోగ్యం, ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడగలమని నిపుణుల అభిప్రాయం. ఎల్‌నినో వంటి వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక పాత్ర పోషించాలి. వర్షాధార ప్రాంతాల్లో సాగునీటి సదుపాయాల విస్తరణ, కరువును తట్టుకునే నూనెగింజల విత్తనాల పంపిణీ, రైతులకు వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు అందించడం వంటి చర్యలను వేగవంతం చేయాలి. పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీలు, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు దేశీయ నూనెగింజల ఉత్పత్తిని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి. అదే సమ యంలో వంటనూనెల ధరలను నియంత్రిం చడం, అవసరమైనప్పుడు దిగుమతి విధానాలను సమర్థంగా అమలు చేయడం, ఆరోగ్యకరమైన వంటనూనెల వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా రైతుల ప్రయోజనాలు, వినియోగదారుల అవసరాలు రెండింటినీ సమతుల్యం చేసే విధానాలను అమలు చేయాల్సిన అవసరం ఉంది.



# జాతీయం-అంతర్జాతీయం



## నిధుల మళ్లింపు,మోసపూరిత లావాదేవీలు

- ఇదీ రిలయన్స్ క్యాపిటల్ అసలు స్వరూపం
- ఆ సంస్థతోపాటు అనిల్ అంబానీపై సీబీఐ కేసు
- ఎన్‌సీడీల్లో రూ.2,500 కోట్ల పెట్టుబడి
- 2013-14లో జారీ
- బాండ్ల రిడెంప్షన్‌లో డిఫాల్ట్ జరిగిందని ఆరోపణ




**న్యూఢిల్లీ, ఆగస్టు 03 (ఎ.ఎం.ఎస్) :** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) సొమ్ముకు రూ.1,816.22 కోట్ల నష్టం కలిగించారనే ఆరోపణలపై రిలయన్స్ క్యాపిటల్ లిమిటెడ్ (ఆర్‌సీఎల్), ఆ సంస్థ మాజీ చైర్మెన్ అనిల్ అంబానీతో పాటు మరికొందరిపై కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. నేరపూరిత కుట్ర, మోసం, నమ్మకద్రోహం, అవినీతి నిరోధక చట్టం కింద నేరాలకు సంబంధించిన అభియోగాలను ఈ కేసులో చేర్చింది. అయితే తాను ఎలాంటి తప్పూ చేయలేదని అనిల్ అంబానీ స్పష్టం చేశారు. సీబీఐ తెలిపిన వివరాల ప్రకారం... కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ పరిధిలోని ఈపీఎఫ్ఓ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా జులై 31న ఈ ఎఫ్ఐఆర్ నమోదైంది. రిలయన్స్ క్యాపిటల్ చర్యల వల్ల ఈపీఎఫ్ఓకు రూ.1,007.55 కోట్ల అసలు నష్టం, దానిపై రూ.808.67 కోట్ల వడ్డీ భారం ఏర్పడి మొత్తం రూ.1,816.22 కోట్ల నష్టం వాటిల్లినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. 201314లో రిలయన్స్ క్యాపిటల్ సెక్యూర్డ్ నాన్‌కన్వర్టిబుల్ డిబెంచర్లు (ఎన్‌సీడీలు) జారీ చేసింది. ఆ డిబెంచర్లలో ఈపీఎఫ్ఓ తరపున నాలుగు పోర్ట్‌ఫోలియో మేనేజర్లు, వాటిలో రిలయన్స్ క్యాపిటల్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ కూడా ఒకటి మొత్తం రూ.2,500 కోట్ల పెట్టుబడి పెట్టాయి. ఈ డిబెంచర్లు 202324లో మెచ్యూరిటీకి రావాల్సి ఉంది. అయితే సంస్థలోని బాధ్యులు మోసపూరిత లావాదేవీలు, నిధుల మళ్లింపునకు పాల్పడటంతో డిబెంచర్లను గడువు పూర్తయ్యాక తిరిగి చెల్లించడంలో రిలయన్స్ క్యాపిటల్ విఫలమైందని సీబీఐ ఆరోపించింది.

ఫలితంగా ఈపీఎఫ్ఓకు భారీ ఆర్థిక నష్టం సంభవించిందని పేర్కొంది. ఈ ఫిర్యాదుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అందించిన సమాచారమే ఆధారమైంది. బీడీఓ ఇండియా ఎల్ఎల్‌పీ నిర్వహించిన ట్రాన్సాక్షన్ ఆడిట్‌లో రిలయన్స్ క్యాపిటల్‌లో 2019 డిసెంబర్ 7 నుంచి 2021 డిసెంబర్ 6 వరకు జరిగిన అనేక అనుమానాస్పద లావాదేవీలకు సంబంధించిన ప్రాథమిక ఆధారాలు లభించాయని ఈడీ వెల్లడించింది. అంతేగాక.. అంతకుముందు కాలంలో కూడా సంస్థ నిధులను అక్రమంగా మళ్లించిందని గుర్తించినట్టు ఫిర్యాదులో పేర్కొంది.అక్రమ రుణాల మంజూరు, నిధుల మళ్లింపు, తనఖా భద్రత విలువను దెబ్బతీసే చర్యలు వంటి అంశాలపై ఈడీ ప్రాథమికంగా గుర్తించిన వివరాలు సంస్థ ఆర్థిక పరిస్థితి క్షీణించడానికి కారణమై ఉండొచ్చని సీబీఐ భావిస్తోంది. అదే కారణంగా డిబెంచర్ హోల్డర్లకు చెల్లింపులు చేయలేకపోయిందని, దాని ప్రభావం ఈపీఎఫ్ఓ పెట్టుబడులపై పడిందని తన ఎఫ్ఐఆర్‌లో ఆరోపించింది.కాగా అనిల్ అంబానీ ఈ ఆరోపణలను పూర్తిగా ఖండించారు. రిలయన్స్ క్యాపిటల్ బోర్డుకు తాను 2005 నుంచి 2021 నవంబర్ వరకు మాత్రమే నాన్‌ఎగ్జిక్యూటివ్ చైర్మెన్‌గా ఉన్నాననీ, అనంతరం భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) బోర్డును రద్దు చేసి అడ్మినిస్ట్రేటర్‌ను నియమించిందని తెలిపారు. తాను ఎలాంటి అక్రమానికీ పాల్పడలేదని, చట్టపరంగా అందుబాటులో ఉన్న అన్ని హక్కులను వినియోగించుకుంటానని అనిల్ అంబానీ స్పష్టం చేశారు. ప్రస్తుతం సీబీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. దర్యాప్తులో ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు రుజువైతే, ఈపీఎఫ్ఓ నిధుల నష్టానికి దారితీసిన పరిణామాలపై మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు.

## ఇరాన్‌పై దాడులు నిలిపివేసిన అమెరికా

## చర్చలకు మరో అవకాశం: ట్రంప్



**వాషింగ్టన్ :** కొన్నిరోజులుగా ఇరాన్‌పై చేస్తోన్న భారీ దాడులను ప్రస్తుతానికి అమెరికా నిలిపివేసింది. సోమవారం మధ్యాహ్నం నుంచి రెండు దేశాల మధ్య చర్చలు ప్రారంభం అవుతాయని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. తాము ఇరాన్‌పై భీకర దాడులు చేపట్టాలని భావించామని, అవే జరిగి ఉంటే రెండో ప్రపంచయుద్ధం తర్వాత అది పెద్ద దాడిగా మిగిలి ఉండేదని వ్యాఖ్యానించారు. అయితే ఘర్షణల ఆలోచన పక్కన పెట్టి, దౌత్యంవైపే మొగ్గుచూపామని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాల విజ్ఞప్తి మేరకు దాడులను నిలిపివేసి, చర్చలకు మరో అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు ట్రంప్ వెల్లడించారు. ఘర్షణల కంటే చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదిరే అవకాశాలపై ట్రంప్ సానుకూలంగా స్పందించారు. చర్చల ద్వారా ప్రాణనష్టం,

విధ్వంసాన్ని నివారించవచ్చని పేర్కొంటూ దౌత్య మార్గానికే ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టం చేశారు.

## సుప్రీం కోర్టులో జడ్జిల సంఖ్య పెంపు బిల్లుకు లోక్‌సభ ఆమోదం



**న్యూఢిల్లీ ఆగస్టు 03 (ఎ.ఎం.ఎస్)** సుప్రీం కోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను 34 నుంచి 38 కి పెంచడానికి ఉద్దేశించిన కీలక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుపై కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ సభలో చర్చను ప్రారంభించగా, ప్రతిపక్ష సభ్యులు పదేపదే నినాదాలు చేస్తూ సభలో ఆందోళనకు దిగారు. సభ్యులందరూ సభా చర్చలో పాల్గొనాలని స్పీకర్ పదేపదే కోరినప్పటికీ, విపక్షాలు తమ నిరసనలను కొనసాగించాయి. ఈ పరిస్థితుల మధ్య, విపక్షాల తీవ్ర నిరసనలు, గందరగోళం నడుమ ఈ బిల్లును ఎలాంటి చర్చ లేకుండానే లోక్‌సభ ఆమోదించింది. ఇది దేశంలో న్యాయ వ్యవస్థకు సంబంధించిన ఒక ముఖ్యమైన నిర్ణయంగా భావించబడుతోంది. న్యాయమూర్తుల సంఖ్య పెరగడం ద్వారా సుప్రీంకోర్టు మరింత సమర్థవంతంగా పనిచేయగలదని భావిస్తున్నారు. ఈ బిల్లుకు ఆమోదం పొందిన తర్వాత, సభా కార్యక్రమాలను స్పీకర్ మంగళవారం ఉదయం 11 గంటలకు వాయిదా వేశారు. ఈ సమయంలో, లోక్‌సభ ప్రారంభం కాగానే విద్యార్థులపై లాఠీఛార్జ్, అయోధ్యలో విరాళాల చోరీ వంటి కీలక అంశాలపై విపక్ష ఎంపీలు నినాదాలు చేస్తూ ప్రశ్నోత్తరాలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో సభ పలుమార్లు వాయిదా పడింది. ఆ తర్వాత సభ ప్రారంభమైనా అదే పరిస్థితి ఉండటంతో, సుప్రీం కోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచే బిల్లుకు ఆమోదం తెలిపి స్పీకర్ సభను మంగళవారానికి వాయిదా వేశారు. ఈ బిల్లుతో సంబంధించి, న్యాయ వ్యవస్థలో మార్పులు, న్యాయమూర్తుల పనితీరు మెరుగుదల వంటి అంశాలపై చర్చలు జరగవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెరుగడం ద్వారా, న్యాయ వ్యవస్థలో వేగవంతమైన తీర్పులు, న్యాయ ప్రక్రియలో సమర్థత పెరుగుతుందని ఆశిస్తున్నారు. ఈ బిల్లుకు సంబంధించిన చర్చలు, ప్రతిపక్షాల అభ్యంతరాలు, సభలో జరిగిన సంఘటనలు, దేశంలో రాజకీయ పరిస్థితులను ప్రతిబింబిస్తున్నాయి.

## నియామక పరీక్షల్లో అవకతవకలు

### సీబీఐ విచారణకు విద్యార్థుల డిమాండ్

- జార్ఖండ్ లో నిరసన ప్రదర్శన పబ్లిక్ సర్వీస్ కమిషన్ సరిగా స్పందించలేదంటూ ఆగ్రహం

**రాంచీ, ఆగస్టు 03 (ఎ.ఎం.ఎస్):** పద్నాలుగో జేపీఎస్సీ పరీక్ష, జేఎస్ఎస్సీసీజీఎల్, ఇతర నియామక పరీక్షలలో జరిగిన అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలని, నియామక సంస్థలలో సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ .... జార్ఖండ్‌లోని రాంచీలో ఆదివారం నుండి విద్యార్థులు నిరసన ప్రదర్శన నిర్వహించారు.జార్ఖండ్ నియామక పరీక్షలలో జరిగిన అవకతవకలపై నిరసనలు తీవ్రరూపం దాల్చాయి. 14 వ జేపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేయాలని, ప్రశ్నా పత్రాల లీకేజీలపై విచారణ జరపాలని, రాష్ట్ర నియామక వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు తీసుకురావాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తుండటంతో .... ఒక విద్యార్థి నాయకుడు నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. ఈ ఆందోళనకు బొద్దింక జనతా పార్టీ (సీజేపీ) కూడా మద్దతు పలకడంతో, రాంచీలో కొనసాగుతున్న నిరసనలు మరింత బలపడ్డాయి. ఈ ఆందోళనలో భాగంగా, అభ్యర్థులు రాంచీలో మషాల్ మార్చ్ కూడా నిర్వహించారు. "జేపీఎస్సీ లేదా జేఎస్ఎస్సీ సీజీఎల్ వంటి ఏ పరీక్ష అయినా సరే, ప్రశ్నపత్రాలు లీక్ అవుతున్నాయి," అని విద్యార్థులు వాపోతున్నారు. విడివిడి పరిపాలనా చర్యలకు బదులుగా, వ్యవస్థాగత సంస్కరణలు, అధిక పారదర్శకత, జవాబుదారీతనం కావాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థులతో చర్చలు జరపాలని, పరీక్షల ప్రక్రియలో పారదర్శకతను పాటించేలా చూడాలని, అలాగే ఆరోపించబడుతున్న అవకతవకలపై




విచారణ జరపాలని నిరసనకారులు హేమంత్ సోరెన్ ప్రభుత్వాన్ని కోరారు.
పోటీ పరీక్షలలో జరిగిన అవకతవకలకు నిరసనగా విద్యార్థులు ఆందోళన చేస్తున్న రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో, విద్యార్థి నాయకుడు దేవేంద్ర నాథ్ మహతో ఆదివారం నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభించారు. మద్దతుదారులను ఉద్దేశించి మీడియాతో మహతో మాట్లాడుతూ .... గత నెలలో 14వ జేపీఎస్సీ ప్రిలిమినరీ టెస్ట్ ఫలితాలు వెలువడిన తర్వాత ఈ ఆందోళన ప్రారంభమైందని తెలిపారు. " 14వ ప్రాథమిక పరీక్ష (పీటీ) ఫలితాలు గత నెల 2వ తేదీన, అంటే సరిగ్గా నెల రోజుల క్రితం ఇదే రోజున ప్రకటించబడ్డాయి. దీంతో ఈ వివాదం మొదలైంది. మేము జూలై 5న ఈ ఆందోళనను ప్రారంభించి, జూలై 7న గవర్నర్‌ను కలిశాం. జూలై 8న దిష్టిబొమ్మ దహనం నిరసన చేపట్టాం. జూలై 20న ముఖ్యమంత్రిని కలిసి ఆధారాలు సమర్పించడంతో, అధికారిక చర్యలు ప్రారంభమయ్యాయి," అని మహతో మీడియాకు వివరించారు. వారాల తరబడి నిరసనలు జరుగుతున్నప్పటికీ, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం, జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తగిన విధంగా పరిష్కరించడంలో విఫలమయ్యాయని మహతో ఆరోపించారు."జార్ఖండ్ ప్రభుత్వం, కమిషన్ ప్రస్తుత వైఖరి రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులలో నిరుత్సాహాన్ని కలిగిస్తోంది... విద్యార్థుల మనోధైర్యాన్ని నిలబెట్టడానికి ఈ పోరాటాన్ని తీవ్రతరం చేయడానికి, నేను ఈ రోజు నుండి ఆహారం తీసుకోవడం మానేస్తున్నాను... 14వ పీటీ పరీక్షను రద్దు చేయించడం, టీడీపీఎల్ ఏజెన్సీ నిర్వహించిన అన్ని పరీక్షలపై విచారణ జరిపించడమే మా ప్రాథమిక లక్ష్యం. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు సమర్పించిన తమ డిమాండ్లు నెరవేరే వరకు నిరాహార దీక్షను కొనసాగిస్తా" అని దేవేంద్రనాథ్ మహతో అన్నారు.

## నదీ తీరాన ఇసుకలో కూరుకొని రైతుల వినూత్న నిరసన



**తమిళనాడు ఆగస్టు 03 (ఎ.ఎం.ఎస్)** కావేరీ నదీ జలాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ .... రైతు సంఘం నాయకుడు అయ్యకన్ను నేతృత్వంలో తమిళనాడు రైతులు వినూత్న రీతిలో ఆందోళన చేపట్టారు. సోమవారం తిరుచిరాపల్లిలోని కావేరీ నది తీరానికి చేరుకున్న రైతులు.. ఇసుకలో తమను తాము పాతిపెట్టుకుని ప్రభుత్వాల దృష్టిని ఆకర్షించేలా నిరసన వ్యక్తం చేశారు. సాగునీటి కోసం తక్షణమే కావేరీ నీటిని విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. పంటను కాపాడేందుకు తమిళనాడుకు అవసరమైన నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ కర్నాటక ప్రభుత్వం తమిళనాడుకు తగినంత నీటిని విడుదల చేయడం లేదని రైతు నాయకులు ఆరోపించారు. కావేరీ జలాల విషయంలో తమిళనాడు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాలని కోరారు. కర్నాటక ప్రభుత్వం తమిళనాడును మురుగునీటి పారుదల రాష్ట్రంగా చూస్తోందని అయ్యకన్ను తీవ్రంగా విమర్శించారు. తమిళనాడుకు రావాల్సిన న్యాయమైన నీటి వాటాను ఇవ్వకుండా, అదనంగా మిగిలిన నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారని ఆరోపించారు. కర్నాటక నుంచి భారీ మొత్తంలో పరిహారం కోరుతూ సుప్రీం కోర్టును ఆశ్రయించాలని తమిళనాడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కావేరీ నీటి విషయంలో తమిళనాడు తన హక్కుల కోసం మరింత బలంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

## పాకిస్తాన్‌లో భారీ పేలుడు.. 9 మంది మృతి

ఖైబర్ : పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో జరిగిన బాంబు పేలుడులో తొమ్మిది మృతి చెందారు. మరో 20 మందికి గాయాలయ్యాయి. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా స్వాత్ జిల్లాలోని కబాల్ పట్టణంలో వందలాది మంది శాంతి ర్యాలీ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆత్మాహుతి దాడి జరిగినట్లుగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ దాడికి బాధ్యత వహిస్తున్నట్లు ఇంకా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

## బ్రిజ్ భూషణ్ నిర్దోషి

- ఢిల్లీ రెవెన్యూ కోర్టు తీర్పు
- అవాక్కయిన యావత్ దేశం
- నివ్వెరపోయిన మేధావులు, సామాజికవేత్తలు



**ఢిల్లీ రెవెన్యూ కోర్టు తీర్పునిచ్చింది. ఈ కేసులో బ్రిజ్ భూషణ్ తో పాటు సహ నిందితుడు వినోద్ తోమర్‌ను కూడా నిర్దోషులుగా ప్రకటిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఈ ఆరోపణలకు సంబంధించి ప్రాసిక్యూషన్ తగిన సాక్ష్యాధారాలను చూపడంలో పూర్తిగా విఫలమైందని అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అశ్విని పన్వార్ తన తీర్పులో తెలిపారు.**

**న్యూఢిల్లీ, ఆగస్టు 03 (ఎ.ఎం.ఎస్)** : భారత క్రీడారంగంలో తీవ్ర కలకలం రేపిన మహిళా రెజ్లర్ల లైంగిక వేధింపుల కేసులో రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూ.ఎఫ్.ఐ) మాజీ అధ్యక్షుడు, బిజెపి నేత బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ --- సోమవారం ఢిల్లీ రెవెన్యూ కోర్టు తీర్పునిచ్చింది. ఈ కేసులో బ్రిజ్ భూషణ్ తో పాటు సహ నిందితుడు వినోద్ తోమర్‌ను కూడా నిర్దోషులుగా ప్రకటిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఈ ఆరోపణలకు సంబంధించి ప్రాసిక్యూషన్ తగిన సాక్ష్యాధారాలను చూపడంలో పూర్తిగా విఫలమైందని అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అశ్విని పన్వార్ తన తీర్పులో తెలిపారు.
డబ్ల్యూ.ఎఫ్.ఐ చీఫ్‌గా ఉన్న సమయంలో తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ 2023లో దేశంలోనే ప్రముఖ రెజ్లర్లు వినేష్ ఫోగట్, బజరంగ్ పునియా, సాక్షి మాలిక్ తదితరులు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నెలల తరబడి భారీ ఎత్తున ఆందోళనలు చేపట్టిన సంగతి తెలిసిందే. రెజ్లర్ల ఫిర్యాదుల ఆధారంగా కేసు నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు, దర్యాప్తు పూర్తి చేసి 2023 జూన్ 15న దాదాపు 1,500 పేజీల సుదీర్ఘ ఛార్జ్‌షీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. ట్రయల్ కోర్టు బ్రిజ్ భూషణ్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ ఇచ్చిన తీర్పుపై బాధితుల తరపు న్యాయవాదులు పై కోర్టుకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ తీర్పును సవాలు చేస్తూ త్వరలోనే ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించడానికి బాధితుల లీగల్ టీమ్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ వివాదం మరోసారి ఉన్నత న్యాయస్థానంలో చర్చనీయాంశంగా మారనుంది.

## పది కిలో మీటర్ల లోతులో భూకంపం

**కైరో :** ఈజిప్ట్ తీరానికి సమీపంలో సోమవారం తెల్లవారుజామున రిక్టర్ స్కేలుపై 5.4 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ వెల్లడించింది. భూమికి సుమారు 10 కిలో మీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు తెలిపింది. భూకంపం ప్రభావం కనిపించిన చోట అత్యవసర సహాయ బృందాలు రంగంలోకి దిగి చర్యలు చేపట్టాయి. ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తినష్టం నమోదుకాలేదని అధికారులు తెలిపారు. దెబ్బతిన్న భవనాలకు దూరంగా ఉండాలని



ప్రజలకు సూచించారు.

## నీట్ నిరసనకారులపై కేసుల ఉపసంహరణకు రాష్ట్రాలకు స్వేచ్ఛ : సుప్రీం




**న్యూఢిల్లీ :** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి వ్యతిరేకంగా జరిగిన నిరసనల సందర్భంగా నమోదైన కేసులను చట్ట ప్రకారం ఉపసంహరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు పూర్తి స్వేచ్ఛ ఉందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. జులై 20న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన ఆందోళనలకు సంబంధించిన పిటిషన్ల విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. 'క్రిమినల్ యాంటి సిడెంట్స్' అనే పదం హత్య, అత్యాచారం, ఉగ్రవాదం వంటి తీవ్రమైన నేరాలకు మాత్రమే వర్తిస్తుందని ధర్మాసనం పేర్కొంది. చిన్నచిన్న కేసులను ఆ కోవలో పరిగణించకూడదు అని స్పష్టం చేసింది. నిరసనలకు సంబంధించిన అంశాలపై విచారణకు ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కోర్టు తెలిపింది. పెల్లెట్ తుపాకుల వినియోగంపై సమగ్ర మార్గదర్శకాలు రూపొందిస్తామని, ఎలాంటి పరిస్థితుల్లో వాటిని ఉపయోగించవచ్చో నిర్దేశిస్తామని వెల్లడించింది. తదుపరి విచారణను ఆగస్టు 19 కు వాయిదా వేసింది.



# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ప్రభుత్వ శాఖలు తమ ప్రగతి నివేదికలను 7వ తేదీ నాటికి అందజేయాలి: కలెక్టర్



**జయశంకర్ భూపాలపల్లి ఆగస్టు 03:(వుదయం జిల్లా ప్రతినిధి):**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు తమ ప్రగతి నివేదికలను ఈ నెల 7వ తేదీ నాటికి అందజేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు.సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ, ఏర్పాట్లపై జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల ద్వారా సాధించిన పురోగతి, అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలకు సంబంధించిన పూర్తి నివేదికలను ఆగస్టు 7లోగా డిపిఆర్ఓకు అందించాలని ఆదేశించారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని స్పష్టంచేశారు.పారిశుధ్యం, అలంకరణ, భద్రత, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు ప్రోటోకాల్‌కు సంబంధించిన ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు రాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్ఓ వసంత కుమారి, ఆర్డిఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్



**యాదాద్రి భువనగిరి జిల్లా.తేదీ:.03.08.2026.**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 113 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 65 , జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ 15, మున్సిపాలిటీ 7, సర్వే ల్యాండ్స్ 4, సంక్షేమ శాఖ 3, వైద్య ఆరోగ్య శాఖ 3, ఇరిగేషన్ 2, డి.సి.ఓ (TGSWREI) 2, డి.పి.ఓ 2, వ్యవసాయ, విద్య, మైన్స్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఆర్ అండ్ బి , మార్కెటింగ్, హౌసింగ్, సివిల్ సప్లై, జిఎం ఇండస్ట్రీస్, పశుసంవర్ధక శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ. ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ జయమ్మ, డిప్యూటీ కలెక్టర్ కృతిక, జెడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ అలివేలు , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతుల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు

**ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 03 (వుదయం ప్రతినిధి)**

ప్రజల నుంచి ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించే ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, డీఆర్ఓ పద్మావతిలతో కలిసి స్వీకరించారు. భూ సంబంధిత వివాదాలు, రెవెన్యూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, పెన్షన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర అంశాలపై ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం కల్పించిన కీలక వేదిక ప్రజావాణి అని తెలిపారు. ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖలకు వెంటనే పంపించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు.ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి ఎలాంటి అవకాశం ఉండకూడదని స్పష్టం చేశారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు.శాఖల మధ్య సమన్వయంతో సమర్థవంతమైన కార్యాచరణ చేపట్టడం ద్వారా ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి వినతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి, పరిష్కార స్థితిని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా స్పందించి, ప్రభుత్వ సేవలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందించాలని తెలిపారు.ప్రజలు తమ వినతులతో పాటు అవసరమైన ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించేందుకు ప్రతి అధికారి కృషి చేయాలని సూచించారు.ప్రజావాణిలో స్వీకరించిన ప్రధాన వినతులుపాఠశాల భవనం, అదనపు తరగతి గదుల కోసం వినతి:పాల్వంచ మండలం ఉల్వనూరు గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామస్థులు తమ గ్రామంలోని పాత ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిపారు. శిథిల భవనాన్ని తొలగించి, నూతన పాఠశాల భవనానికి ప్రహరీ గోడ మంజూరు చేయాలని కోరారు. పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు మొత్తం 52 మంది విద్యార్థులు ఉండగా, ఒకే తరగతి గది ఉండటంతో బోధనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. దీనిపై కలెక్టర్ సంబంధిత అధికారులతో పరిశీలింపజేసి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారికి ఎండార్స్ చేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి:అన్నపురెడ్డిపల్లి మండలం పెంట్లం గ్రామంలోని కురుమబజార్ కాలనీవాసులు తమ కాలనీలోని చేతిపంపు మరమ్మతులకు గురై పనిచేయడం లేదని, దీంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. చేతిపంపును వెంటనే మరమ్మతు చేసి తాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

## హనుమకొండలోని వెల్ నెస్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఇంచార్జి కలెక్టర్



**హనుమకొండ, ఆగస్టు 03 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

వెల్ నెస్ సెంటర్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఎన్. రవి అన్నారు.సోమవారం రోజున హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల పక్కన ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులు, పెన్షనర్లకు వైద్య సేవలను అందించే వెల్ నెస్ సెంటర్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెల్ నెస్ సెంటర్ లోని జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, డెంటల్, కంటి విభాగం, ల్యాబ్, ఫార్మసీ, ఓపీ విభాగాలను పరిశీలించారు. ఎంతమంది వైద్యులు, సిబ్బంది విధులకు హాజరయ్యారని అదనపు కలెక్టర్ వెల్ నెస్ సెంటర్ ఇన్ ఛార్జ్ డాక్టర్ సుష్మితను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. అక్కడికి వైద్య సేవల నిమిత్తం వచ్చిన పేషంట్లతోనూ మాట్లాడి వైద్య సేవలు ఎలా ఉంటున్నాయని అడిగారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ ఎన్.రవి మాట్లాడుతూ వెల్ నెస్ సెంటర్ కు వచ్చే పేషంట్లకు ఎక్కడ కూడా ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలను అందించాలని సూచించారు. వెల్ నెస్ సెంటర్ వద్ద పరిసరాలు బాగుండాలన్నారు. ప్రత్యేక విభాగాల వైద్య నిపుణుల చేత కూడా వైద్య సేవలను పేషంట్లకు అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ల్యాబ్ ద్వారా పేషంట్లకు అవసరమయ్యే వివిధ పరీక్షలని నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, వైద్యులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి– కలెక్టర్



**ములుగు, ఆగస్టు 03(వుదయం ప్రతినిధి) :**

స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు లతో కలిసి స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని తాగేడు మైదానం లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు స్టేజి ఏర్పాట్లు, ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ సూచించారు. జాతీయ పతాకావిష్కరణ సమయంలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. పబ్లిక్ అడ్రస్ సిస్టం పనితీరును ముందస్తుగా పరిశీలించాలని, సాంస్కృతిక కార్యక్రమాలు,ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు స్టాల్ లు ఏర్పాటు చేయాలని, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విచ్చేసే ప్రజలకు, అధికారులకు, ప్రభుత్వ సిబ్బందికి అవసరమైన త్రాగునీటి సౌకర్యం, ఇతర ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ తెలిపారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రజలు అత్యధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని, అలాగే ప్రభుత్వ శాఖల అధికారులు తమ కార్యాలయ సిబ్బంది అందరితో కలిసి తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణవేణి, ఎస్ డి సి ప్రతాప్, కలెక్టరేట్ ఏవో రాజ్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలి...కలెక్టర్

**ఆగస్టు 1 నుంచి 7 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు**

**మొదటి ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలే సంపూర్ణ ఆహారం**

**తల్లిపాల ప్రాధాన్యంపై విస్తృత అవగాహన కల్పించాలి**

**తల్లిపాలవారోత్సవాల్లో భాగంగా పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్**



**ఖమ్మం, వుదయం బ్యూరో ఆగస్టు 3:**

ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన అత్యుత్తమ ఆహారమని తెలిపారు. శిశువు పుట్టినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే పట్టించేలా ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ఆరు నెలల కాలంలో శిశువు ఎదుగుదల, అభివృద్ధికి, రోగ నిరోధక శక్తికి అవసరమైన అన్ని పోషకాలు తల్లిపాలలోనే లభిస్తాయని అన్నారు. ఎక్స్‌క్లూజివ్ బ్రెస్ట్ ఫీడింగ్ అంటే బిడ్డకు ఆరు నెలలు నిండే వరకు తల్లి పాలు తప్ప మరే ఇతర ఆహారం లేదా పానీయం ఇవ్వక పోవడమేనని తెలిపారు. ఈ కాలంలో నీరు, పైపాలు, పాలపొడి లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వడం వల్ల శిశువుకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని, వైద్యుల సూచన లేకుండా పాల పొడి లేదా డబ్బాపాలను వినియోగించరాదని సూచించారు.ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జిల్లాస్థాయి, ప్రాజెక్టు స్థాయి, అంగన్‌వాడీ కేంద్రాల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు, కుటుంబసభ్యులకు తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తూ ప్రతి శిశువుకు మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు, గర్భిణులు బాలింతలతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డీఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లామహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి ఎ. ప్రమీల, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, పోషణ్ అభియాన్ సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్



**మహబూబాబాద్, ఆగస్ట్ 03 (వుదయం ప్రతినిధి) :**

ప్రజల నుంచి వచ్చిన ప్రజావాణి దరఖాస్తులను అధికారులు అత్యంత ప్రాధాన్యతతో క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ ఇతర అధికారులతో కలిసి కలెక్టర్అర్జీదారుల నుంచి స్వయంగా వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. అర్జీల పురోగతిని తెలుసుకునేందుకు ఆన్‌లైన్ సేవలు, ఉచిత న్యాయ సలహాల కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రజావాణికి 145 దరఖాస్తులు సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 145 దరఖాస్తులు వచ్చాయి. మహబూబాబాద్ 17వ వార్డు రాజీవ్ నగర్ కాలనీలో ధ్వంసమైన రోడ్లు, డ్రైనేజీల సమస్యలు తీర్చాలని బాధితుల విజ్ఞప్తి.కందికొండ MPPS పాఠశాలను UPS పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని సర్పంచ్ వినతి.పెండింగ్‌లో ఉన్న LRS-2020 లాగిన్ ఆమోదించి బిల్డింగ్ పర్మిషన్ ఇప్పించాలని జి.శంకర్ అభ్యర్థన.బయ్యారం మండలం బాలాజీపేట గ్రామంలో విసి బిల్డింగ్ స్థలంలో ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తుల మనవి.ఈ కార్యక్రమంలో అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, హౌసింగ్ పీడీ పురుషోత్తం, డీఆర్ఓ నాగలక్ష్మి , డీఆర్‌డీఓ మధుసూదన రాజు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి– కలెక్టర్



**జనగామ, ఆగస్టు 03 (వుదయం ప్రతినిధి) :**

ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి సత్వరమే పరిష్కరించాలని జి ల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్‌షాలోంతో కలిసి ఆయన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పెండింగ్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ ప్రజావాణిలో డీఆర్డీఓ భాస్కర్, గృహ నిర్మాణ శాఖ పీడీ మాత్రు నాయక్ సహా ఇతర జిల్లా అధికారులతో కలిసి మొత్తం 326 దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. నిరుపేదలమైన తమకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇల్లు లేదా ఆర్థిక సాయం మంజూరు చేయాలని దేవరుప్పులకి చెందిన వి. అనురాధ, నష్కల్ గ్రామానికి చెందిన ఎస్. అరుణ వేర్వేరుగా విన్నవించారు. భూ సమస్యలు ధరణిలో నమోదైన సర్వే నంబర్ తప్పులను సరిచేయాలని జనగామకు చెందిన చిట్ల సుకన్య, పాత పాస్ పుస్తకం ఆధారంగా భూమిని పరిశీలించి మ్యుటేషన్ చేయాలని నర్మెట్ట మండలం బొమ్మకూరుకు చెందిన భూపతి ఆనందం కోరారు.పరిశుభ్రత సమస్య, ఇంటి పక్కన వ్యర్థాలు వేయడం వల్ల దుర్వాసన వస్తోందని, చర్యలు తీసుకోవాలని లింగాల ఘనపురం మండలం కుందారం గ్రామానికి చెందిన బత్తుల భిక్షపతి వినతిపత్రం ఇచ్చారు.

## ప్రజావాణిలో ప్రజల వినతులు స్వీకరించిన కలెక్టర్



**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి ఆగస్టు 3.**

జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, భూ సమస్యలు, సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌరసరఫరాలు తదితర అంశాలకు సంబంధించిన అర్జీలను కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి వినతిని శ్రద్ధగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, ప్రజలు సమర్పించిన ఫిర్యాదులు, దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు వెంటనే పంపించి, వాటిని నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీపై అధికారులు బాధ్యతాయుతంగా స్పందించాలని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా పారదర్శకంగా, జవాబుదారీతనంతో సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం ఒక సమర్థవంతమైన వేదికగా నిలుస్తోందని, ప్రజలు తమ సమస్యలను నేరుగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్



**సూర్యాపేట ఆగస్టు 3: వుదయం ప్రతినిధి**

ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారి స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమంపై కూడా కలెక్టర్ సమీక్షించారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 59 దరఖాస్తులు, డిడబ్ల్యుఓ 10, డిపిఓ 7, డి ఏం అండ్ హెచ్ ఓ 6, మిగిలిన 35 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 117 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డిఆర్డిఏ పిడి సన్యాసయ్య, సిపిఓ కిషన్, డిఇఓ అశోక్, డిపిఓ యాదగిరి జిల్లా అధికారులు, తదితరులు హాజరైనారు.

## మానవత్వాన్ని చాటిన అవయవదాతల కుటుంబం

### జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఘన సన్మానం



**నల్గొండ జిల్లా వుదయం వార్త ప్రతినిధి ఆగస్టు 03**

నల్గొండ పట్టణ కేంద్రంలోజాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా మానవత్వానికి నిలువెత్తు నివాళిజాతీయ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని, అవయవదానం పట్ల సమాజంలో మరింత అవగాహన కల్పించి, మరణానంతరం కూడా అనేక మంది జీవితాలకు వెలుగునిచ్చిన అవయవదాతల కుటుంబాలను గౌరవించాలనే లక్ష్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ చారిటబుల్ ట్రస్ట్ మరియు లయన్స్ క్లబ్ నల్గొండ ఆధ్వర్యంలో, నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో హృద్యమైన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నల్గొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ముందుగా అవయవదాన ప్రతిజ్ఞ పత్రంపై సంతకం చేసి, అవయవదానం పట్ల తన సంపూర్ణ మద్దతును తెలియజేశారు. అనంతరం అవయవదానం ద్వారా పలువురికి పునర్జన్మ ప్రసాదించిన తొమ్మిది మంది అవయవదాతల కుటుంబాలను శాలువాలతో ఘనంగా సత్కరించి, ప్రత్యేకంగా రూపొందించిన "కృతజ్ఞతా పూర్వక" ప్రశంసా పత్రాలతో కూడిన ప్రత్యేకమైన ఫోటో ఫ్రేమ్‌లను అందజేసి వారి సేవా త్యాగానికి గౌరవ వందనం అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అత్యంత విషాద సమయంలో కూడా తమ ప్రియమైన కుటుంబ సభ్యుల అవయవాలను దానం చేయడానికి అంగీకరించిన ఈ కుటుంబాలు నిజమైన మానవతా మూర్తులని కొనియాడారు. తమ వ్యక్తిగత దుఃఖాన్ని అధిగమించి, తెలియని వ్యక్తుల జీవితాలను కాపాడేందుకు తీసుకున్న ఈ మహోన్నత నిర్ణయం సమాజానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు."అవయవదానం అనేది మరణానంతరం జీవితాలను నిలబెట్టే మహాదానం. ఒక అవయవదాత అనేక మంది జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతారు. అలాంటి దాత కుటుంబాలను గౌరవించడం సమాజం యొక్క నైతిక బాధ్యత. వారి త్యాగం మరెందరికో అవయవదానానికి స్ఫూర్తి గా నిలుస్తుంది" అని కలెక్టర్ అన్నారు.మీ కుటుంబ సభ్యులు చేసిన ఈ మహోన్నత సేవను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది" అని భరోసా కల్పించారు. అలాగే భవిష్యత్తులో లయన్స్ క్లబ్ చేపట్టనున్న నేత్రదానం, అవయవదాన అవగాహన కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320E జిల్లా గవర్నర్ కే.వి ప్రసాద్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు అశోక్ ఎర్రమాద, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్ వి కుమార్, ఐ డొనేషన్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డా. హరనాథ్ కడిమి గారు, కో–ఆర్డినేటర్‌లు చిరునోముల చంద్రశేఖర్, కో–ఆర్డినేటర్ కోట సరిత, లయన్స్ సభ్యులు, అవయవదాతల కుటుంబ సభ్యులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.ఈ అరుదైన గౌరవం తమ జీవితంలో మరపురాని అనుభూతిగా నిలిచిపోతుందని అవయవదాతల కుటుంబ సభ్యులు భావోద్వేగంతో తెలిపారు.

# విద్యార్థులు లక్ష్యంతో చదవాలి..

## ప్రతి పాఠ్యాంశంపై పట్టు సాధించాలి

-- విరామ సమయంలో ఆటలు కూడా ఆడాలి

-- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

-- సిరిసిల్ల అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ



**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 3 (వుదయం ప్రతినిధి) :**

విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ లక్ష్యంతో చదివి ప్రతి పాఠ్యాంశంపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆమె ఆకస్మికంగా సందర్శించి విద్యా, వసతి, భోజన ఏర్పాట్లను పరిశీలించారు. స్టోర్‌రూమ్‌లో బియ్యం, పప్పులు, గుడ్లు తదితర నిత్యావసర నిల్వలను తనిఖీ చేసిన కలెక్టర్, ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మమేకమయ్యారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నదా అని ఆరా తీసి, సైన్స్ పాఠ్యాంశానికి సంబంధించిన పలు ప్రశ్నలు అడిగి విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సబ్జెక్టులోని పాఠ్యాంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి ప్రణాళికాబద్ధంగా చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. చదువుతో పాటు విరామ సమయంలో ఆటలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని, శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కూడా విద్యార్థులకు అంతే ముఖ్యమని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

# స్థానిక యువతకు ఉపాధి కల్పించే అభివృద్ధి, పెట్టుబడులే ప్రభుత్వ లక్ష్యం....

## రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

### పరిశ్రమలకు అవసరమైన విద్యుత్, నీరు, మౌలిక వసతులు ప్రభుత్వం కల్పిస్తుంది

**పెద్దపల్లి (మంథని)ఆగస్టు 3 (వుదయం ప్రతినిధి)**

ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించే అభివృద్ధి కార్యక్రమాలను నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.సోమవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంథని పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా శివకిరణ్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన 'మన ఊరు–మన కోచింగ్ సెంటర్' ఉచిత కానిస్టేబుల్, ఎస్సై కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం ఎస్ఎల్‌బీ గార్డెన్‌లో టీ వర్క్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాల విద్యార్థుల క్రీడా పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేసి ఉచిత హెల్మెట్లను పంపిణీ చేశారు. మంథని క్యాంపు కార్యాలయంలో హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్, ఇతర పరిశ్రమల ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, అధికారులతో కలిసి పరిశ్రమల అభివృద్ధి అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ సంస్థ సీఎస్ఆర్ కార్యక్రమం 'ప్రాజెక్ట్ షైన్' కింద చేపడుతున్న బొక్కలవాగు చెక్‌డ్యామ్ అప్‌గ్రేడేషన్, సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో నూతన డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొని వైద్య సేవల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. రత్నాపూర్ గ్రామంలో ప్రతిపాదిత కోకాకోలా పరిశ్రమ ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించారు. ఉద్యోగం సాధించే వరకు అండగా ఉంటుంది. 'మన ఊరు–మన కోచింగ్ సెంటర్' ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని, ప్రస్తుతం మరో 7 వేలకుపైగా పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఈ అవకాశాన్ని యువత పూర్తిగా వినియోగించుకోవాలని, రాబోయే మూడు నెలలు జీవితాన్ని మార్చే కాలంగా భావించి స్పష్టమైన లక్ష్యంతో సిద్ధం కావాలని సూచించారు.కోచింగ్ సెంటర్‌లో అత్యుత్తమ శిక్షణతో పాటు అవసరమైన పుస్తకాలు, స్టడీ మెటీరియల్, వసతి, భోజన సౌకర్యాలను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజూ కనీసం 15 గంటలు క్రమశిక్షణతో చదివి ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం వరకు తన బాధ్యత అని, ఉద్యోగం సాధించడం మాత్రం వారి సంకల్పం, కష్టపడే తత్వంపైనే ఆధారపడి ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. తాను దారి చూపగలనని, కానీ విజయాన్ని అందుకునేది వారి కృషి ద్వారానేనని అన్నారు. వచ్చే మూడు నెలలు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, మంచి ఆలోచనలతో, క్రమశిక్షణతో చదివి ఉద్యోగం సాధిస్తే వారి కుటుంబాల్లో ఆనందం నింపినట్లవుతుందని, అదే తనకు నిజమైన సంతృప్తి అని తెలిపారు. పరిశ్రమలకు ప్రభుత్వం పూర్తి సహకారం మంథని క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ ప్రతినిధులు, ఇతర పరిశ్రమల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.పరిశ్రమలకు అవసరమైన విద్యుత్, నీరు, రహదారులు, ఇతర మౌలిక వసతులు అన్నింటినీ ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. రాష్ట్రానికి మరిన్ని నాణ్యమైన పెట్టుబడులు రావడం, స్థానిక యువతకు అధిక ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. బొక్కలవాగు అభివృద్ధితో నీటి సంరక్షణ – ప్రజలకు మెరుగైన వాతావరణం హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ సంస్థ తమ సీఎస్ఆర్ కార్యక్రమం 'ప్రాజెక్ట్ షైన్' కింద చేపడుతున్న బొక్కలవాగు చెక్‌డ్యామ్ అప్‌గ్రేడేషన్, సుందరీకరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొక్కలవాగు వద్ద గార్డెనింగ్, ఓపెన్ జిమ్ అప్‌గ్రేడేషన్, వాకింగ్ ట్రాక్, చిన్నారుల కోసం పార్కు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా బొక్కలవాగులో పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు డీ–సిల్టింగ్ పనులు కూడా చేపడుతున్నామని చెప్పారు.బొక్కలవాగు బండ్ అభివృద్ధి పనులకు గతంలో 2011–12లో అనుమతులు లభించాయని, ప్రస్తుతం వాటిని ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. ఈ అభివృద్ధి పనులను సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా చేపట్టాలని హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ సంస్థను కోరగా, సంస్థ ప్రతినిధులు సానుకూలంగా స్పందించి రూ.2 కోట్ల నిధులు అందించారని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా నీటి సంరక్షణ మెరుగుపడటంతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం, మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రభుత్వం, పరిశ్రమలు కలిసి పనిచేస్తే సమాజానికి మరింత మేలు చేయగలమని పేర్కొంటూ ఈ కార్యక్రమాన్ని చేపట్టిన హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ సంస్థను అభినందించారు. తెలంగాణ వ్యాప్తంగా మరిన్ని పరిశ్రమలు కూడా ఇలాంటి సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.బొక్కలవాగు సుందరీకరణ, గార్డెనింగ్, డీ–సిల్టింగ్, వాకింగ్ ట్రాక్, జిమ్, చిన్నారుల పార్కు తదితర అభివృద్ధి పనులను అత్యున్నత నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండరాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైద్య సేవల బలోపేతానికి చర్యలు అనంతరం మంథని ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో నిర్వహించిన నూతన డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొని ప్రభుత్వ వైద్య సేవల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక వసతులు, వైద్య పరికరాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కోకాకోలా పరిశ్రమ ఏర్పాటుకు స్థల పరిశీలన పర్యటనలోభాగంగారత్నాపూర్ గ్రామంలో ప్రతిపాదిత కోకాకోలా పరిశ్రమ ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ కోయశ్రీహర్ష, సంబంధిత శాఖల అధికారులు, కంపెనీ ప్రతినిధులతో కలిసి మంత్రి పరిశీలించారు. పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన అన్ని ప్రక్రియలను వేగవంతం చేసి స్థానిక యువత కు అధిక ఉపాధి అవకాశాలు కల్పిం చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మంథని అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. మంత్రి మాట్లాడుతూ పట్టణంలో రోడ్ల విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు.




# రెవెన్యూ దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




**నిర్మల్ జిల్లా 2 ఆగస్ట్ 2026 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలో రెవెన్యూ శాఖకు సంబంధించిన ప్రజల దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అంశాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ భారతి, ప్రజావాణి, సీఎం ప్రజావాణి, రెవెన్యూ సదస్సులు, సదాబైనామా తదితర భూ సమస్యలకు సంబంధించిన దీర్ఘకాలిక పెండింగ్ దరఖాస్తులను ప్రత్యేక దృష్టితో త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల వివరాలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అన్ని దరఖాస్తులను పూర్తి చేయాలని, పరిష్కారం కాని వాటిని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.తిరస్కరించే దరఖాస్తులకు స్పష్టమైన కారణాలను నమోదు చేయాలని, ప్రజల వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. భూముల సర్వే, రీ–సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 'మన ఇసుక వాహనం' యాప్ ద్వారానే ఇసుక విక్రయాలు జరిగేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, డీఆర్వో రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, ఏడీ ల్యాండ్ సర్వే రికార్డ్స్ నరసింహమూర్తి, తహసీల్దార్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి...

### పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్



**జగిత్యాల ఆగస్టు 03 (వుదయం ప్రతినిధి)**

ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ అదేశించారు సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు కాగా తేదీ 3 8 2026 సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 60 ఫిర్యాదులు వినతులు వచ్చాయని వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం బ్రహ్మ కుమారీస్ వారి ఆధ్వర్యంలో నాషా విముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా 10 కోట్ల మంది వ్యసన విముక్తి ప్రతిజ్ఞ చేసి పోస్టర్ ఆవిష్కరణ చేశారు. జిల్లా సంక్షేమ శాఖ వారి తల్లిపాల వారోత్సవాల పోస్టర్ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ వారి తెలంగాణ జలసిరి ఎల్నినో ప్రభావం వర్ష బాగా పరిస్థితులను ఎదుర్కొందాం పోస్టర్ లను ఆవిష్కరణ జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఆవిష్కరించారు.ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లు బిఎస్ లత బి రాజ గౌడ్ జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్ సంబంధిత జిల్లా స్థాయి అధికారులు మున్సిపల్ కమిషనర్ లు తదితరులు.

# తల్లిపాల వారోత్సవాల ఆవిష్కరించిన అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



**కరీంనగర్ ఆగస్ట్ 03 (వుదయం ప్రతినిధి):**

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ అన్నారు. ఈనెల 7 వరకు నిర్వహించనున్న తల్లిపాల వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్ ను అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గ్రామస్థాయిలో గర్భిణీలు బాలింతలు, కుటుంబ సభ్యులకు తల్లిపాల ఆవశ్యకతను వివరించాలని తెలిపారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలని ప్రతి ఒక్కరికి తెలియజేయాలని, ముర్రుపాలలోని రోగనిరోధక శక్తి వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతాడని తెలిపారు. మహిళ, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను సందర్శించి అక్కడి గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యంపై కౌన్సిలింగ్ నిర్వహించాలని సూచించారు. పుట్టినప్పటి నుండి ఆరు నెలలు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలని, రెండు సంవత్సరాల వరకు కొనసాగించాలనే విషయాన్ని తెలియజేయాలన్నారు. ముఖ్యంగా స్వయం సహాయక సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధుల సహకారంతో అవగాహన సమావేశ ఏర్పాటు చేసి తల్లిపాల ప్రాముఖ్యం వివరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఐసిడిఎస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు: అదనపు కలెక్టర్ వి.భుజంగరావు



**నిజామాబాద్, ఆగస్టు 03 :**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ వి.భుజంగరావు అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం అన్ని శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. పంద్రాగస్టు సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించనున్న ఈ వేడుకకు సంబంధించి వేదిక, సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా చేసుకోవాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణాభివృద్ధి, ఫారెస్ట్, పశు సంవర్ధక, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, పౌర సరఫరాల, పంచాయతీరాజ్, ఆర్టీసీ తదితర శాఖల పనితీరును చాటేలా శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రొటోకాల్ ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు.

అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, వేడుకలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పంద్రాగస్టు వేడుకకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది విధిగా హాజరు కావాలని అన్నారు. ఎక్కడ కూడా జాతీయ పతాకం గౌరవానికి భంగం వాటిల్లకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రశంసా పత్రాల బహూకరణ కోసం శాఖల వారీగా ఉత్తమ ఉద్యోగుల పేర్లతో కూడిన ప్రతిపాదనలను నిర్ణీత గడువు లోపు పంపించాలని ఆదేశించారు. సన్నాహక సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, జెడ్పి సీఈఓ సాయాగౌడ్, నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,, డీఆర్డీఓ సాయన్న, కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

### ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి, ఆగస్టు 3 (వుదయం ప్రతినిధి):**

ప్రజల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజావాణిలో స్వీకరించే ప్రతి వినతిని నిర్దేశిత గడువులోగా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 80 దరఖాస్తులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. భూ సమస్యలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాలు, పెన్షన్లు, ఉపాధి, ఇతర శాఖలకు సంబంధించిన వినతులను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవోలు), తహసీల్దార్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. అందిన ప్రతి దరఖాస్తు పురోగతిని పరిశీలించి, శాఖల వారీగా బాధ్యతాయుతంగా చర్యలు చేపట్టి, ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రాధాన్యత క్రమంలో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అలాగే, చేపట్టిన చర్యలపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజావాణి ద్వారా ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జడ్పీ సీఈవో చందర్, డిప్యూటీ కలెక్టర్ రవితేజ, జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు సమస్యలపై నిర్భయంగా ఫిర్యాదు చేయాలి..

## జిల్లా ఎస్పీ నికిత పంత్



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

మహిళలు, చిన్నారుల రక్షణ కోసం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో షీ టీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీం, భరోసా కేంద్రాల ద్వారా నిరంతరం సేవలు అందిస్తున్నామని జిల్లా ఎస్పీ శ్రీమతి నితికా పంత్, ఐపీఎస్ తెలిపారు. జూలై నెలలో జిల్లా వ్యాప్తంగా షీ టీం ఆధ్వర్యంలో 30 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులు, విద్యార్థినులకు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో చట్టం, మహిళల భద్రత అంశాలపై అవగాహన కల్పించామని తెలిపారు. అలాగే 98 హాట్‌స్పాట్ ప్రాంతాలను గుర్తించి నిఘా నిర్వహించడంతో పాటు, 9 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని, 12ఫిర్యాదులు స్వీకరించగా ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేసి, 02 కేసులో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు వెల్లడించారు. మహిళలు, చిన్నారులు వేధింపులు, హింస లేదా సైబర్ వేధింపులకు గురైనప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులను లేదా షీ టీంను సంప్రదించాలని సూచించారు. అలాగే సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారం, ఫోటోలు, వీడియోలను పంచుకునే విషయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. సహాయం కోసం ఆసిఫాబాద్ డివిజన్ షీ టీం – 8712670564, కాగజ్‌నగర్ డివిజన్ షీటీం – 8712670565 లేదా డయల్ 112 కు సమాచారం అందించాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని జిల్లా ఎస్పీ తెలిపారు.

# ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్



**ఆదిలాబాద్:**

ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, ప్రజావాణి పోర్టల్‌లో నమోదయ్యే ప్రతి ఫిర్యాదును నిర్దిష్ట గడువులోగా పరిష్కరించడం సంబంధిత అధికారుల ప్రాథమిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను ఆయన స్వయంగా స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, పెన్షన్లు, ఉపాధి హామీ పథకం, భూభారతి సమస్యలు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 109 ఫిర్యాదులు అందాయన్నారు. వీటిపై తక్షణ చర్యలు తీసుకుని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

# మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని కాపాడుకుందాం.. కలెక్టర్



**మంచిర్యాల/ఆగస్టు 03 (వుదయం ప్రతినిధి)**

మొక్కలు నాటి సంరక్షించుకొని పర్యావరణాన్ని కలిసికట్టుగా కాపాడుకుందాం అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రాముని చెరువు ప్రాంతంలో మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానేష్ లతో కలిసి వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని, తద్వారా పర్యావరణాన్ని కాపాడుకుందాం అని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ శాఖలకు కేటాయించిన లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రాముని చెరువు సుందరీకరణ కొరకు నిధులు మంజూరు చేసి చర్యలు చేపడుతున్నామని, ఈ ప్రాంతంలో పచ్చదనం పెంపొందించడం, పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడం, వాకింగ్ కొరకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. భవిష్యత్తులో సమతుల్య వాతావరణం కొరకు మొక్కలు నాటి కాపాడవలసిన ఆవశ్యకత ఉందని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ...వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు, విద్యాసంస్థలలో, అవకాశం ఉన్న ప్రాంతాలలో మొక్కలు నాటి సంరక్షించాలని, కాలుష్య నియంత్రణకు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. మార్పులను నియంత్రించి సమతుల్య వాతావరణం నెలకొల్పేందుకు సమిష్టిగా పనిచేయాలని తెలిపారు. గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాంతం అడవుల జిల్లాగా ప్రసిద్ధి చెందిందని, ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో అటవీ శాతం తగ్గిందని, తిరిగి పెంపొందించేలా అందరం కలిసి కృషి చేద్దామని, ప్రకృతిని కాపాడుకుందాం అని తెలిపారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## ప్రతి శిశువుకు తొలి ఆహారం తల్లిపాలే

- ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాల ప్రాధాన్యతను ప్రతి కుటుంబం గుర్తించాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి, ఆగస్టు 3 వుదయం:

శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలు అత్యంత విలువైన తొలి ఆహారమని, పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు పట్టించడం ద్వారా అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించే పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో ఆయన ఆవిష్కరించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శిశువు పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలను శిశువుకు తప్పనిసరిగా అందించాలని తెలిపారు. అవి శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని పెంపొందించి, ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బలమైన పునాది వేస్తాయని అన్నారు. తల్లి శిశువు మధ్య బంధం మరింత బలపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి, జిల్లా మహిళా & శిశు సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితా దేవి, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, ఆర్డీఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కష్టమంతా కాలిపోయింది.. కాపురం వీధిన పడింది!

- క్షణాల్లో అగ్నికి ఆహుతైన ఆశల సౌధం
- రూ.3 లక్షల నగదు, బంగారం, అసలు పత్రాలు దగ్ధం
- కట్టుబట్టలతో మిగిలిన ఐదుగురు సభ్యుల కుటుంబం
- పిల్లిగుండ్ల కాలనీలో మిన్నంటిన రోదనలు

గద్వాల ఆగస్టు 03 (వుదయం బ్యూరో):

కంటిపాపలా కాపాడుకున్న ఇల్లు.. చెమటోడ్చి కూడబెట్టిన కష్టం.. పిల్లల భవిష్యత్తు కోసం దాచుకున్న ఆశలు.. అన్నీ కళ్లముందే మంటల్లో కలిసిపోయాయి. విధి ఆడిన వింత నాటకానికి ఆ నిరుపేద కుటుంబం సర్వస్వం కోల్పోయి రోడ్డున పడింది. పిల్లిగుండ్ల కాలనీలో సోమవారం చోటుచేసుకున్న ఘోర అగ్నిప్రమాదం ఓ పేద కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టివేసింది. మంటల్లో కాలిన రేకుల కప్పు ఇంట్లో గోపాల్ తన భార్య, ముగ్గురు చిన్నారులతో కలిసి కాలనీలోని ఓ గుడిసెలో నివసిస్తున్నాడు. సోమవారం అకస్మాత్తుగా గుడిసెకు మంటలు అంటుకున్నాయి. గాలి వీచడంతో నిమిషాల వ్యవధిలోనే అగ్నికీలలు ఇల్లు మొత్తాన్ని దహించివేశాయి. ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే మంటలు ఆకాశాన్నంటడంతో, లోపల ఉన్న వస్తువులను తీసే అవకాశం కూడా లేకపోయింది. కట్టుబట్టలతో కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకున్నారు. తీరని నష్టం.. బూడిదైన భవిష్యత్తు ఈ భయానక ప్రమాదంలో గోపాల్ దంపతులు ఎంతో కష్టపడి దాచుకున్న రూ. 3 లక్షల నగదు, 2



తులాల బంగారం, 50 తులాల వెండి నగలు సంపూర్ణంగా కాలిపోయాయి. వీటితో పాటు వారి జీవితాధారమైన ఫోటో అసలు (ఒరిజినల్) పత్రాలు, పిల్లల పాఠ్యపుస్తకాలు, బియ్యం, గృహోపకరణాలు అన్నీ బూడిద కుప్పగా మారాయి. ఉన్నదంతా పోయి, తినడానికి తిండి, కట్టుకోవడానికి గుడ్డ కూడా లేక ఆ కుటుంబం రోదిస్తున్న తీరు స్థానికులను తీవ్రంగా కలచివేసింది.

ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి: కౌన్సిలర్ జగదీశ్ విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ టి.ఎన్.ఆర్. జగదీశ్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఎంఆర్ఓ, టౌన్ ఎస్ఐతో మాట్లాడి, జరిగిన నష్టాన్ని తక్షణమే అంచనా వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తరపున అత్యవసర ఆర్థిక సాయం అందించడంతో పాటు ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కాగా, ప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ జరుపుతున్నారు.



## పదోన్నతి బాధ్యతలను మరింత పెంచుతుంది

- జిల్లా ఎస్పీ డాక్టర్. సంగ్రామ్ సింగ్ జి పాటిల్

నాగర్ కర్నూల్, ఆగస్టు 03 (వుదయం బ్యూరో):

పదోన్నతి అనేది ఉద్యోగంలో ఉన్నత స్థానానికి ఎదగడమే కాకుండా బాధ్యతలను మరింత పెంచుతుందని జిల్లా ఎస్పీ డాక్టర్. సంగ్రామ్ సింగ్ జి పాటిల్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని స్పెషల్ బ్రాంచ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సుధాకర్ రెడ్డి ఇటీవల ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఎస్పీ సోమవారం ఆయనను అభినందించి, స్టార్స్ అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలీస్ సిబ్బంది బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల కష్టాన్ని సహనంతో విని, తక్షణ సహాయం, న్యాయం అందించడం ప్రధాన కర్తవ్యమని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, నిరుపేదలకు పోలీసులు అండగా నిలవాలని అన్నారు. క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావంతో ప్రజల విశ్వాసాన్ని పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ రామ్ లాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి



నారాయణపేట, ఆగస్టు 03 (వుదయం ప్రతినిధి):

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 30 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా సత్వరం పరిష్కరించాలన్నారు. శాఖల వారీగా ఆయా అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డి.ఆర్.ఓ.రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గీతంలో మంత్రముగ్ధులను చేసిన మోహినియాట్టం యుగళ నృత్య ప్రదర్శన

పటాన్చెరు (వుదయం):

హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని లలిత, ప్రదర్శన కళల విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మోహినియాట్టం యుగళ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. నిష్ణాతులైన నర్తకులు నీమా నిఖిల్, వీణా ఉన్నికృష్ణన్ గీతం డాన్స్ స్టూడియోలో ఈ ప్రదర్శనతో ఆహూతులను అలరించారు. ఇద్దరు నర్తకులు మోహినియాట్టంలో డిప్లొమాలు కలిగి ఉండగా, నీమా నిఖిల్ దూరదర్శన్ గ్రేడెడ్ కళాకారిణి కూడా. ఇది శాస్త్రీయ నృత్య సంప్రదాయంలో ఆమెకున్న ప్రావీణ్యాన్ని ప్రతింబిస్తుంది.

లలితా సహస్రనామం నుంచి ఎంపిక చేసిన శ్లోకాల ఆధారంగా, కేరళ యొక్క విశిష్టమైన భక్తి, నాటకీయ సంగీత సంప్రదాయమైన భావోద్వేగభరితమైన సోపాన సంగీతానికి అనుగుణంగా, మైథిలి మరట్ అనూప్ నృత్య దర్శకత్వం వహించిన హృద్యమైన దేవిస్తుతితో ఈ ప్రదర్శన ప్రారంభమైంది. మోహినియాట్టానికి నిర్వచనం ఇచ్చే సౌందర్యం, భక్తి, భావయుక్తమైన సొగసును ఈ ప్రదర్శన అద్భుతంగా ఆవిష్కరించింది. రెండవ ప్రదర్శనగా మహారాజా స్వాతి తిరునాల్ స్వరపరిచిన ఉత్సాహభరితమైన పండుగ సంగీత రూపకం 'ఉత్సవప్రబంధం' ప్రదర్శించారు. భావయుక్తమైన కథనం, సుందరమైన అభినయం ద్వారా, నృత్యకారులు ఒక అద్భుతమైన బంగారు తామర ఆకారపు రథంపై విచ్చేసిన దేవత ఎవరనే దానిపై ఒక ఊహాగానాల ఆటగా సాగే సరదా సంభాషణను ప్రదర్శించారు. ఆ దైవ స్వరూపం దేవతల రాజు అయిన ఇంద్రుడని ఒక నృత్యకారిణి సూచిస్తే, ఇంద్రునికి వెయ్యి కళ్ళు ఉండాలని మరొకరు ప్రతివాదన



చేస్తారు. చంద్రునికి ఉండే మచ్చ లేకపోవడం వల్ల, ఆయన గుర్తింపు కూడా ప్రశ్నించేలా చంద్రుడితో సహా ఇతర దైవిక అవకాశాలతో ఈ సంభాషణ కొనసాగుతుంది. ఆసక్తికరమైన ఈ సంభాషణ చివరికి, ఆ దైవం సాక్షాత్తు పద్మనాభ స్వామి అని వెల్లడి కావడంతో ముగిసింది. దాని గేయ సౌందర్యం, నాటకీయ ఆకర్షణతో ఇది ప్రేక్షకులను ఆనందపరిచింది. ఈ ప్రదర్శన ప్రఖ్యాత డాక్టర్ ఎం.బాలమురళీకృష్ణ స్వరపరిచిన ఉత్సాహభరితమైన 'థిల్లాన'తో ముగిసింది. లయబద్ధమైన వైభవాన్ని, సుందరమైన కదలికలను మేళవించిన తెలుగు సాహిత్యం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. అధ్యాపక బృందం, విద్యార్థులు, కళాభిమానులు ఈ ప్రదర్శనను ఘనంగా ప్రశంసించారు. నృత్యకారుల సాంకేతిక నైపుణ్యం, భావవ్యక్తీకరణ, రంగస్థల ప్రదర్శన పట్ల వారికున్న అభిరుచిని అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, కళాత్మక నైపుణ్యాన్ని పెంపొందించడానికి, భారతదేశపు గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడానికి, నిష్ణాతులైన కళాకారులతో క్రమం తప్పని ప్రదర్శనలు, సంభాషణల ద్వారా గీతం హైదరాబాదు ప్రాంగణంలో ఉత్సాహభరితమైన సృజనాత్మక వాతావరణాన్ని సృష్టించడానికి లలిత, ప్రదర్శన కళల విభాగం చేస్తున్న నిరంతర ప్రయత్నాలలో ఇటువంటి కార్యక్రమాలు ఒక భాగమని పేర్కొన్నారు.

## అంబులెన్స్‌లోనే సురక్షిత ప్రసవం తల్లీబిడ్డ క్షేమం

మిరుదొడ్డి, ఆగస్టు 3, వుదయం:

108 అంబులెన్స్ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి మరో ప్రాణాన్ని కాపాడారు. మిరుదొడ్డి గ్రామానికి చెందిన పక్కిరిగల్ల మౌనిక (22)కు సోమవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే 108కు సమాచారం అందించారు. ఈ క్రమంలో అప్రమత్తమైన 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ నవీన్ కుమార్, పైలట్ అశోక్ అంబులెన్స్ లోనే సురక్షితంగా ప్రసవం నిర్వహించారు. తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. అనంతరం తల్లి, నవజాత శిశువును దుబ్బాక ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రికి తరలించి వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉండటంతో మౌనిక కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.





## పాత బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సులు ఆపాలని వినతి

మెదక్ జిల్లా వుదయం

నిజాంపేట మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో ఆర్టీసీ బస్సులు నిలిపివేయాలని కోరుతూ సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ నగేష్‌కు నిజాంపేట గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ రెండూ ఉన్నప్పటికీ ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు పాత బస్టాండ్ వద్ద ఆగడం లేదని తెలిపారు. దీంతో గ్రామస్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పాత బస్టాండ్ సమీపంలో బస్టాండ్ నిర్మాణానికి సంబంధించి స్థల పరిశీలన కోసం అధికారులు హద్దు బంద్ చేసిన నేపథ్యంలో, నిర్మాణం చేపట్టనున్న ప్రాంగణంలో బస్సులు నిలిపివేయడం లేదని అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన అడిషనల్ కలెక్టర్ నగేష్, సంబంధిత ఆర్టీసీ అధికారులతో మాట్లాడి పాత బస్టాండ్ వద్ద తక్షణమే బస్సులు ఆపేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు రంజిత్ గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ అజీజ్, వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్, చంద్రకాంత్ గౌడ్, పాల్గొన్నారు.

## మార్చిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ మహాసంగ్రామం

- రాష్ట్ర రాజకీయాలకు సెమీఫైనల్‌గా మారనున్న రెండు ఎమ్మెల్సీ ఎన్నికలు
- హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్, వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గాల్లో పోరు
- సుమారు 14 లక్షల మంది పట్టభద్రుల తీర్పుపై మూడు ప్రధాన పార్టీల దృష్టి
- హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్‌పై బీజేపీ ప్రత్యేక గురి.. పట్టభద్రులు, యువత మద్దతుపై ఆశలు
- వరంగల్–ఖమ్మం–నల్లగొండలో అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ.. కొత్త పేర్లపై ప్రధాన పార్టీల్లో కసరత్తు

వికారాబాద్ ఆగస్టు 3 (వుదయం బ్యూరో):

రాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక ఎన్నికల సమరం ప్రారంభమవుతోంది. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటి నుంచే దృష్టి సారించాయి. హైదరాబాద్‌రంగారెడ్డిమహబూబ్‌నగర్ మరియు వరంగల్‌ఖమ్మంనల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనుండటంతో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అభ్యర్థుల ఎంపిక, ఓటరు నమోదు, క్షేత్రస్థాయి వ్యూహాలపై కసరత్తు ప్రారంభించాయి. రాష్ట్రంలోని పట్టభద్రుల ఓటర్లలో అత్యధిక సంఖ్య ఈ రెండు నియోజకవర్గాల్లోనే ఉండటం విశేషం. ఉమ్మడి ఆరు జిల్లాలకు చెందిన సుమారు 14 లక్షల మంది పట్టభద్రులు ఈ ఎన్నికల్లో తమ తీర్పు ఇవ్వనున్నారు. దీంతో ఈ ఎన్నికలను రాజకీయ విశ్లేషకులు "మినీ సెమీఫైనల్"గా అభివర్ణిస్తున్నారు. ఈ ఎన్నికల ఫలితాలు భవిష్యత్ అసెంబ్లీ ఎన్నికల రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముందని భావిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌రంగారెడ్డిమహబూబ్‌నగర్ స్థానం నుంచి సురభి వాణీదేవి, వరంగల్‌ఖమ్మంనల్లగొండ స్థానం నుంచి తీన్మార్ మల్లన్న ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరి పదవీకాలం వచ్చే ఏడాది మార్చి 27తో ముగియనుండటంతో మార్చి చివరి నాటికి కొత్త ఎమ్మెల్సీల ఎన్నిక పూర్తికావాల్సి ఉంది.

**సెప్టెంబరులో ఓటరు నమోదు నోటిఫికేషన్?**

ఎన్నికల సంఘం సెప్టెంబరు చివరి వారంలో పట్టభద్రుల ఓటరు నమోదు నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉందని సమాచారం. అక్టోబరు నుంచి డిసెంబరు 31 వరకు నమోదు ప్రక్రియ కొనసాగి, జనవరిలో అభ్యంతరాలు, సవరణలు స్వీకరించి తుది జాబితా ప్రకటించే అవకాశముంది. అనంతరం ఫిబ్రవరి చివరి వారంలో లేదా మార్చి తొలి వారంలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడవచ్చని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**రెండు స్థానాలపై కాంగ్రెస్ గురి**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ రెండు స్థానాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, కొత్త నోటిఫికేషన్లు, ఉద్యోగ వర్గాల్లో సానుకూల వాతావరణం తమకు కలిసివస్తుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. అందుకే రెండు స్థానాలకూ అభ్యర్థిత్వం కోసం భారీ పోటీ నెలకొంది. హైదరాబాద్‌రంగారెడ్డిమహబూబ్‌నగర్ స్థానం నుంచి సామ రామ్మోహన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, శివసేనా రెడ్డి, గౌరీ సతీశ్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వరంగల్‌ఖమ్మంనల్లగొండ స్థానానికి పటేల్ రమేశ్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి, ఇందిర, లోకేశ్ యాదవ్ తదితరులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

**హైదరాబాద్ స్థానంపై బీజేపీ దృష్టి**

హైదరాబాద్‌రంగారెడ్డిమహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గంలో బీజేపీ బలమైన పోటీ ఇవ్వాలని భావిస్తోంది. పట్టభద్రులు, ఉద్యోగులు, యువతలో తమకున్న మద్దతును మరింత పెంచుకునే లక్ష్యంతో ఆ పార్టీ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. ఈ ఎన్నికల్లో విజయాన్ని సాధిస్తే రాష్ట్ర రాజకీయాల్లో తమ ప్రభావాన్ని మరింత విస్తరించవచ్చని బీజేపీ అంచనా వేస్తోంది.

**బీఆర్ఎస్‌లో కొత్త ముఖాలపై చర్చ**

హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్‌నగర్ సిట్టింగ్ ఎమ్మెల్సీ సురభి వాణీదేవి మళ్లీ పోటీ చేయకపోవచ్చనే ప్రచారం బీఆర్ఎస్‌లో కొత్త చర్చలకు దారితీసింది. ఈ నేపథ్యంలో కొత్త అభ్యర్థిని రంగంలోకి దించే అవకాశాలపై పార్టీ నాయకత్వం పరిశీలన జరుపుతోంది. ఐఆర్ఎస్ అధికారి ఒకరిని బరిలోకి దించే అవకాశాలపై కూడా చర్చ జరుగుతోంది. అలాగే వెంకటేశ్వర్‌రెడ్డి, ఆంజనేయగౌడ్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. వరంగల్‌ఖమ్మంనల్లగొండ స్థానానికి గత ఎన్నికల్లో పోటీ చేసిన ఏనుగుల రాకేశ్‌రెడ్డినే మళ్లీ బరిలోకి దించాలా? లేక కొత్త అభ్యర్థిని ఎంపిక చేయాలా? అనే అంశంపై పార్టీ తర్జనభర్జన పడుతోంది. వాసుదేవరెడ్డి పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

**రాజకీయంగా అత్యంత కీలక ఎన్నికలు**

2023 తర్వాత వరుస ఎన్నికల్లో ఎదురుదెబ్బలు ఎదుర్కొన్న బీఆర్ఎస్‌కు, అధికారాన్ని నిలబెట్టుకోవాలనుకుంటున్న కాంగ్రెస్‌కు, రాష్ట్రంలో మరింత బలపడాలనుకుంటున్న బీజేపీకి ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అత్యంత కీలకంగా మారాయి. పట్టభద్రుల తీర్పు ఏ పార్టీకి అనుకూలంగా ఉంటుందన్నది రాష్ట్ర రాజకీయాల్లో కొత్త దిశను నిర్దేశించే అవకాశముంది. అందుకే వచ్చే మార్చిలో జరగనున్న ఈ రెండు ఎమ్మెల్సీ ఎన్నికలు సాధారణ ఎన్నికలు కాకుండా రాజకీయ పార్టీలకు ప్రతిష్ఠాత్మక సమరంగా మారనున్నాయి.



## ఆయిల్ ఫామ్ రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

- జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా

మహబూబ్ నగర్, ఆగస్టు 03(వుదయం ప్రతినిధి):

జిల్లాలో ఆయిల్ పామ్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా హామీ ఇచ్చారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత శాఖల అధికారులు, ఆయిల్ పామ్ రైతులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు.

ఈ సందర్భంగా రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తూ, జిల్లాలోని ఆయిల్ పామ్ తోటల మీదుగా వెళ్తున్న హైటెన్షన్, లోటెన్షన్ విద్యుత్ లైన్ల వల్ల షార్ట్ సర్క్యూట్‌ల కారణంగా అగ్ని ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందని తెలిపారు. అలాగే ఆయిల్ పామ్ గెలలను కోసే కూలీల భద్రతకూ ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు విద్యుత్ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం 249 మంది రైతులకు చెందిన 1,090 ఎకరాల ఆయిల్ పామ్ తోటల్లో విద్యుత్ లైన్ల సమస్య ఉన్నట్లు అధికారులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో రైతులు యూరియా ఎరువులను ఏడాది పొడవునా అందుబాటులో ఉంచాలని, స్లాషర్లు, మల్చర్లు వంటి వ్యవసాయ యంత్రాలను పెద్ద ఎత్తున అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అడవి పందుల నుంచి లేత ఆయిల్ పామ్ తోటలను రక్షించేందుకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా అండర్‌గ్రౌండ్ డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రస్తుతం అమలులో ఉన్న 12.5 ఎకరాల సీలింగ్ పరిమితిని తొలగించాలని, కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని, రైతు క్షేత్రాల్లో ఉపాధి హామీ పథకం కింద కూలీలను అందుబాటులో ఉంచాలని కోరారు. తక్కువ నీరు ఇస్తున్న బోరుబావులు ఉన్నవారికి నీటిని నిల్వ చేసుకునేందుకు లైనింగ్‌తో కూడిన ఫార్మ్ పాండ్లను అధిక సంఖ్యలో మంజూరు చేయాలని కూడా అభ్యర్థించారు. రైతుల సమస్యలను ఓర్పుగా విన్న కలెక్టర్, జిల్లా స్థాయిలో పరిష్కరించగల అంశాలపై వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. విధానపరమైన, పాలనాపరమైన అంశాలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం ప్రత్యేకంగా కృషి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె. వేణుగోపాల్, విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ చక్రవర్తి, ఫ్రీ యూనిక్ ఆయిల్ పామ్ కంపెనీ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్‌రావు, ఉద్యానవన శాఖ అధికారులు, ఆయిల్ పామ్ రైతులు పాల్గొన్నారు.



## వనపర్తి జిల్లా ప్రజావాణి – సమగ్ర ముఖ్యాంశాలు

వనపర్తి ఆగస్టు 3 (వుదయం ప్రతినిధి)

జిల్లా ప్రజావాణితోపాటు, సీఎం ప్రజావాణి అర్జీలను ప్రాధాన్యతగా పరిష్కరించాలి : అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించి ఫిర్యాదుదారునికి సమాచారమివ్వాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ తో కలిసి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ ప్రజల నుంచి అర్జీలు, వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అధికారులకు సూచనలు ఇచ్చారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించి అట్టి సమాచారాన్ని సంబంధిత ఫిర్యాదు దారునికి పంపించటమే కాకుండా ఆన్లైన్ లో పెట్టాలని ఆదేశించారు. ఏదైనా ఉంటే పై అధికారులకు పంపించడం లేదా ఏ నిబంధన ప్రకారం పరిష్కారం చేయలేమో ఫిర్యాదు దారునికి తెలియజేయాలి తప్ప తమ వద్ద పెండింగ్ లో పెట్టుకోవద్దని సూచించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి నుంచి వచ్చిన ప్రజావాణి దరఖాస్తులను సైతం సత్వరమే పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. నేటి ప్రజావాణి కార్యక్రమంలో 50 దరఖాస్తులు వచ్చాయి. ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 2 దరఖాస్తులు వచ్చాయి. నేటి ప్రజావాణిలో జెడ్పి సీఈవో యాదయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎన్. తిరుపతయ్య, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## ఐఐటీ హైదరాబాద్‌లో 'అనుగ్యాన్' అణు సాంకేతిక కార్యక్రమం ప్రారంభం

హైదరాబాద్,సంగారెడ్డి ఆగస్టు 3:వుదయం

భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పౌర అణుశక్తి రంగానికి అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేయడమే లక్ష్యంగా ఐఐటీ హైదరాబాద్, క్రిమ్సన్ ఎనర్జీ ఎక్స్పర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా 'అనుగ్యాన్ న్యూక్లియర్ టెక్నాలజీ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ (NTOP)'ను సోమవారం ప్రారంభించాయి.

ఐఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం మూడు నెలల పూర్తిస్థాయి రెసిడెన్షియల్ శిక్షణగా కొనసాగనుంది. రియాక్టర్ ఫిజిక్స్, థర్మల్ హైడ్రాలిక్స్, రేడియేషన్ షీల్డింగ్, స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు (SMRs), అణు భద్రత, క్వాలిటీ అష్యూరెన్స్, ఇంజినీరింగ్ డిజైన్, AERB నిబంధనల అనుసరణతో పాటు సిమ్యులేటర్ ఆధారిత శిక్షణను అందించనున్నారు. భారతదేశ అణుశక్తి ఉత్పత్తి సామర్థ్యాన్ని 2047 నాటికి 100 గిగావాట్లకు పెంచాలనే లక్ష్యానికి అనుగుణంగా నైపుణ్య ఇంజినీర్లను తీర్చిదిద్దడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఇంజినీరింగ్ పట్టభద్రులు, ఉద్యోగంలో ఉన్న నిపుణులు, ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు, EPC సంస్థలు, పారిశ్రామిక పరికరాల తయారీదారులు ఈ శిక్షణ ద్వారా ప్రత్యేక నైపుణ్యాలను పొందే అవకాశం ఉంది.

కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసిన వారికి ఐఐటీ హైదరాబాద్, క్రిమ్సన్ ఎనర్జీ ఎక్స్పర్ట్స్ సంయుక్త ధ్రువీకరణ పత్రాన్ని అందజేయనున్నారు. దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ విద్యాసంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమల నుంచి పాల్గొనేవారితో తొలి బ్యాచ్ సోమవారం ప్రారంభమైంది.

ఈ సందర్భంగా ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి మాట్లాడుతూ, దేశం పౌర అణుశక్తి రంగాన్ని విస్తరిస్తున్న నేపథ్యంలో నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధి అత్యంత కీలకమన్నారు. విద్యా నైపుణ్యాన్ని పరిశ్రమ అనుభవంతో అనుసంధానించి భద్రత, ఆవిష్కరణలు, దేశ ఇంధన భద్రతకు దోహదపడే ఇంజినీర్లను తయారు చేయడమే అనుగ్యాన్ లక్ష్యమని చెప్పారు. క్రిమ్సన్ ఎనర్జీ ఎక్స్పర్ట్స్ న్యూక్లియర్ విభాగం అధ్యక్షుడు కమోడోర్ (రిటైర్డ్) ఆర్.డి. మానే మాట్లాడుతూ, అణు సాంకేతిక రంగంలో నాణ్యత ప్రమాణాలు, నియంత్రణ నిబంధనల అనుసరణ, ప్రత్యేక ఇంజినీరింగ్ నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. భవిష్యత్ సాంకేతికతలకు సిద్ధమైన నిపుణులను తయారు చేయడమే కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు.

భారత్ ఇన్నోవేట్-2026 సందర్భంగా ఫ్రాన్స్‌లోని నీస్‌లో ఐఐటీ హైదరాబాద్, డస్సాల్ట్ సిస్టమ్స్, క్రిమ్సన్ ఎనర్జీ ఎక్స్పర్ట్స్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం నేపథ్యంలో న్యూక్లియర్ ఇంజినీరింగ్‌లో డిజైన్ ఎక్సలెన్స్ కోసం ప్రత్యేక కేంద్రం ఏర్పాటుకు కూడా ఈ కార్యక్రమం దోహదపడనుంది. ఆధునిక అణు ఇంజినీరింగ్ డిజైన్, డిజిటల్ సిమ్యులేషన్, సంయుక్త పరిశోధనలకు ఈ కేంద్రం వేదికగా నిలవనుంది.

అణుశక్తి రంగంలో స్వదేశీ సాంకేతిక సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు భవిష్యత్ స్వచ్ఛ ఇంధన మౌలిక సదుపాయాలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను అభివృద్ధి చేయడంలో 'అనుగ్యాన్' కీలక ముందడుగుగా నిలవనుంది.





## ఎంపీ నిధుల పనులను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కే. హైమావతి
- అవసరం లేని పనులను రద్దు చేయాలని పంచాయతీ ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశం
- అభివృద్ధి పనుల పురోగతిపై ప్రతినెలా సమీక్ష నిర్వహణ

సిద్దిపేట, ఆగస్టు 3 (వుదయం ప్రతినిధి)

పార్లమెంట్ సభ్యుల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం కింద మంజూరైన పనులను వేగవంతంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజా ప్రతినిధుల నిధుల కింద చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో ఆమె సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల మంజూరు నిధులతో జిల్లాలో గత కొంతకాలంగా చేపట్టిన రహదారులు, తాగునీటి సౌకర్యాలు, పాఠశాల భవనాలు, సముదాయ భవనాలు మరియు ఇతర ప్రజా మౌలిక సదుపాయాల పనులకు సంబంధించిన సమగ్ర వివరాలను సేకరించాలని పంచాయతీ సాంకేతిక అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు మంజూరైన పనులు ఎన్ని, మొదలైనవి ఎన్ని, ఇంకా ప్రారంభం కానివి ఎన్ని అనే సంపూర్ణ సమాచారాన్ని సిద్ధం చేయాలన్నారు. ఇంకా ప్రారంభం కాని పనులలో ప్రజలకు అత్యంత అవసరమైన వాటిని మాత్రమే చేపట్టి, అనవసరమైన పనులను రద్దు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, అంతర్జాలంలో వివరాలను నమోదు చేయాలని సూచించారు. మంజూరైన నిధులను ప్రజా సంక్షేమం కోసం సక్రమంగా వినియోగించుకోవాలని, పనుల పురోగతిపై ఇకపై ప్రతి నెల ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహిస్తామని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రణాళికాధికారి దశరథం, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి రమేష్, జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, సురక్షిత తాగునీటి పథకం కార్యనిర్వాహక ఇంజనీర్, పంచాయతీ రాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, పురపాలక సంఘాల కమిషనర్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# తల్లి తన బిడ్డకు ఇవ్వగల మొదటి కానుక పుట్టిన వెంటనే ముర్రు పాలు ఇవ్వడమే

**సిడిపిఓ రాధికా రెడ్డి**

మహాదేవపూర్ ఆగస్టు03(వుదయం ప్రతినిధి)తల్లి తన బిడ్డకు ఇవ్వగల మొదటి కానుక పుట్టిన వెంటనే ముర్రు పాలు ఇవ్వడమే అని మహాదేవపూర్, సిడిపిఓ రాధికా రెడ్డి అన్నారు మహాదేవపూర్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని బొమ్మపూర్,ఎడపల్లి, అన్నారం గ్రామాలలోని అంగన్వాడీ కేంద్రలలో సోమవారం తల్లిపాల వారోత్సవాల వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ వేడుకల కార్యక్రమలలో మహాదేవపూర్ సిడిపిఓ రాధికా రెడ్డి హాజరై మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే మురుపాలు పట్టించాలని, ఇవి బిడ్డకు తల్లి అందించే మొదటి గొప్ప కానుక అన్నారు. ముర్రు పాలు పండించడం ద్వారా బిడ్డకి రోగనిరోధక శక్తి పెరుగుతుందని దీని ద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు బిడ్డ పుట్టినప్పటి నుండి ఆరు నెలల వయసు వచ్చేవరకు కేవలం తల్లిపాలు ఇవ్వాలని వేరే ఇతర ఆహార పదార్థాలు కానీ, నీళ్లు కానీ ఇవ్వకూడదని ఆరు నెల వరకు ఇచ్చే పాలల్లో బిడ్డకు సరిపడా నీరు, పోషకాలు అన్ని లభిస్తాయని వెల్లడించారు. అదేవిధంగా ఆరు నెలలు నిండిన తర్వాత తల్లిపాలతో పాటుగా అనుబంధ ఆహారం మొదలు పెట్టాలని, పిల్లలకి అన్ని రకాల ఆహార పదార్థాలు తినిపించాలని, అనుబంధ ఆహారంతో పాటుగా బిడ్డకి రెండు సంవత్సరాల వయసు వచ్చేవరకు ఆహార పదార్థాలతో పాటుగా తల్లిపాలు కూడా కచ్చితంగా కొనసాగించాలని పిల్లలకు పాలు ఇవ్వడం ద్వారా తల్లి బిడ్డకు అనుబంధం ఏర్పడుతుందని, తల్లులకు రొమ్ము క్యాన్సర్ రాకుండా నిరోధించబడుతుందని పేర్కొన్నారు.గర్భవతులు బాలింతలు పాటించాల్సిన పరిశుభ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం గురించి, అంగన్వాడి సర్వీసెస్ గురించి అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రమాదేవి,అంగన్వాడీ టీచర్ శ్రీలత,తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం.

**మండల అభివృద్ధి అధికారి వనపర్తి అద్వైత.**



ఖానాపురం, ఆగస్టు 3 (వుదయం ప్రతినిధి):నేడు మంగళవారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి వనపర్తి అద్వైత తెలిపారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి మాట్లాడుతూ నేడు ఉదయం 10 గంటలకు నిర్వహించే మండల సర్వసభ్య సమావేశంకు మండలంలోని ఇరవై ఒక్క గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజా ప్రతినిధులు అన్ని శాఖల అధికారులు పూర్తి నివేదికలతో సమావేశానికి సకాలంలో హాజరు కావలసిందిగా ఎంపీడీవో తెలిపారు.

# ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం బస్టాప్ ను ఏర్పాటు చేయండి

**జిల్లా కలెక్టర్ కు కుదురుపల్లి గ్రామస్తుల వినతి**



మహాదేవపూర్, ఆగస్టు 03:(వుదయం ప్రతినిధి)భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మహాదేవపూర్ మండలంలోని కుదురుపల్లి గ్రామస్తులు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కు వినతి పత్రం అందజేశారు.కుదురుపల్లి గ్రామం వద్ద బస్టాప్ కేటాయించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు.గ్రామస్తులు బస్సుల కోసం చాలా దూరం నడవాల్సి వస్తుందని, ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతిలో పేర్కొన్నారు. వర్షాకాలంలో రోడ్డుపై నిలబడటం మరింత కష్టంగా మారిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు మెంబర్లు మారవేని మౌనిక రాజశేఖర్,మాదరి మధుకర్, గోగుల నాగేందర్, మంచినీళ్ల రాజబాపు, సల్లం చిన్నరాజు, గోగుల స్నేహలత, గోగుల రాఘవేంద్ర తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# దివంగత ఉద్యమకారుడు జక్కి అశోక్ కుటుంబానికి రూ.2.01 లక్షల సాయం



వరంగల్ టౌన్, ఆగస్టు 03 (వుదయం ప్రతినిధి) : తెలంగాణ ఉద్యమకారుడు, వరంగల్ 20వ డివిజన్‌కు చెందిన దివంగత జక్కి అశోక్ కుటుంబానికి ఆయన చిన్ననాటి స్నేహితులు, కిట్స్ కళాశాల బీటెక్ క్లాస్‌మేట్స్ అండగా నిలిచారు.

వ్యాపారంలో నష్టాలు రావడం వల్ల మనస్తాపంతో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన అశోక్ కుటుంబానికి 'స్నేహితుల దినోత్సవం' సందర్భంగా సోమవారం రూ.2.01 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు.గత నెలలోనే రూ.75 వేల సాయం అందించిన మిత్రబృందం, ఈసారి అమెరికాలోని సహాధ్యాయులు, స్థానిక స్నేహితులతో కలిసి ఈ విరాళాన్ని సేకరించింది.

అశోక్ భార్య, కుమారుడికి భవిష్యత్తులోనూ ఎల్లప్పుడూ అండగా ఉంటామని స్నేహితులు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకుడు, మాజీ ఆర్టిఏ సభ్యుడు గోరంటల మనోహర్, రామకృష్ణ, చల్లా వేణుగోపాల్, ఊరుగొండ రవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. తమకు అండగా నిలిచిన మిత్రులందరికీ అశోక్ కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మాజీ ఎమ్మెల్యే పెద్ది చిత్రపటానికి పూలమాల వేసిన మాజీ ఎంపీటీసీలు.



ఖానాపురం, ఆగస్టు 3 (వుదయం ప్రతినిధి):
నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఇటీవలె అనారోగ్యానికి గురై మృతి చెందగా మృతుని చిత్రపటానికి మాజీ ఎంపీటీసీలు మర్రి కవితరామస్వామి, బోడ భారతిపూలునాయక్ పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యురాలు వడ్డే అశ్విని(రాణి)రాజశేఖర్, మహిళలు వడ్డే స్వరూపరమేష్, గంగాపురం రాజేశ్వరిరమేష్, బండి లలితకృష్ణ, గడ్డమీద అశ్వినిఅశోక్, ఎండి పరినసలాం, దుపటి రేణుకసదానందం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి నిస్పాక్షికంగా సేవలు అందించాలి

**జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్,**

మహాదేవపూర్ ఆగస్టు 03:(వుదయం ప్రతినిధి)ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి నిస్పాక్షికంగా సేవలు అందించాలి అని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు.వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం జిల్లా ఎస్పీ కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలు, కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలను నాటడం జరిగింది, అనంతరం పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు.రోడ్డు ప్రమాద కేసులకు సంబంధించిన వాహనాల స్థితిగతులు,వాటి పరిష్కార పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.రిసెప్షన్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని,అందిన ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల పురోగతిని సమీక్షించి దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.అదేవిధంగా స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణ, కేసు రికార్డుల నవీకరణ విధానాన్ని పరిశీలించి, అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ నిర్వహించాలని ఆదేశించారు.రౌడీ షీటర్లపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించి, వారిపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి పౌరుడికి స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను వేగవంతంగా,పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని అధికారులు, సిబ్బందికి ఎస్పీ ఆదేశించారు.ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం మరింత పెంపొందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ఈ వార్షిక తనిఖీలలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, మహాదేవ్‌పూర్ సీఐ వెంకటేశ్వర్లు, కాళేశ్వరం ఎస్ఐ తమాషా రెడ్డి, అధికారులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాకతీయ వైభవానికి కేంద్రం పెద్దపీట వేయాలి!

*పార్లమెంట్‌లో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య డిమాండ్*

వరంగల్ , ఆగస్టు 03 (వుదయం ప్రతినిధి) :



కాకతీయుల వారసత్వ పరిరక్షణ, వరంగల్ చారిత్రక నగర సమగ్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య డిమాండ్ చేశారు. లోక్‌సభలో కాకతీయ కట్టడాలు, సంస్కృతి, చేనేత-హస్తకళలు మరియు పర్యాటక అభివృద్ధికి గత మూడేళ్లలో తీసుకున్న చర్యలపై ఆమె ప్రశ్నించారు.?దీనికి కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ లిఖితపూర్వక సమాధానమిస్తూ... తెలంగాణలోని ఏఎస్ఐ (ూూ×) రక్షిత కట్టడాల్లో వరంగల్ కాకతీయ నిర్మాణాలు కూడా ఉన్నాయని, నిధుల లభ్యత ఆధారంగా నిర్వహణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.?ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ:?ప్రపంచ స్థాయి సదుపాయాలు, వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి వద్ద అంతర్జాతీయ స్థాయి పర్యాటక వసతులు కల్పించాలి.? రామప్పకు 'ప్రసాద్' పథకం కింద నిధులు ఇవ్వడం అభినందనీయమే అయినా, కాకతీయ వారసత్వ ప్రాంతాలన్నింటికీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అవసరం. వరంగల్ కోట అభివృద్ధికి ఏఎస్ఐ, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మధ్య జరిగిన ఒప్పందం కాగితాలకే పరిమితం కాకుండా పనులు వేగవంతం చేయాలి.?కాకతీయ వైభవ పునరుద్ధరణ, వరంగల్ సమగ్రాభివృద్ధి కోసం పార్లమెంట్ వేదికగా నిరంతరం పోరాడతానని ఎంపీ స్పష్టం చేశారు.


# పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ రాజ్యసభ సభ్యులు గరికపాటి మోహన్ రావు



వరంగల్ జిల్లా నల్లబెల్లి ఆగస్టు 3 (వుదయం ప్రతినిధి): నర్సంపేట మాజీ శాసనసభ్యులు, తెలంగాణ ఉద్యమ సీనియర్ నాయకులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో కన్నుమూయడంతో వారి కుటుంబ సభ్యులను మాజీ రాజ్యసభ సభ్యులు, భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు గరికపాటి మోహన్ రావు సోమవారం వారి నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన గరికపాటి మోహన్ రావు మాట్లాడుతూ, ఆయన మరణం నర్సంపేట నియోజకవర్గానికే కాకుండా ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాలకు తీరని లోటని పేర్కొన్నారు. ప్రజలతో ఎల్లప్పుడూ మమేకమై, వారి సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసిన ప్రజానాయకుడిగా సుదర్శన్ రెడ్డి చిరస్థాయిగా ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని కొనియాడారు. రాజకీయ పార్టీలు, సిద్ధాంతాలు వేర్వేరైనా ప్రజాసేవే ప్రతి నాయకుడి ప్రధాన ధ్యేయమని పేర్కొన్న ఆయన, పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజల విశ్వాసాన్ని సంపాదించిన నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. ఆయన చేసిన ప్రజాసేవ భావితరాలకు ఆదర్శప్రాయమని, ప్రజల కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడిగా చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు.అనంతరం సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చిన గరికపాటి మోహన్ రావు, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని వారికి భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. అలాగే, పెద్ది సుదర్శన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, ఎన్ఎస్ఆర్ అధినేత సంపత్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు తడుక వినయ్ గౌడ్, నర్సంపేట పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, రూరల్ మండల అధ్యక్షుడు తనుగుల అంబేద్కర్, నియోజకవర్గ నాయకుడు జూలూరు మనిషి గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు దుంక దువ్వ రంజిత్, యువ మోర్చా నాయకులు, మండల పార్టీ నాయకులు తదితరులు పాల్గొని పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.

# ప్రీ ప్రైమరీ స్కూల్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**మండల విద్యాశాఖ అధికారి కోడెపాక రఘుపతి**



చిట్యాల ఆగస్టు 03:(వుదయం ప్రతినిధి)చిట్యాల మండలంలోని ప్రాథమిక పాఠశాల నవాబుపేట( డబ్ల్యూ ) ప్రీ ప్రైమరీ పాఠశాలగా ఎంపికైనట్లుగా మండల విద్యాశాఖ అధికారి కోడెపాక రఘుపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఒక ఇన్స్ ట్రక్టర్, ఆయా పోస్టులకు అర్హులైన స్థానికులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని ఈ నెల 5 బుధవారం సాయంత్రం 4గంటల లోపు ఎమ్మార్సీ చిట్యాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇన్స్ ట్రక్టర్ పోస్టుకు ఇంటర్, ఆయా పోస్టుకు 7వ తరగతి విద్యా అర్హత ఉన్నవాళ్లు స్థానికులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకునేవారు టెన్త్, ఇంటర్, ప్రీ ప్రైమరీ, బిఈడి, రెసిడెన్సీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఒక పాస్ ఫోటోతో దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు.

# వర్ధన్నపేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

***వర్ధన్నపేట గురుకులంలో ఫుడ్ పాయిజన్: 25 మంది విద్యార్థినులకు అస్వస్థత!***

***రాష్ట్రంలో ఆగని కలుషిత ఆహారాల కలకలం***

***ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు***

***బాధితులను పరామర్శించిన అధికారులు***



వర్ధన్నపేట, ఆగస్టు 03 ( వుదయం ప్రతినిధి ):రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న గురుకుల పాఠశాలల ఫుడ్ పాయిజన్ ఘటనలు విద్యార్థుల తల్లిదండ్రులను, ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. నిన్నమొన్నటి ఘటనలు మరువక ముందే, తాజాగా వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో మరో ఘోరం వెలుగుచూసింది. వర్ధన్నపేట గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో కలుషిత ఆహారం (ఫుడ్ పాయిజన్) తిని ఏకంగా 25 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

అసలేం జరిగిందంటే..?స్థానిక గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు వడ్డించిన ఆహారం కలుషితం కావడంతో, అది తిన్న కొద్దిసేపటికే పలువురు బాలికలు కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో తీవ్ర ఇబ్బంది పడ్డారు. పరిస్థితి విషమించడంతో అప్రమత్తమైన పాఠశాల సిబ్బంది వెంటనే బాధితులను వర్ధన్నపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రస్తుతం వీరంతా అత్యవసర విభాగంలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు.

**అధికారుల పరామర్శ.. చికిత్సపై ఆరా:**

ఘటనపై సమాచారం అందుకున్న ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే స్పందించింది. తహసీల్దార్ విజయసాగర్, జెడ్పీ సీఈవో రామ్ రెడ్డి, డీటీడీఓ (ఋఖ) నారాయణరెడ్డి, హాస్పిటల్స్ సూపరింటెండెంట్ వీరిన్ తదితరులు వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించి, వారికి అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో స్వయంగా మాట్లాడి, ఏ ఆహారం తిన్న తర్వాత అస్వస్థతకు గురయ్యారనే వివరాలను



సేకరించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

**ఆందోళనలో తల్లిదండ్రులు:**

రాష్ట్రవ్యాప్తంగా వరుసగా గురుకులాలు, హాస్టళ్లలో ఇలాంటి ఫుడ్ పాయిజన్ ఘటనలు పునరావృతమతుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హాస్టళ్లలో ఆహార నాణ్యతను పర్యవేక్షించడంలో అధికారులు, సిబ్బంది పూర్తిగా విఫలమవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ప్రభుత్వ వైద్య కళాశాలలో అవయవదాన ప్రతిజ్ఞ



నర్సంపేట వుదయం ప్రతినిధి ఆగస్టు 3. ప్రభుత్వ వైద్య కళాశాల, నర్సంపేటలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సోమవారం అవయవదాన ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, అవయవదానం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన పెంచుకుని ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అవయవదానం చేయండి. జీవితాలను కాపాడండి. జీవితాన్ని ఇవ్వండి. నమ్మకాన్ని కల్పించండి" అనే సందేశాన్ని ఆయన విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అవయవదాన ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ పూనమ్ కుమారి, డాక్టర్ గిరిధర్, డాక్టర్ పరశురాం, డాక్టర్ వెంకని, డాక్టర్ అరుణ, డాక్టర్ ఉష, డాక్టర్ సుజాత, డాక్టర్ స్వతంత్రతో పాటు ఎంఎస్‌డబ్ల్యూ ఎన్. పద్మజ, హెచ్‌ఈటీ విజయ్ కుమార్ మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# పంట పొలాలను సందర్శించిన తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు



చిట్యాల ఆగస్టు 03:(వుదయం ప్రతినిధి):చిట్యాల మండలంలో రైతులు సాగు చేస్తున్న వరి, ప్రత్తి పంటలను సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి ప్రస్తుత పంట పరిస్థితులు, వర్షాల ప్రభావం, చీడపీడలు మరియు తెగుళ్ల నివారణపై శాస్త్రీయ సూచనలు అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, జయశంకర్ భూపాలపల్లి కోఆర్డినేటర్ డా. కె. మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా వెంటనే కాలువల ద్వారా బయటకు పంపాలని రైతులకు సూచించారు.ఎక్కువసేపు నీరు నిల్వ ఉండటం వల్ల వేరుకుళ్లు, తెగుళ్లు మరియు దిగుబడి తగ్గే ప్రమాదం ఉంటుందని తెలిపారు.ప్రత్తి పంటలో ప్రస్తుతం ఆకుమచ్చ తెగులు రసం పీల్చే పురుగుల ఉధృతి కనిపించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రోపికోనాజోల్ 25 ఈ సి ఏ 200 మి.లీ./ఎకరాకు పిచికారి చేయాలని సూచించారు. రసం పీల్చే పురుగుల నివారణకు అసిఫేట్ ఏ 1.5 గ్రా./లీటరు లేదా ఇమిడాక్లోప్రిడ్ ఏ 0.3 మి.లీ./లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని రైతులకు వివరించారు. అదేవిధంగా వరి పంటలో ప్రధానంగా ఆశించే మొగి పురుగు (స్టమ్ బోరర్) లక్షణాల నివారణ చర్యలను రైతులకు వివరించారు. నారుమడి మరియు పిలక దశలో ఈ పురుగు ఆశిస్తే మొక్కలు ఎండిపోయి చనిపోతాయని తెలిపారు. ముదురు గోధుమ లేదా పసుపు రంగులో ఉండే ఆడ పురుగుల ముందు రెక్కలపై నల్లటి మచ్చ ఉండటం, లార్వా ఎదిగిన తరువాత నారింజ-పసుపు రంగు తల కలిగి ఉండటం ఈ పురుగు లక్షణాలని వివరించారు.మొగి పురుగు నివారణకు నారు పీకే 7 రోజుల ముందు రెండు గుంటల నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను చల్లి నీటిని మడిలోనే ఉంచాలని సూచించారు. ముదురు నారు నాటేటప్పుడు నారు కొనలను కత్తిరించి నాటడం మంచిదని తెలిపారు. నాట్లు వేసిన 10--15 రోజులలో కార్బోఫ్యూరాన్ 3జీ ఏ 10 కిలోలు/ఎకరా లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ ఏ 8 కిలోలు/ఎకరా లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4జీ ఏ 4 కిలోలు/ఎకరా చల్లాలని సూచించారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్ పి ఏ 400 గ్రాములు/ఎకరా లేదా క్లోరాంట్రానిలిప్రోల్ ఏ 60 మి.లీ./ఎకరాకు పిచికారి చేయాలని తెలిపారు.ఈ క్షేత్ర సందర్శనలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి సన్నీ తోపాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## రోజూ ఇంట్లో వాడే ప్లాస్టిక్ వస్తువులతో ఊబకాయం..



ఊబకాయం అంటే ఎక్కువగా తినడం, తక్కువగా కదలడం వల్లే వస్తుందని చాలా కాలంగా భావిస్తున్నారు. అయితే తాజాగా వెలువడుతున్న పరిశోధనలు మరో కీలక విషయాన్ని వెలుగులోకి తెస్తున్నాయి. మనం రోజూ ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువులు, ఆహార ప్యాకేజింగ్, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల్లో ఉండే కొన్ని రసాయనాలు శరీరంలోని హార్మోన్ల పనితీరును దెబ్బతీసి ఇన్సులిన్ నిరోధకత (ఇన్సులిన్ రెసిస్టెన్స్)ను పెంచడంతోపాటు కొవ్వు నిల్వలను అధికం చేస్తున్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఈ రసాయనాలను ఒబిసోజెన్స్ (Obesogens) అని పిలుస్తారు. ఒబిసోజెన్స్ అంటే శరీరంలో కొవ్వు జీవక్రియను ప్రభావితం చేసే రసాయనాలు. సాధారణంగా ఆహారం ద్వారా లభించే శక్తిని శరీరం వినియోగించాల్సి ఉండగా, ఈ రసాయనాల ప్రభావంతో అదే శక్తి కొవ్వుగా నిల్వ అయ్యే అవకాశాలు పెరుగుతాయి. ఇవి ఈస్ట్రోజెన్, థైరాయిడ్, గ్లూకోకార్టికాయిడ్ వంటి హార్మోన్ల పనితీరును అనుకరించడం లేదా వాటి పనిని అడ్డుకోవడం ద్వారా జీవక్రియలలో మార్పులు తీసుకొస్తాయి. ఈ రసాయనాలకు ప్రధాన వనరు ప్లాస్టిక్ ఉత్పత్తులే. పాలీకార్బొనేట్ ప్లాస్టిక్‌లు, ఆహార డబ్బాల లోపలి పూతల్లో ఉపయోగించే బిస్‌ఫెనాల్-ఎ (BPA), ప్లాస్టిక్‌ను మృదువుగా ఉంచేందుకు ఉపయోగించే థాలేట్స్ (Phthalates)ను అత్యంత ఎక్కువగా అధ్యయనం చేసిన ఒబిసోజెన్స్‌గా గుర్తించారు. ప్లాస్టిక్ డబ్బాలను వేడి చేసినప్పుడు, ఎక్కువకాలం ఉపయోగించినప్పుడు లేదా ఆమ్లత్వం ఎక్కువగా ఉన్న ఆహారాన్ని నిల్వ చేసినప్పుడు ఈ రసాయనాలు ఆహారంలోకి కలిసిపోయి శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంటుంది. ఇన్సులిన్ రెసిస్టెన్స్ అంటే రక్తంలో ఉన్న గ్లూకోజ్‌ను కణాలు సరిగా స్వీకరించకపోవడం. ఇది టైప్-2 డయాబెటిస్, మెటబాలిక్ సిండ్రోమ్‌కు ప్రధాన కారణంగా మారుతుంది. BPA వంటి రసాయనాలు క్లోమగ్రంథిలోని బీటా కణాలపై ప్రభావం చూపి అవసరానికి మించి ఇన్సులిన్‌ను విడుదల చేయిస్తాయి. ఈ పరిస్థితిని హైపర్‌ఇన్సులినీమియా అంటారు. దీర్ఘకాలంలో కణాలు ఇన్సులిన్‌కు స్పందించకుండా మారి ఇన్సులిన్ నిరోధకత ఏర్పడుతుంది. అదే సమయంలో ఈ రసాయనాలు శరీరంలో కొత్త కొవ్వు కణాలు ఏర్పడే ప్రక్రియను కూడా వేగవంతం చేస్తాయి. దీనివల్ల కొవ్వు నిల్వ సామర్థ్యం పెరిగి ఊబకాయం వచ్చే ప్రమాదం అధికమవుతుంది. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ రోచెస్టర్ మెడికల్ సెంటర్ నిర్వహించిన పరిశోధనలో మూత్రంలో థాలేట్స్ స్థాయిలు ఎక్కువగా ఉన్న పురుషుల్లో పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోవడం, ఇన్సులిన్ రెసిస్టెన్స్ ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఈ రసాయనాలు టెస్టోస్టెరాన్ పనితీరును కూడా ప్రభావితం చేసి జీవక్రియలలో మార్పులు తీసుకువచ్చే అవకాశం ఉంటుందని పరిశోధకులు తెలిపారు. మరోవైపు బ్రునెల్ యూనివర్సిటీ లండన్, న్యూయార్క్ యూనివర్సిటీ, వ్రిజే యూనివర్సిటీ ఆమ్‌స్టర్‌డామ్ పరిశోధకులు నిర్వహించిన మెటా-విశ్లేషణలో చిన్న వయస్సులోనే తక్కువ మోతాదులో BPAకి గురైన జంతువుల్లో తర్వాతి జీవితంలో శరీర కొవ్వు, ట్రైగ్లిసరైడ్లు, ఫ్రీ ఫ్యాటీ యాసిడ్లు గణనీయంగా పెరిగినట్లు గుర్తించారు. ప్రస్తుతం అనుమతించిన భద్రతా పరిమితుల్లో ఉన్న మోతాదులే అయినప్పటికీ ఇలాంటి ప్రభావాలు కనిపించడం ఆందోళన కలిగించే విషయమని పరిశోధకులు పేర్కొన్నారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోయినా, కొన్ని అలవాట్లు పాటించడం ద్వారా ఈ రసాయనాల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు. ప్లాస్టిక్ డబ్బాల్లో ఆహారాన్ని మైక్రోవేవ్‌లో వేడి చేయకుండా గాజు లేదా సిరామిక్ పాత్రలు ఉపయోగించడం మంచిది. తాగునీటిని కార్బన్ లేదా రివర్స్ ఆస్మోసిస్ (RO) ఫిల్టర్ ద్వారా శుద్ధి చేసుకోవడం వల్ల మైక్రోప్లాస్టిక్‌లు తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే ప్లాస్టిక్‌లో ప్యాక్ చేసిన ప్రాసెస్డ్ ఆహారాల కంటే తాజా, సహజ ఆహారాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఒబిసోజెన్స్‌కు గురయ్యే అవకాశాన్ని తగ్గించుకోవచ్చు.

## మెడిటెర్రేనియన్ డైట్‌లో ఈ ప్రొటీన్


ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరుగుతున్న కొద్దీ రకరకాల ఆహారాల మీదా ప్రజల్లో ఆసక్తి కలుగుతున్నది. ఎలా తీసుకుంటే ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయి? ఎక్కడి ఆహారంలో ఏం ప్రత్యేకతలున్నాయి? లాంటివీ



చర్చల్లోకి వస్తున్నాయి. ఇటీవల శాస్త్రవేత్తలు మధ్యధరా ప్రాంతపు ఆహార అలవాట్ల మీద చేసిన పరిశోధనలో ఒక ఆసక్తికర విషయం వెల్లడైంది. అమెరికాలోని సదరన్ క్యాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో దాదాపు ఇరవై ఏండ్లకుపైగా చేసిన ఈ పరిశోధనలో మనుషుల్లో ముసలితనం రావడాన్ని నెమ్మదింపజేసేందుకు మధ్యధరా ప్రాంతపు ఆహారం తోడ్పడుతున్నదని తేలింది. అక్కడి ఆహారం మన శరీర కణాల్లోని ప్రత్యేక సూక్ష్మ ప్రొటీన్‌లను యాక్టివేట్ చేస్తున్నదని, అది గుండె, మెదడు ఆరోగ్యంగా ఉండేందుకు సాయపడుతున్నదని చెబుతున్నారు పరిశోధకులు. ఆ ప్రాంతంలో ఎక్కువగా ఆలివ్ నూనె, చేపలు, చిక్కుడు జాతి గింజలు, పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలతోపాటు తక్కువగా ప్రాసెస్ చేసిన కార్బోహైడ్రేట్లు కలిగిన ఆహారాన్ని తీసుకుంటారు. ఇవి మన కణాల్లో శక్తిని ఉత్తేజితం చేసే మైటోకాండ్రియాలో ఉండే హ్యూమనిన్, ష్మాజ్ (ఎస్‌హెచ్‌ఎమ్‌ఓఓఎస్‌ఈ) అనే ప్రత్యేక ప్రొటీన్‌లను యాక్టివేట్ చేసేందుకు తోడ్పడుతున్నాయట. మెడిటెర్రేనియన్ డైట్‌ను చక్కగా అనుసరించే వారి రక్తంలో వీటి నమూనాలు ఎక్కువగా కనిపించాయట. ఇవి గుండె ఆరోగ్యంతో పాటు అల్జీమర్స్ లాంటి వ్యాధుల నుంచి రక్షణ కల్పించే మెదడు కణాల సంబంధిత ప్రక్రియలోనూ కీలకంగా పనిచేస్తాయి. అంటే ఈ ఆహారం ముసలితనాన్ని నెమ్మదింపజేసేలా, చిన్న వయసులో మరణాలను అరికట్టేలా తోడ్పడుతున్నదని ఈ అధ్యయనం చెబుతున్నది. అందుకే వృద్ధాప్యాన్ని ఆరోగ్యవంతంగా చేసే ఆహార ప్రణాళికల తయారీలో ఈ ఫలితాలు మంచి మార్గదర్శకాలు కానున్నాయి.

## గ్యాస్ట్రో ఎంటరైటిస్, ఫుడ్ పాయిజనింగ్‌ల మధ్య తేడాలేమిటి..

వర్షాకాలం సీజన్ అంటేనే చాలా మందికి రోగాల సీజన్ అనే భావన ఉంటుంది. అందుకు కారణం ఒక్క సారిగా మారే ఉష్ణోగ్రతలతోపాటు, అదే సమయంలో వాతావరణంలో ఉండే



తేమ, బ్యాక్టీరియా, వైరస్‌లకు అనుకూల వాతావరణం ఏర్పడడం, ఇంటి చుట్టు పక్కల లేదా ఇంట్లో కొన్ని ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండడం, పారిశుద్ధ్య సమస్యలు, కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవడం వంటివి కూడా తోడవుతుంటాయి. దీంతో ఈ సీజన్‌లో అనేక రోగాల నుంచి ముప్పు ఉంటుంది. ముఖ్యంగా చిన్నారులు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, వృద్ధులకు వ్యాధుల ముప్పు అధికంగా ఉంటుంది. ఇక ఈ సీజన్‌లో చాలా మందికి వచ్చే సమస్యల్లో గ్యాస్ట్రో ఎంటరైటిస్ కూడా ఒకటి. దీన్నే స్టమక్ ఫ్లూ అని కూడా పిలుస్తారు. ఇది జీర్ణాశయం, పేగులలో ఏర్పడే ఇన్‌ఫెక్షన్. ప్రధానంగా నోరోవైరస్, రోటావైరస్ వంటి వైరస్‌ల వల్ల వస్తుంది. కొన్ని సందర్భాల్లో బ్యాక్టీరియా కూడా దీనికి కారణమవుతుంది. ఇది ఒకరి నుంచి మరొకరికి సులభంగా వ్యాపించే అంటువ్యాధి. కలుషితమైన చేతులు, ఉపరితలాలు లేదా సన్నిహిత సంబంధాల ద్వారా ఒకే కుటుంబంలో లేదా కార్యాలయంలో పలువురికి సోకే అవకాశం ఉంటుంది. ఫుడ్ పాయిజనింగ్ అంటే కలుషితమైన ఆహారం లేదా నీటిని తీసుకోవడం వల్ల సంభవించే సమస్య. ఈ.కోలి, సాల్మొనెల్లా, క్యాంపిలోబాక్టర్ వంటి బ్యాక్టీరియా లేదా అవి విడుదల చేసే విషపదార్థాల కారణంగా ఇది వస్తుంది. గ్యాస్ట్రోఎంటరైటిస్‌లా ఇది వ్యక్తి నుంచి వ్యక్తికి వ్యాపించదు. అయితే ఒకే కలుషితమైన ఆహారాన్ని తిన్నవారిలో ఒకేసారి ఈ సమస్య కనిపించే అవకాశం ఉంటుంది. ఈ రెండు సమస్యల్లోనూ తరచూ నీళ్ల విరేచనాలు, వికారం, వాంతులు, కడుపు నొప్పి, కడుపులో మెలికలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. అందువల్ల వాటిని వేరు చేయడం కొంత కష్టంగా ఉంటుంది. గ్యాస్ట్రోఎంటరైటిస్‌లో మాత్రం సాధారణంగా స్వల్ప జ్వరం, చలిగా అనిపించడం, ఒళ్లునొప్పులు, కండరాల నొప్పి, తీవ్రమైన అలసట వంటి శరీరమంతా ప్రభావితం చేసే లక్షణాలు కనిపిస్తాయి. ఇవి సాధారణంగా 24 గంటల్లో క్రమంగా పెరుగుతాయి. ఫుడ్ పాయిజనింగ్‌లో లక్షణాలు చాలా వేగంగా ప్రారంభమవుతాయి. కలుషితమైన ఆహారం తిన్న కొద్దిసేపటికే తీవ్ర వాంతులు, తీవ్రమైన కడుపు మెలికలు, కొన్నిసార్లు మలంలో రక్తం కనిపించడం వంటి లక్షణాలు వస్తాయి. అదే ఆహారం తిన్న మరికొందరిలో కూడా ఇలాంటి లక్షణాలు ఒకేసారి కనిపించడం ఫుడ్ పాయిజనింగ్‌కు సంకేతంగా భావిస్తారు. వర్షాకాలంలో మురుగునీరు తాగునీటిలో కలవడం వల్ల జీర్ణాశయ వ్యాధులు వేగంగా వ్యాపిస్తాయి. అధిక తేమ, మోస్తరు ఉష్ణోగ్రతల కారణంగా బ్యాక్టీరియా ఆహారంలో వేగంగా పెరుగుతుంది. ముఖ్యంగా రోడ్ల పక్కన విక్రయించే ఆహారం, మూత లేకుండా ఉంచిన పదార్థాలు, మరిగించని నీటితో తయారుచేసిన చల్లని పానీయాలు, కలుషితమైన ఐస్‌క్యూబ్స్ ఉపయోగించిన పానీయాలు ఈ కాలంలో ఎక్కువ ప్రమాదాన్ని కలిగిస్తాయి. గ్యాస్ట్రో ఎంటరైటిస్‌కు ఎక్కువగా వైరస్‌లే కారణమవుతాయి కాబట్టి యాంటీబయోటిక్స్ సాధారణంగా ఉపయోగపడవు. విశ్రాంతి తీసుకోవడం, శరీరంలో కోల్పోయిన నీరు, లవణాలను భర్తీ చేయడానికి ఓఆర్ఎస్ (ORS) ద్రావణం తీసుకోవడం ప్రధాన చికిత్సగా ఉంటుంది. చాలావరకు ఈ వ్యాధి కొన్ని రోజుల్లో స్వయంగా తగ్గిపోతుంది. తరచూ విరేచనాలు, వికారం, వాంతులు, కడుపు నొప్పి లేదా మంట, ఉబ్బరం, అజీర్ణం, జ్వరం, ఆకలి తగ్గడం, నీరసం, డీహైడ్రేషన్ వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు రెండు రోజులకుపైగా కొనసాగినా, తీవ్ర డీహైడ్రేషన్, మలంలో రక్తం లేదా అధిక జ్వరం ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించాలి. వర్షాకాలంలో తాగునీటి విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఫిల్టర్ చేసిన, మరిగించిన లేదా శుద్ధి చేసిన

## 30 ఏళ్లు దాటిన వారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..

30 ఏళ్లు దాటిన తర్వాత శరీరంలో సహజంగానే అనేక మార్పులు ప్రారంభమవుతాయి. జీవక్రియ (మెటబాలిజం) వేగం తగ్గడం, కండరాల బలం క్రమంగా తగ్గడం, ఎముకల సాంద్రత తగ్గడం వంటి మార్పులు భవిష్యత్తులో దీర్ఘకాలిక వ్యాధులకు పునాది వేస్తాయి. అందుకే ఈ వయస్సు నుంచే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడం ద్వారా గుండె జబ్బులు, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధుల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. 30 ఏళ్ల తర్వాత జీవక్రియ సహజంగానే నెమ్మదిస్తుంది. దీంతో బరువు పెరగడం, ఇన్సులిన్ రెసిస్టెన్స్ వచ్చే అవకాశం ఎక్కువ అవుతుంది. అలాగే ప్రతి దశాబ్దానికి శరీరంలోని కండరాల పరిమాణం క్రమంగా తగ్గడం ప్రారంభమవుతుంది. ఎముకల సాంద్రత కూడా తగ్గడం మొదలవుతుంది. ఈ దశలోనే రక్తపోటు, కొలెస్ట్రాల్, ఫ్యాటీ లివర్, టైప్ 2 డయాబెటిస్ వంటి సమస్యలు ఎలాంటి లక్షణాలు కనిపించకుండానే అభివృద్ధి చెందే అవకాశాలు ఉంటాయి. ఉద్యోగ బాధ్యతలు, కుటుంబ ఒత్తిళ్లు పెరగడం వల్ల దీర్ఘకాలిక ఒత్తిడి కూడా ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఈ వయస్సులో ఆహారపు అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. తాజా పండ్లు, కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలు, తక్కువ కొవ్వు కలిగిన ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న



సమతుల్య ఆహారం తీసుకోవాలి. ప్రాసెస్ చేసిన ఆహారాలు, అధిక చక్కెర, ఎక్కువ ఉప్పు ఉన్న పదార్థాలను వీలైనంత వరకు తగ్గించడం మంచిది. ముందుగానే భోజన ప్రణాళికను రూపొందించుకోవడం వల్ల అనారోగ్యకరమైన ఆహారం తీసుకునే అవకాశాలు తగ్గుతాయి. నిత్యవ్యాయామాన్ని జీవితంలో భాగంగా మార్చుకోవాలి. వారానికి కనీసం 150 నిమిషాలపాటు మోస్తరు తీవ్రతతో కూడిన వ్యాయామం చేయడంతోపాటు వారానికి రెండు రోజులైనా కండరాల బలం పెంచే వ్యాయామాలు చేయడం అవసరం. నడక, సైక్లింగ్, యోగా, డ్యాన్స్ వంటి ఇష్టమైన వ్యాయామాలను ఎంచుకుంటే వాటిని క్రమం తప్పకుండా కొనసాగించడం సులభమవుతుంది. వ్యాయామం వల్ల బరువు నియంత్రణలో ఉండటమే కాకుండా గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. అలాగే మధుమేహం వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుంది. మంచి నిద్ర కూడా ఆరోగ్యానికి అత్యంత కీలకం. ప్రతి రోజు 7 నుంచి 9 గంటల నాణ్యమైన నిద్ర అవసరం. తగినంత నిద్ర లేకపోతే బరువు పెరగడం, రోగనిరోధక శక్తి తగ్గడం, మానసిక సమస్యలు పెరగడం వంటి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. నిద్రించే ముందు మొబైల్, ఇతర స్క్రీన్‌ల వినియోగాన్ని తగ్గించడం, ఒకే సమయానికి నిద్రపోయే అలవాటు చేసుకోవడం మంచిది. ఒత్తిడిని నియంత్రించడం కూడా అంతే ముఖ్యం. నిరంతర ఒత్తిడి శరీరంలో వాపు సంబంధిత సమస్యలను పెంచడంతో పాటు గుండె జబ్బులు, ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలకు దారితీస్తాయి. ధ్యానం, యోగా, శ్వాస వ్యాయామాలు లేదా ఇష్టమైన హాబీలకు సమయం కేటాయించడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవాలి. అవసరమైతే మానసిక ఆరోగ్య నిపుణుల సహాయం తీసుకోవడం కూడా ఉపయోగకరం. శరీరంలోని ప్రతి వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి తగినంత నీరు తాగడం అవసరం. సరిపడా నీరు తాగడం వల్ల శక్తి స్థాయిలు మెరుగుపడటమే కాకుండా జీర్ణక్రియ, చర్మ ఆరోగ్యం కూడా మెరుగ్గా ఉంటుంది. రోజంతా తగినంత నీరు తాగే అలవాటు చేసుకోవాలి. ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకపోయినా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం మంచిది. రక్తపోటు, రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ వంటి పరీక్షలను వైద్యుల సూచన మేరకు చేయించుకోవాలి. మహిళలు గైనకాలజీ పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదు. పురుషులు కూడా వయస్సుకు అనుగుణంగా అవసరమైన ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి.

## బయటి ఆహారం ఎక్కువగా తింటున్నారా.. అయితే జాగ్రత్త..



వర్షాకాలంలో జీర్ణాశయ, పేగుల ఇన్‌ఫెక్షన్ల ప్రమాదం గణనీయంగా పెరుగుతుందన్న విషయం అందరికీ తెలిసిందే. ఈ కాలంలో అతిసారం, వాంతులు, కడుపు నొప్పి, ఫుడ్ పాయిజనింగ్ వంటి సమస్యలతో ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వర్షాల కారణంగా తాగునీటి వనరులు కలుషితమవడం, బ్యాక్టీరియా, వైరస్‌లు, పరాన్నజీవులు వేగంగా వ్యాప్తి చెందేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడటం ఇందుకు ప్రధాన కారణాలుగా ఉంటాయి. వర్షాకాలంలో అధిక తేమ, తడి వాతావరణం కారణంగా సూక్ష్మజీవులు వేగంగా వృద్ధి చెందుతాయి. భారీ వర్షాల సమయంలో మురుగునీరు తాగునీటిలో కలిసిపోవడం వల్ల జీర్ణాశయ సంబంధిత ఇన్‌ఫెక్షన్ల ప్రమాదం మరింత పెరుగుతుంది. పిల్లలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు ఈ ఇన్‌ఫెక్షన్లకు ఎక్కువగా గురవుతారు. వర్షాకాలంలో ఆహారం సులభంగా కలుషితమవుతుంది. సరిగా నిల్వ చేయని ఆహారం, పూర్తిగా ఉడకని పదార్థాలు లేదా అపరిశుభ్ర పరిస్థితుల్లో తయారైన ఆహారంలో బ్యాక్టీరియా వేగంగా పెరుగుతుంది. రోడ్ల పక్కన అపరిశుభ్రంగా విక్రయించే ఆహారం, ముందే కోసి బహిరంగంగా ఉంచిన పండ్లు, శుభ్రంగా కడగని పచ్చి కూరగాయలు, సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేయని పాల ఉత్పత్తులు ఈ కాలంలో కలుషితమయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. వర్షాల సమయంలో నిల్వ నీరు, పారిశుద్ధ్య లోపాలు, రద్దీ ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం కూడా ఇన్‌ఫెక్షన్ల వ్యాప్తికి దోహదం చేస్తాయి. ముఖ్యంగా వర్షపు నీటికి గురయ్యే స్ట్రీట్ ఫుడ్‌పై ఈగలు, దుమ్ము, కలుషిత నీటి ప్రభావం ఎక్కువగా ఉండటంతో వాటిని తీసుకోవడం ప్రమాదకరం. పేగు ఇన్‌ఫెక్షన్లు వచ్చినప్పుడు తరచూ విరేచనాలు... నీటినే తాగాలి. వరదలు లేదా నీరు నిలిచిపోయిన ప్రాంతాల్లో తెలియని వనరుల నుంచి నీరు తాగకూడదు. చేతుల పరిశుభ్రత కూడా అత్యంత కీలకం. భోజనం చేసే ముందు, మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత, బయట నుంచి ఇంటికి వచ్చిన వెంటనే సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవడం ద్వారా అనేక ఇన్‌ఫెక్షన్లను నివారించవచ్చు. వర్షాకాలంలో స్ట్రీట్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. బయట బహిరంగంగా ఉంచిన, ముందే కోసిన లేదా మూత లేకుండా విక్రయించే ఆహారాన్ని తినకూడదు. వీలైనంత వరకు తాజాగా వండిన వేడి ఆహారాన్నే తీసుకోవడం సురక్షితం. పండ్లు, కూరగాయలను శుభ్రమైన నీటితో బాగా కడిగి తినాలి. సాధ్యమైనంత వరకు పండ్ల తొక్క తీసి తినడం మంచిది. తేమ ఎక్కువగా ఉండే ఈ కాలంలో ఆహారం త్వరగా పాడవుతుంది. అందువల్ల ఎక్కువసేపు బయట ఉంచిన ఆహారం లేదా వండిన తరువాత చాలా సేపు నిల్వ ఉంచిన వంటకాలను తినకుండా, తాజాగా వండిన ఆహారానికే ప్రాధాన్యం ఇవ్వాలి. పాలు, మాంసాహార పదార్థాలు, వండిన ఆహారం వంటి త్వరగా పాడయ్యే పదార్థాలను వెంటనే ఫ్రిజ్‌లో నిల్వ చేయాలి.

## తలకు చిన్నపాటి గాయమైన సరే అప్రమత్తంగా ఉండాల్సిందే..

తలకు బలమైన దెబ్బ తగిలిన తర్వాత బయట కనిపించే గాయాలు మానిపోయాయంటే సమస్య పూర్తిగా ముగిసిపోయిందని చాలా మంది భావిస్తారు. అయితే తలకు గాయం ప్రభావం కొన్ని సందర్భాల్లో చాలా కాలం పాటు కొనసాగే అవకాశాలు ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జ్ఞాపకశక్తి సమస్యలు, మానసిక ఆరోగ్య మార్పులు, నాడీ సంబంధిత వ్యాధుల అవకాశాలు ఉంటాయి. ఇవి రోజువారీ పనులు, ఉద్యోగం, వ్యక్తిగత జీవితంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. తలకు గాయం ప్రభావం కేవలం శారీరక సమస్యలకే పరిమితం కాదు. గతంలో తలకు గాయం అయిన వారిలో డిప్రెషన్, ఆందోళన, మూడ్ డిజార్డర్లు, నిద్ర సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని పలు పరిశోధనలు సూచిస్తున్నాయి. కొందరిలో వ్యక్తిత్వ మార్పులు, చిరాకు, భావోద్వేగాలను నియంత్రించడంలో ఇబ్బందులు, ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం తగ్గడం వంటి సమస్యలు కూడా కనిపిస్తాయి. తలకు పదేపదే దెబ్బలు తగలడం మరింత ప్రమాదకరంగా మారుతుంది. ముఖ్యంగా కాంటాక్ట్ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు, సైనిక సిబ్బంది, ప్రమాదకర వృత్తుల్లో పనిచేసే వారు ఇలాంటి గాయాలకు ఎక్కువగా గురయ్యే అవకాశం ఉంటుంది. తరచూ తలకు దెబ్బలు తగలడం వల్ల మెదడుకు క్రమంగా శాశ్వత నష్టం ఏర్పడి, భవిష్యత్తులో నాడీ సంబంధిత వ్యాధులు, జ్ఞాపకశక్తి క్షీణత వంటి సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. తలకు గాయం అయిన తర్వాత ప్రారంభ లక్షణాలు తగ్గిపోయాయని మెదడు పూర్తిగా కోలుకుందని అనుకోవడం సరైంది కాదు. లక్షణాలు కొనసాగినా లేదా కాలక్రమేణా మరింత తీవ్రమైనా వైద్యుల పర్యవేక్షణ తప్పనిసరి. ప్రారంభ దశలోనే సమస్యను గుర్తించి చికిత్స, పునరావాసం ప్రారంభిస్తే దీర్ఘకాలిక సమస్యలను తగ్గించుకోవచ్చు. వ్యక్తి పరిస్థితిని బట్టి చికిత్సలో ఫిజికల్ రీహాబిలిటేషన్, కాగ్నిటివ్ థెరపీ, మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్, అవసరమైన మందులు, జీవనశైలి మార్పులు వంటి అంశాలు ఉంటాయి. తలకు గాయం తర్వాత మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, వైద్యులు సూచించిన పునరావాస కార్యక్రమాలను పాటించడం, మెదడుకు వ్యాయామం ఇచ్చే కార్యకలాపాల్లో పాల్గొనడం, రోజూ వ్యాయామం చేయడం, తగినంత నిద్రపోవడం, సమతుల ఆహారం తీసుకోవడం, ఒత్తిడిని నియంత్రించడం, మళ్లీ తలకు గాయమయ్యే అవకాశమున్న పనులను వీలైనంత వరకు నివారించడం వంటి అలవాట్లు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. తలకు గాయం అయిన వెంటనే కనిపించే లక్షణాలు తగ్గిపోయాయని నిర్లక్ష్యం చేయకుండా, దీర్ఘకాలిక ప్రభావాలపై కూడా అవగాహన కలిగి ఉండటం చాలా ముఖ్యం. సమయానికి వైద్య సహాయం తీసుకోవడం, క్రమం తప్పకుండా ఫాలో అప్ చేయించుకోవడం ద్వారా మెదడు ఆరోగ్యాన్ని దీర్ఘకాలం పాటు కాపాడుకోవచ్చు.

ప్రమాదం వంటి దీర్ఘకాలిక సమస్యలు వ్యక్తి జీవన నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అందుకే తలకు



చిన్నపాటి దెబ్బ తగిలినా నిర్లక్ష్యం చేయకూడదని సూచిస్తున్నారు. తలకు గాయం అయిన తర్వాత ఎక్కువగా కనిపించే దీర్ఘకాలిక సమస్యల్లో జ్ఞాన సంబంధిత (కాగ్నిటివ్) లోపాలు ఒకటి. ప్రమాదాలు లేదా ఇతర కారణాలతో తలకు దెబ్బ తగిలిన వ్యక్తుల్లో జ్ఞాపకశక్తి తగ్గడం, ఏకాగ్రత లోపించడం, నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బందులు, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం తగ్గడం వంటి లక్షణాలు కొంతకాలం తర్వాత కూడా కనిపిస్తాయి.ఇవే కాకుండా తలనొప్పి, తల తిరగడం, అలసట, కాంతి లేదా శబ్దానికి అధిక సున్నితత్వం వంటి సమస్యలు కూడా చాలా రోజుల పాటు కొనసాగే

## జుట్టు సమస్యలకు సప్లిమెంట్లను వాడకండి..

జుట్టు రాలడం, పలుచబడడం లేదా కాంతి కోల్పోవడం వంటి సమస్యలు కనిపించిన వెంటనే చాలామంది హెయిర్ సప్లిమెంట్ల వైపు మొగ్గు చూపుతుంటారు. అయితే ఈ సమస్యలకు ప్రధాన కారణం శరీరంలో కొన్ని ముఖ్యమైన పోషకాల లోపం కూడా అయ్యే అవకాశాలు ఉంటాయి. అందుకే సప్లిమెంట్లు తీసుకునే ముందు రోజువారీ



ఆహారంలో అవసరమైన పోషకాలు ఉన్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలించడం ఎంతో ముఖ్యం. సరైన ఆహారం తీసుకోవడం ద్వారా జుట్టు ఆరోగ్యాన్ని సహజంగా మెరుగుపరచుకోవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. జుట్టు ఆరోగ్యంగా పెరగాలంటే ప్రోటీన్, ఐరన్, జింక్, విటమిన్ సి, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ బి12 వంటి పోషకాలతోపాటు తగినన్ని క్యాలరీలు కూడా అవసరం. ఒక్క ఆహార పదార్థంతో జుట్టు రాలడం పూర్తిగా ఆగిపోదు. అలాగే పోషకాల లోపం లేకపోతే సప్లిమెంట్లు తీసుకోవాల్సిన అవసరం కూడా ఉండదు.రోజూ ఒక టేబుల్ స్పూన్ పొద్దుతిరుగుడు గింజలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల విటమిన్ ఈ, జింక్, సెలీనియం, లినోలిక్ యాసిడ్ లభిస్తాయి. ఇవి జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడంతోపాటు వెంట్రుకలకు తేమను అందించి బలంగా ఉంచడంలో సహాయపడతాయి. ఐరన్ సప్లిమెంట్లకు బదులుగా మునగ ఆకుల పొడిని ఆహారంలో చేర్చుకోవచ్చు. ఇందులో విటమిన్ ఏ, సి, ఈ, జింక్, ఐరన్, అమైనో ఆమ్లాలు సమృద్ధిగా ఉండటంతో జుట్టు రాలడాన్ని తగ్గించి వెంట్రుకల వేర్లను బలపరచడంలో ఉపయోగపడుతుంది.

## పరిమితి మించితేనే..

'పామాయిల్' మాట వినిపించగానే చాలామంది విష తుల్యంగా భావించి దాంతో చేసిన ఆహారాన్ని వెంటనే పక్కన పెట్టేస్తున్నారు. అంతలా ప్రభావితం చేశారు మరి నేటి సోషల్‌మీడియా సైంటిస్టులు. అయితే సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని పూర్తిగా నమ్మాల్సిన అవసరం లేదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఒక నూనె ఆరోగ్యకరమా కాదా అనేది నూనె పేరును చూసి కాకుండా.. దాన్ని ఎలా వాడుతున్నాం, ఎంత మోతాదులో తీసుకుంటున్నాం.. ఆహారపు అలవాట్లు ఎలా ఉన్నాయన్న దానిపై ఆధారపడి ఉంటుందని వివరిస్తున్నారు. పామాయిల్ విటమిన్-ఇ తోపాటు శరీరానికి అవసరమైన కొవ్వు ఆమ్లాలు కూడా ఉంటాయి. అలా అని పరిమితికి మించి తీసుకోమని కాదు. అన్ని రకాల నూనెలను మారుస్తూ, పరిమిత మోతాదులో వాడటం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఒక రకమైన నూనెను మంచిదని, మరోదాన్ని చెడ్డదని ముద్ర వేయడం శాస్త్రీయంగా సరైన విధానం కాదని చెబుతున్నారు. ముఖ్యంగా ఇంట్లో తయారుచేసిన సమతుల ఆహారం, తక్కువగా వేయించిన పదార్థాలు, నూనెను నియంత్రించి వాడటమే ఆరోగ్యానికి అసలు మంత్రం అని గుర్తుచేస్తున్నారు. ఆహారంపై నిర్ణయాలు తీసుకునే ముందు సోషల్ మీడియా ట్రెండ్స్‌ను కాకుండా సైంటిఫిక్ ఆధారాలను నమ్మాలని వైద్యులు సూచిస్తున్నారు. వస్తున్న ప్రతి కంటెంట్‌ను నమ్మి, యదార్థాలను సరిచూసుకోకుండా, వారి విద్యార్హతతో సంబంధంలేని అంశాలను భయంతో ఫాలో అవ్వడం కూడా మంచిది కాదని హెచ్చరిస్తున్నారు. ఒక్క పదార్థాన్ని చూసి తీర్పు చెప్పడం కాదు... మొత్తం ఆహారపు జీవనశైలే మన ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుంది అని గ్రహించాలి.



## అపోలో హాస్పిటల్స్‌కు ఈటీ ఫ్యామిలీ బిజినెస్ అవార్డు



ఈ ఏడాదికి ఎకనమిక్ టైమ్స్ (ఈటీ) ఫ్యామిలీ బిజినెస్ అవార్డ్స్‌లో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ లిమిటెడ్‌కు 'ఫ్యామిలీ బిజినెస్ ఆఫ్ ది ఇయర్–మెగా' పురస్కారం లభించింది. దేశంలోని అతిపెద్ద కుటుంబ ఆధారిత సంస్థల్లో వృద్ధి, సుస్థిర కార్పొరేట్ పాలన, తరతరాల వారసత్వాన్ని విజయవంతంగా కొనసాగించడం వంటి అంశాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు ఈ అవార్డు అందుకున్నట్లు అపోలో హాస్పిటల్స్ తెలిపింది.




# లాభాల్లో ముగిసిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో చర్చలు ఉంటాయని ప్రకటించడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు



చల్లారాయి. దీంతో చమురు ధరలు మరోసారి దిగొచ్చాయి. విదేశీ మదుపర్ల పెట్టుబడులు కలిసొచ్చాయి. దీంతో సూచీలు వరుసగా నాలుగో సెషన్‌లోనూ లాభాల్లో ముగిశాయి. మదుపర్ల సంపద ఒక్క సెషన్‌లోనే రూ.5 లక్షల కోట్ల మేర పెరిగింది. ఉదయం సెన్సెక్స్ 78,883.34 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,094.64) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 78,895.10 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి సెన్సెక్స్ 544.39 పాయింట్లు లాభపడి 78,639.03 వద్ద ముగిసింది. నిఫ్టీ 390.70 పాయింట్లు పెరిగి 24,774.30 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.31 వద్ద ఉంది.

సెన్సెక్స్ 30లో ఇండిగో, టీసీఎస్, ఇన్ఫోసిస్, ఎటర్నల్, ఐటీసీ, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. సన్‌ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, మారుతీ, టాటాస్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 83.83 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,054.64 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# రికార్డు స్థాయిలో రష్యా చమురు దిగుమతులు..




జులైలో రష్యా నుంచి మన దేశానికి చమురు దిగుమతులు రికార్డు గరిష్ఠానికి చేరాయి. హర్మూజ్‌లో పరిస్థితులు మెరుగుపడడంతో పశ్చిమాసియా దేశాల నుంచి చమురు సరఫరా చేసుకుంటున్నప్పటికీ.. రష్యా నుంచి కూడా జులైలో దిగుమతులు రోజుకు 2.8 మిలియన్ బ్యారెళ్ల స్థాయికి చేరుకున్నాయి. 2022లో రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇంత భారీ స్థాయిలో దిగుమతి చేసుకోవడం ఇదే మొదటిసారి. షిప్ ట్రాకింగ్ సంస్థ కెప్లర్ ప్రకారం.. జులైలో భారత్ ప్రపంచ దేశాల నుంచి రోజుకు 5 మిలియన్ బ్యారెళ్లకు పైగా ముడి చమురును దిగుమతి చేసుకుంది. జూన్‌కంటే ఇది స్వల్పంగా అధికం. రష్యా నుంచి చమురు సరఫరా జూన్‌లో 2.7 మిలియన్ బ్యారెళ్లు ఉండగా.. జులై నాటికి 2.8మిలియన్ బ్యారెళ్లకు పెరిగింది. దీంతో దేశ ముడి చమురు దిగుమతులలో రష్యా వాటా 55.5 శాతానికి చేరింది. దిగుమతులు పెరగడానికి రష్యా చమురు నిరంతరం అందుబాటులో ఉండడమే ప్రధాన కారణమని కెప్లర్ ప్రధాన విశ్లేషకుడు నిఖిల్ దుబే పేర్కొన్నారు. అయితే ఎల్‌పీజీ దిగుమతులకు మాత్రం భారత్.. అమెరికా వైపే మొగ్గు చూపింది. జులైలో దిగుమతి చేసుకున్న మొత్తం 1.2 మిలియన్ టన్నులకు పైగా ఎల్‌పీజీలో సుమారు 73శాతం అగ్రరాజ్యం నుంచే కొనుగోలు చేసింది.

పశ్చిమాసియా నుంచి పెరుగుతున్న దిగుమతులు.. జులై నుంచి భారతీయ రిఫైనరీలు పశ్చిమాసియా సరఫరాదారుల నుంచి కొనుగోళ్లను పెంచినట్లు కెప్లర్ వెల్లడించింది. వీటిలో ప్రధాన సరఫరాదారుగా సౌదీఅరేబియా నిలిచింది. ఆ దేశం నుంచి జూన్‌లో రోజుకు 2.9 లక్షల బ్యారెళ్ల చమురు దిగుమతి చేసుకోగా.. జులైలో అవి 4.2 లక్షల బ్యారెళ్లకు పెరిగాయి. ఇరాక్, కువైట్‌ల నుంచి కూడా చమురు దిగుమతులు తిరిగి ప్రారంభమయ్యాయి. మరోవైపు యూఏఈ నుంచి దిగుమతులు జూన్‌లో 5.1 లక్షల బ్యారెల్స్ ఉండగా.. జులైలో 4.6 లక్షల బ్యారెల్స్‌కు తగ్గాయి. అయినప్పటికీ అది భారత్‌కు రెండో అతిపెద్ద అతిపెద్ద ముడి చమురు సరఫరాదారుగా నిలిచింది.

## ఆహార డెలివరీ సేవల్లోకి ఫ్లిప్‌కార్ట్

వాల్‌మార్ట్ యాజమాన్యంలోని ఇ-కామర్స్ దిగ్గజ సంస్థ ఫ్లిప్‌కార్ట్, ఫుడ్ డెలివరీ (ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకుని, ఆహార పదార్థాలను ఇంటికి చేరవేసే) సేవలను ప్రారంభించడానికి సిద్ధమవుతోంది. ఈనెల 15 నుంచి బెంగళూరులో ఈ సేవ ప్రారంభించాలని నిర్ణయించింది. ఇప్పటికే నగరవ్యాప్తంగా




రెస్టారెంట్లను తన ప్లాట్‌ఫామ్‌లో చేర్చుకోవడం మొదలుపెట్టింది. రెస్టారెంట్ భాగస్వాములను ఆకర్షించేందుకు, ప్రస్తుతం ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లు వసూలు చేస్తున్న 16–30% కమీషన్‌తో పోలిస్తే చాలా తక్కువగా 10% కమీషన్ రేటునే ఈ సంస్థ ప్రతిపాదిస్తున్నట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు వెల్లడించాయి. చాలా కాలంగా ఫుడ్ డెలివరీ సేవల్లో కొనసాగుతున్న జొమాటో, స్విగ్గీ ప్లాట్‌ఫామ్‌ల ఆధిపత్యానికి ఫ్లిప్‌కార్ట్ గండికొడుతుందని భావిస్తున్నారు. ద్విచక్ర వాహన ఆన్‌లైన్ అగ్రిగేటర్ ర్యాపిడో కూడా ఓన్లీతో ఫుడ్ డెలివరీ రంగంలోకి ఇటీవలే వచ్చిన సంగతి విదితమే. ఓఎన్‌డీసీ ద్వారా: సంప్రదాయ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లు, తమ యాప్ నుంచే ఆహారానికి ఆర్డర్ తీసుకుంటాయి. ఫ్లిప్‌కార్ట్ ఇందుకు భిన్నంగా ప్రభుత్వ మద్దతున్న ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ)పై తన ఫుడ్ డెలివరీ సేవను ప్రారంభించనుంది. ఫ్లిప్‌కార్ట్ సీఈఓ కల్యాణ్ కృష్ణమూర్తికి ఇంతకు ముందు చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా వ్యవహరించిన ఆశిష్ విజయ్‌వర్గీవ, ప్రస్తుతం ఫ్లిప్‌కార్ట్ ఫుడ్ డెలివరీ విభాగానికి నాయకత్వం వహిస్తున్నారు.

## పెట్రోల్, డీజిల్ విక్రయాలు పెరిగాయ్




సాధారణం కంటే తక్కువ వర్షపాతం కారణంగా నీటి మోటార్ల కోసం రైతుల నుంచి డీజిల్‌కు గిరాకీ పెరిగింది. వర్షాలు ఎక్కువుంటే, మోటార్ల అవసరం తగ్గుతుంది. ఇదేవిధంగా వాహన రవాణా కూడా పరిమితమై, ఇంధన వినియోగం తగ్గుతుంది. ఇప్పుడు భిన్నమైన పరిస్థితుల వల్ల వాహన రాకపోకలూ ఎక్కువగానే ఉన్నాయని.. ఫలితంగా జులైలో దేశంలోని 3 ప్రభుత్వ రంగ ఇంధన సంస్థల్లో పెట్రోల్, డీజిల్ అమ్మకాలు గణనీయంగా పెరిగాయని పరిశ్రమ విక్రయాల ప్రాథమిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, పెట్రోల్ విక్రయాలు జులైలో 9.7% పెరిగి 3.45 మిలియన్ టన్నులకు చేరాయి. 2025 జులైలో పెట్రోల్ విక్రయాలు 3.14 మి.టన్నులే. 2024 జులై విక్రయాలు 2.99 మి.టన్నులతో పోలిస్తే ఈసారి 15.1%, 2023 జులైతో పోలిస్తే 36.1% వృద్ధి నమోదైంది. ఈ ఏడాది జూన్ (3.48 మి.టన్నులు)తో 1.1% తగ్గింది. దేశంలో ఆర్థిక కార్యకలాపాలకు కీలక సూచీగా భావించే డీజిల్ విక్రయాలు 2025 జులై నాటి 6.43 మి.టన్నులతో పోలిస్తే గత నెలలో 10.7% పెరిగి 7.12 మి.టన్నులకు చేరాయి. 2024 జులైతో పోలిస్తే ఇది 11.5%, 2023 జులైతో పోలిస్తే 12.7% ఎక్కువ.

# ఒక్కో చమురు బావికి రూ.650 కోట్లు

ముడిచమురు, గ్యాస్ కోసం విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు మన దేశం, సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. సముద్రగర్భంలో ఉన్న చమురు నిల్వలను వెలికితీసేందుకు, రూ.84,084 కోట్ల అంచనా వ్యయంతో 'సముద్ర మంథన్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప్లోరేషన్ పథకాని'కి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సముద్రంలో అత్యంత లోతున ఉన్న ప్రమాదకర ప్రాంతాల నుంచి చమురు, గ్యాస్ వెలికి తీసేందుకు తవ్వే బావులకు అయ్యే ఖర్చులో సగాన్ని లేదా గరిష్ఠంగా రూ.650 కోట్లను నేరుగా దేశ బడ్జెట్ ద్వారా ప్రభుత్వమే భరించనుంది. వచ్చే 5 ఏళ్లలో (2031 వరకు) సముద్ర గర్భంలో దాదాపు 60 లోతైన, అతి లోతైన బావులు తవ్వడానికి రూ.43,200 కోట్లు కేటాయించారు. ఒక్కో బావికి రూ.650 కోట్లు కేటాయిస్తారు. ఆఫ్‌షోర్ ప్రాంతాల్లో సీస్మిక్, జియోలాజికల్ సర్వేలు నిర్వహించి, చమురు నిల్వలు ఉండే అవకాశాలను గుర్తించడానికి రూ.28,534 కోట్లు వెచ్చించనున్నారు. సముద్రంలో కనుగొన్న చమురు, గ్యాస్‌లను తీరానికి తరలించేందుకు గ్యాస్ పైప్‌లైన్‌లు, ప్రాసెసింగ్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయడానికి రూ.10,000 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఆఫ్‌షోర్ రంగానికి అవసరమైన యంత్రాలు, సేవలను అందించే పారిశ్రా



మిక జోన్‌ల అభివృద్ధికి రూ.2,000 కోట్లు వినియోగిస్తారు. చమురు లభించకపోతే, పెట్టిన పెట్టుబడి వృథా అవుతుందనే భయంతో లోతైన ప్రాంతాల్లో చమురు బావుల తవ్వకానికి ప్రైవేట్ కంపెనీలు దూరంగా ఉంటున్నాయి. చమురు ఉందని తేలిన బావుల నుంచి వెలికి తీసేందుకు మాత్రమే పెట్టుబడులు పెడుతున్నాయి. అందువల్లే ప్రపంచంలో ఏ దేశం చేయని విధంగా, మన ప్రభుత్వమే బడ్జెట్ నిధుల ద్వారా ఈ రిస్క్ భరించనుంది. చిన్నమొత్తాల్లో చమురు నిల్వలున్నాయని తేలినా సద్వినియోగం చేసుకునేలా, ప్రభుత్వ సాయంతో ఉమ్మడి పైప్‌లైన్‌లు, ప్రాసెసింగ్ సదుపాయాలను అభివృద్ధి చేస్తారు. తద్వారా కంపెనీలకు మౌలిక సదుపాయాల వ్యయాలు భారీగా తగ్గుతాయి. గత 10 ఏళ్లలో మన దేశం ముడిచమురు అవసరాల కోసం దిగుమతులపై ఆధారపడటం 77% నుంచి 88 శాతానికి పెరిగింది. మన అవసరాల్లో గ్యాస్‌ను సగానికి పైగా దిగుమతి చేసుకుంటోంది. సముద్ర మంథన్ ద్వారా ఏడాదికి 10–15 మిలియన్ టన్నుల చమురు అదనపు ఉత్పత్తి సాధించి, దిగుమతులను 3–5% వరకు తగ్గించొచ్చని భావిస్తున్నారు. 1997 నుంచి భారత ప్రభుత్వం చమురు–గ్యాస్ విధానాన్ని సులభతరం చేస్తూ వస్తోంది. 2016లో తెచ్చిన హెల్ప్ (హైడ్రోకార్బన్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ లైసెన్సింగ్ పాలసీ), ఓఏఎల్‌పీ (ఓపెన్ ఎకరేజ్ లైసెన్సింగ్ పాలసీ)లతో పాటు.. 2025 ఏప్రిల్‌లో అమల్లోకి వచ్చిన ఆయిల్ ఫీల్డ్స్ సవరణ చట్టం ద్వారా పన్నులు, లీజులను సరళీకృతం చేశారు. ఈ సంస్కరణలకు కొనసాగింపుగా తాజాగా సముద్ర మంథన్ పథకాన్ని తీసుకొచ్చారు.




## గాయత్రి, ట్రీసా జోడీకి టైటిల్



గాయత్రి గోపీచంద్, ట్రీసా జాలీ జంట సత్తా చాటింది. ఫిలిప్పీన్స్ ఇంటర్నేషనల్ ఛాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో మహిళల డబుల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. ఫైనల్లో ఈ జోడీ 16–21, 21–4, 21–17తో జపాన్‌కు చెందిన మికి కనెహిరో, యునా కతో ద్వయంపై విజయం సాధించింది. తొలి గేమ్‌ను కోల్పోయాక భారత ద్వయం బలంగా పుంజుకుని టైటిల్ సాధించింది.

# ప్లీజ్ టాటా గ్రూప్.. నిర్ణయం మార్చుకోండి:

## జంషెడ్‌పూర్ ఫుట్‌బాల్ క్లబ్ ప్లేయర్లు




ఎంతోమంది క్రీడాకారులకు ఊతమిచ్చిన జంషెడ్‌పూర్ ఫుట్‌బాల్ క్లబ్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇండియన్ సూపర్ లీగ్‌లో పోటీపడేందుకు పార్టిసిపేషన్ ఫీజును క్లబ్ యాజమాన్యం టాటా గ్రూప్ చెల్లించలేదు. తాము ఆడటంలేదని గత శుక్రవారమే క్లబ్ ప్రతినిధులు ప్రకటించారు. దీంతో సెప్టెంబర్ 4 నుంచి ప్రారంభమయ్యే ఐఎస్‌ఎల్‌లో ఆడే అవకాశం జంషెడ్‌పూర్ క్లబ్‌కు లేకుండా పోయింది. ఈ క్రమంలో పలువురు ఆటగాళ్లు క్లబ్ యాజమాన్యానికి భావోద్వేగమైన విజ్ఞప్తి చేశారు. టాటా గ్రూప్ తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరారు. అంతకు ముందు భారత మాజీ కెప్టెన్ సునీల్ ఛెత్రి కూడా విన్నవించాడు. 'ఇది షాకింగ్ న్యూస్. టాటా గ్రూప్ నుంచి ఇలాంటి నిర్ణయం వస్తుందని ఊహించలేదు. నిర్ణయం మార్చుకొని ఐఎస్‌ఎల్‌లో పాల్గొనేలా చూడాలని కోరుకుంటున్నా. ప్రతి తరానికి ఇదొక అద్భుతమైన ప్లాట్‌ఫామ్. ఈ క్లబ్‌తో ఎన్నో జ్ఞాపకాలు ముడిపడి ఉన్నాయి. నిజాయతీగా చెప్పాలంటే భావోద్వేగంతో కూడిన బంధం. తప్పకుండా టాటా స్టీల్, టాటా గ్రూప్ పెద్దలు పునః పరిశీలిస్తారని భావిస్తున్నా. ఈ క్లబ్ తరఫున ఆడి అంతర్జాతీయ స్థాయికి వెళ్లిన ప్లేయర్లు చాలా మందే ఉన్నారు'' అని భారత్ తరఫున 20 మ్యాచులు ఆడిన హల్దర్ అన్నాడు. అంతకుముందు టాటా ఫుట్‌బాల్ అకాడమీకి హల్దర్ బరిలోకి దిగాడు. ''క్లబ్‌ను మూసేయాలనే నిర్ణయాన్ని ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నా. ఇప్పుడైనా పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా. ఇదేదో కేవలం ఒకటి లేదా రెండేళ్ల గురించి కాదు. భారత ఫుట్‌బాల్ భవిష్యత్తు గురించే ఆందోళన. క్లబ్ ద్వారా యువ క్రీడాకారులు ఫుట్‌బాల్ కలలను నెరవేర్చుకొనేందుకు వస్తుంటారు. అద్భుతమైన మౌలిక సదుపాయాలున్న క్లబ్‌లో ఆడాలని ప్రతి ఒక్కరూ భావిస్తారు. ఇక్కడ నుంచి టీమ్‌ఇండియాలో అడుగు పెట్టాలని కోరుకుంటారు. రెండేళ్ల కిందట నేను ఈ క్లబ్‌కు వచ్చా. భారత జట్టులోకి వెళ్లేందుకు మంచి అవకాశం కల్పించింది. గాయం నుంచి కోలుకుని మళ్లీ రిథమ్‌లోకి రావడానికి క్లబ్ సాయ పడింది. నేను ఎప్పటికీ క్లబ్‌కు రుణపడి ఉంటా'' అని అల్బినో గోమ్స్ వెల్లడించాడు.

ఆర్థికపరమైన కారణాలతోనే ప్రస్తుతానికి ఐఎస్‌ఎల్‌లో జంషెడ్‌పూర్ ఫుట్‌బాల్ క్లబ్ ఆడటం లేదని టాటా గ్రూప్ వర్గాలు పేర్కొన్నాయి. క్లబ్‌ను పూర్తిగా మూసివేయడంలేదని, పలు టోర్నీల్లో బరిలోకి దింపే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి.

# భారత మ్యాప్ వివాదం.. గ్లాస్గో రెస్టరంట్ క్షమాపణలు



నాప్‌కిన్‌లపై అసంపూర్తి భారత మ్యాప్‌ను ముద్రించిన గ్లాస్గోలోని రెస్టరంట్ ఎట్టకేలకు క్షమాపణలు చెప్పింది. భారత బాక్సర్ లవ్లీనాతో పాటు ఇతర అథ్లెట్లు ఆ రెస్టరంట్‌కు వెళ్లినప్పుడు ఈ తప్పిదాన్ని గమనించారు. దీనిపై భారత బాక్సింగ్ ఫెడరేషన్ కూడా మండిపడింది. దీంతో ఇది సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారిపోయింది. మ్యాప్ వివాదంపై స్కాట్లాండ్‌లోని భారత్ ఎంబసీ కూడా స్పందించింది. ఈ క్రమంలో సదరు రెస్టరంట్ క్షమాపణలు చెప్పడంతోపాటు తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను డిలీట్ చేసేసింది. లోగోను కూడా మారుస్తామంటూ ప్రకటన చేసింది. 'మేము భారతీయ వారసత్వం పట్ల మేం గర్వపడుతున్నాం. భారత్‌తోపాటు ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 32 ఏళ్లుగా మేం సేవలు అందిస్తున్నాం. అయితే, భారత్ మ్యాప్‌ను (Incorrect Map) తప్పుగా చూపించినందుకు తొలుత మేం క్షమాపణలు చెబుతున్నాం. పొరపాటును సరిదిద్దడానికి తక్షణ చర్యలు తీసుకుంటాం. ఇది ఎవరినీ నొప్పించాలని చేసిందికాదు. భారత బృందానికి గర్వంగా సేవలు చేయాలనుకుంటున్నాం. సరైన మ్యాప్‌తో లోగోను మారుస్తాం. కామన్వెల్త్ గేమ్స్‌లో అద్భుత విజయాలు సాధించిన భారత అథ్లెట్లకు ఆతిథ్యం ఇవ్వడం మాకు దక్కిన గొప్ప గౌరవం. ఈ జ్ఞాపకాలు మాతో శాశ్వతంగా నిలిచిపోతాయి'' అని మిస్టర్ సింగ్స్ ఇండియా టీమ్ ధికారికంగా ప్రకటనను జారీ చేసింది. గ్లాస్గోలోని ఓ రెస్టరెంట్‌కు లవ్లీనాతో పాటు కొందరు భారత అథ్లెట్లు డిన్నర్‌కు వెళ్లారు. అక్కడ ఉన్న హ్యాండ్ టవల్స్ (నాప్‌కిన్‌లు)పై భారత్ మ్యాప్ అసంపూర్తిగా ఉండటం లవ్లీనా గమనించింది. నార్త్ ఈస్ట్ రాష్ట్రాలతోపాటు కశ్మీర్ సరిగా లేకపోవడంతో సోషల్ మీడియా వేదికగా లవ్లీనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ''భారత మ్యాప్ విషయంలో తప్పుగా వ్యవహరించవద్దు. నాకు చాలా బాధ అనిపించింది. మన నార్త్ ఈస్ట్ లేకుండా మ్యాప్ ఉంది. అక్కడి నుంచి వచ్చిన తర్వాత కూడా అది నన్ను కలిచివేసింది. ఇప్పటికైనా తప్పును సరిదిద్దుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా'' అని లవ్లీనా పేర్కొంది.

# చైనీస్ తైపీ ఓపెన్‌లో విజయం




భారత యువ షట్లర్ తన్వి శర్మ సత్తా చాటింది. కెరీర్లో తొలి బీడబ్ల్యూఎఫ్ టైటిల్‌ను ఖాతాలో వేసుకుంది. తైపీ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో నిలకడగా రాణించిన ఈ 17 ఏళ్ల అమ్మాయి... మహిళల సింగిల్స్ విజేతగా నిలిచింది. ఆదివారం ఫైనల్లో తన్వి 21–16, 21–16తో ఆరో సీడ్ లిన్ గుయెన్ (వియత్నాం)పై గెలిచింది. 36 నిమిషాల్లోనే ముగిసిన ఈ పోరులో ప్రత్యర్థి నుంచి కాస్త ప్రతిఘటన ఎదురైనా.. తన్వి ఏ దశలోనూ తగ్గలేదు. తొలి గేమ్‌లో 4–1తో ముందంజలో నిలిచిన భారత టీనేజర్.. ఆ తర్వాత 15–9తో ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. అదే జోరుతో తొలి గేమ్ గెలిచింది. రెండో గేమ్ ఆరంభంలో గుయెన్ దూకుడుగా ఆడి 3–0తో నిలిచింది. కానీ తన్వి వెంటనే పుంజుకుని 3–3తో స్కోరు సమం చేసింది. విరామ సమయానికి 11–8తో తన్వి ముందంజలో నిలిచింది. ఒకవైపు నుంచి వియత్నాం అమ్మాయి పోరాడుతున్నా.. తన్వి మాత్రం జోరు తగ్గించలేదు. 15–10తో ముందంజలో నిలిచిన ఆమె.. అదే ఊపులో గేమ్‌తో పాటు టైటిల్‌ను సొంతం చేసుకుంది. పంజాబ్‌లోని హోషియార్‌పుర్‌కు చెందిన తన్వి.. గతేడాది జరిగిన ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల సింగిల్స్‌లో రజతం, మిక్స్‌డ్ టీమ్‌లో కాంస్యం సాధించింది. ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో రెండు పతకాలు గెలిచిన తొలి భారత షట్లర్‌గా తన్వి ఘనత సాధించింది. గత ఏడాది యుఎస్ ఓపెన్, ఒడిశా మాస్టర్స్, గువాహటి మాస్టర్స్‌లో ఫైనల్ చేరిన ఆమె.. రన్నరప్ ట్రోఫీలతో సరిపెట్టుకుంది.

# బుమ్రా స్థానంలో అకిబ్ నబీకి ఛాన్స్

శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు అకిబ్ నబీ ఎంపికయ్యాడు. గాయం కారణంగా దూరమైన జస్‌ప్రీత్ బుమ్రా స్థానంలో నబీకి అవకాశం దక్కింది. ఈ మేరకు సోషల్ మీడియాలో బీసీసీఐ పోస్టు చేసింది. 29 ఏళ్ల ఈ జమ్ముకశ్మీర్ బౌలర్ చాన్నాళ్ల నుంచి భారత్ తరఫున అరంగేట్రం చేసేందుకు ఎదురు చూస్తున్నాడు. నబీ దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన ప్రదర్శన చేయడంతో సెలక్షన్ కమిటీ మొగ్గు చూపింది. ఆగస్ట్ 15 నుంచి శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్ ప్రారంభం కానుంది. గత రంజీ ట్రోఫీని జమ్ముకశ్మీర్ నెగ్గడంలో అకిబ్ నబీదే కీలక పాత్ర. ఏకంగా 60 వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. దీంతో అతడికి భారత జట్టు నుంచి పిలుపు వచ్చింది. అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్టులోనే అరంగేట్రం చేస్తాడని అంతా భావించారు. కానీ, అతడికి తుది జట్టులో అవకాశం కల్పించలేదు. దీంతో తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. ఇప్పుడు శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు ఎంపికైన నబీని తుది జట్టులో ఆడించాలనే డిమాండ్లు వస్తున్నాయి.




శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్), సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, మానవ్ సుతార్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, దేవదత్ పడిక్కల్, సరాంశ్ జైన్, అకిబ్ నబీ.

# వుదయం సినిమా MOVIE TIME!

## ది రెడ్ బ్యాగ్' నుంచి సిధ్ శ్రీరామ్ ఆలపించిన 'నీ వెనకే'రిలీజ్



**వుదయం సినిమా** 'మెమరీ మేకర్స్ బ్యానర్ మీద హరికృష్ణ సోమిశెట్టి నిర్మిస్తున్న చిత్రం 'ది రెడ్ బ్యాగ్'. ఈ మూవీకి రవి కుమార్ సీరపు దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బాదల్, భార్గవి, రాశీ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, గ్లింప్స్, టీజర్ అందరినీ ఆకట్టుకున్నాయి. రీసెంట్‌గా రిలీజ్ చేసిన 'డిస్కో లైట్' సాంగ్ యూట్యూబ్‌లో చార్ట్ బస్టర్‌గా నిలిచింది. ఇక తాజాగా 'నీ వెనకే' అంటూ సాగే ఓ బ్యూటీఫుల్ మెలోడీ సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఈ పాటను సిధ్ శ్రీరామ్ ఆలపించారు. ఈ పాటకు ఆయన గాత్రం ప్రధాన ఆకర్షణ. ఈ పాటకు తిరుపతి జావన సాహిత్యం అందించారు.. శేఖర్ మోపురి బాణీ ఎంతో ఫీల్ గుడ్‌గా అనిపిస్తోంది. ఇక ఈ పాట శ్రోతలను ఇట్టే ఆకట్టుకునేలా ఉంది.మ్యూజికల్ ప్రమోషన్స్‌తో చిత్రయూనిట్ అందరిలోనూ అంచనాల్ని పెంచేస్తోంది. ఈ సినిమా ఆగస్ట్ 21న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు.

## ప్రొడక్షన్ నెం 2 టైటిల్ అలియాస్ రుక్మిణి - వీడియో రిలీజ్



**వుదయం సినిమా:** నేచురల్ స్టార్ నాని సమర్పణలో తెరకెక్కిన 'కోర్ట్ – స్టేట్ వర్సెస్ ఎ నోబడీ' ఘన విజయానంతరం ఆయన యూనానిమస్ ప్రొడక్షన్స్ రెండో చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. నితిన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. దీప్తి గంటా నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'అలియాస్ రుక్మిణి' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియో సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచింది. అనౌన్స్‌మెంట్ వీడియోలో మొదట నాని, దర్శకుడు మురళీకాంత్ మధ్య ఆసక్తికరమైన సంభాషణ వినిపిస్తుంది. "కృష్ణ కథ చెబుతాను" అని దర్శకుడు చెప్పగానే, రుక్మిణి అనే రచయిత్రి రాసిన పలు రొమాంటిక్ నవలల కవర్లు కనిపిస్తాయి. వాటిని చూసి "నువ్వు కృష్ణ కథ అన్నావు... మరి ఈ రుక్మిణి ఎవరు?" అని నాని అడుగుతాడు. చివర్లో మ్యాథ్స్ టీచర్‌గా కనిపించిన నితిన్, "మై వైఫ్" అని చెప్పడంతో వీడియో ఆసక్తికరంగా ఎండ్ అవుతుంది. కథలోని అసలు మిస్టరీని బయట పెట్టకుండా, ఆసక్తిని మాత్రం రెట్టింపు చేసేలా ఈ వీడియోను రూపొందించారు. వినూత్న కథనం, ఆకట్టుకునే విజువల్స్, ఆసక్తికరమైన నేపథ్యం, హాయిగా సాగే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాపై మంచి అంచనాలు పెంచుతున్నాయి.మంచి కథలను గుర్తించడంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాని ఈ ప్రాజెక్ట్‌తో అనుబంధం కావడం సినిమాపై మరింత నమ్మకాన్ని పెంచుతోంది.

## 'ఇరుముడి' నుంచి బ్యూటీఫుల్ హోమ్లీ సాంగ్

**వుదయం సినిమా:** మాస్ మహారాజా మోస్ట్ ఎవైటెడ్ కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'ఇరుముడి' ప్రమోషన్స్ తో ఉత్సాహాన్ని పెంచుతోంది. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం, తన భక్తి గీతమైన మొదటి పాట 'ఇరుముడి కట్టు'తో ఇప్పటికే ప్రేక్షకులను ఆకట్టుకుంది. అదే జోరును కొనసాగిస్తూ, కుటుంబ బంధాలలోని ఆప్యాయతను అందంగా చాటిచెప్పే రెండవ పాట 'యాలాలో యాలాలో'ను చిత్ర బృందం విడుదల చేసింది.జీవీ ప్రకాష్ కుమార్ స్వరపరిచిన ఈ పాటకు ఆయన అందించిన సాఫ్ట్ మెలోడీ, ఆర్కెస్ట్రేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంత శ్రీరామ్ రాసిన సాహిత్యం మధ్యతరగతి కుటుంబంలోని ప్రేమ, అనుబంధాలు, ఆప్యాయతలే అసలైన సంపద అనే భావాన్ని హృదయానికి హత్తుకునేలా చెబుతుంది. హేషామ్ అబ్దుల్ వహాబ్, సాధికా కెఆర్ ఆలపించిన తీరు పాటకు మరింత భావోద్వేగాన్ని జోడించింది.ఈ పాట ద్వారా సినిమా ఎమోషనల్ కోర్‌ను కూడా మేకర్స్ చూపించారు.



## 'కొరియన్ కనకరాజు' మంచి ఫన్ ఎంటర్‌టైనర్



**వుదయం సినిమా:** మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ 'కొరియన్ కనక రాజు'తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హారర్ కామెడీ సూపర్‌నేచురల్ ఎలిమెంట్స్, నవ్వులు పంచే వినోదంతో గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించనుంది.

**కొరియన్ కనకరాజు కథ ఎలా మొదలైంది?**
–నేను కొంతమంది ఫ్రెండ్స్‌తో కలిసి అనంతపురం మీదుగా ఒక పెళ్లికి వెళ్లాను. రాత్రి సమయంలో కియా ఫ్యాక్టరీ దగ్గర ఆగాం. ఆ ప్రదేశం విజువల్‌గా చాలా బాగుంది.

**ఈ కథను ముందుగా వరుణ్ తేజ్ కోసమే అనుకున్నారా?**
–మొదట ఆయన కోసం మరో కథ అనుకున్నాను. అది చెప్పిన తర్వాత ఈ కొరియన్ పాయింట్ కూడా చెప్పాను.

**మీ సినిమాల మధ్య చాలా గ్యాప్ వస్తుంటుంది. కారణం?**
–నేను ఒకేసారి చాలా కథల మీద పని చేస్తుంటాను. కొన్నిసార్లు కొంత దూరం వచ్చాక ఆ కథ నాకే నచ్చదు.

**మీ నాన్న కూడా కథా రచయితే కదా. ఆయన కథతో సినిమా చేయొచ్చు కదా?**
–నిజమే. మా నాన్నగారి కథతో సినిమా చేయాలనే ఆలోచన ఉంది. కానీ ఆయన టేస్ట్‌కు, నా టేస్ట్‌కు తేడా ఉంటుంది.

**రితిక పాత్ర గురించి చెప్పండి?**
–ఈ సినిమాలో రీతిక కొరియన్ ఫ్యాక్టరీలో పనిచేస్తుంది. ఆమెకు కొరియన్ కల్చర్ అంటే చాలా ఇష్టం. నిజానికి తనకి కొరియన్ భాష కూడా తెలుసు. ఆమె లుక్ కూడా ఆ కల్చర్‌కు బాగా మ్యాచ్ అవుతుంది.

**కొరియాలో షూటింగ్‌కు పర్మిషన్స్ ఈజీగా వచ్చాయా?**
–అంత ఈజీ కాదు. మేము అక్కడికి వెళ్లాలన్నా, వాళ్లు ఇక్కడికి రావాలన్నా వీసా ప్రాసెస్ చాలా కష్టమైంది.

**దీనికి సీక్వెల్ ఆలోచన ఉందా?**
–ఆలోచన అయితే ఉంది.

## 50 రోజుల విజయోత్సవాన్ని జరుపుకున్న 'ఎల్‌జీబీటీ - ఏ లీగల్ బ్యాటిల్' చిత్ర బృందం



**వుదయం సినిమా:** సామాజిక అంశాన్ని హృదయానికి హత్తుకునేలా ఆవిష్కరించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న 'ఎల్‌జీబీటీ – ఏ లీగల్ బ్యాటిల్' చిత్రం విజయవంతంగా 50 రోజుల ప్రదర్శన పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్ర యూనిట్ ఘనంగా విజయోత్సవ సమావేశాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి చిత్ర నటీనటులు, సాంకేతిక నిపుణులతో పాటు పలువురు ప్రముఖులు హాజరై చిత్ర బృందాన్ని అభినందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ... ఈ సమాజంలో ట్రాన్స్‌జెండర్స్‌కు కూడా గౌరవప్రదమైన జీవితం ఉండాలనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచన అని అన్నారు. అందులో భాగంగానే తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కొన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో ట్రాన్స్‌జెండర్స్‌కు ప్రాధాన్యం కల్పిస్తోందని తెలిపారు. సమాజంలో అందరితో సమాన హక్కులు, అవకాశాలతో వారు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అలాగే ఈ చిత్రం సమాజానికి మంచి సందేశాన్ని అందిస్తోందని కొనియాడుతూ, 'ఎల్‌జీబీటీ – ఏ లీగల్ బ్యాటిల్ పార్ట్–2' నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా దర్శకుడు పి. సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... ప్రేక్షకులు తమ చిత్రాన్ని విశేషంగా ఆదరించి 50 రోజుల విజయాన్ని అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

## 'అగధ' ట్రైలర్ లాంచ్ ఈవెంట్

**వుదయం సినిమా:** శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద అజయ్ కేఆర్ సమర్పణలో కాశీ విశాలాక్షి బలుసు నిర్మాణంలో ఎం.ఎస్. రాజు తెరకెక్కించిన చిత్రం 'అగధ'. ఈ మూవీలో కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్‌కుమార్, భాను చందర్, షిజు, వనిత విజయ్‌కుమార్, రోషన్ బషీర్, శ్రేయా రాణి రెడ్డి, వివా రాఘవ, రాబర్ట్ మాస్టర్, ఆర్నా ములేర్, కనకవ్వ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమాని ఆగస్ట్ 14న భారీ ఎత్తున విడుదల చేబోతోన్నారు. ఈ క్రమంలో సోమవారం నాడు ట్రైలర్‌ను గ్రాండ్‌గా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు డా. కెవిఎల్ఎన్ రాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో.. ఎం.ఎస్. రాజు మాట్లాడుతూ .. ''అగధ' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ట్రైలర్ అందరికీ నచ్చే ఉంటుందని భావిస్తున్నాను. అజయ్ గారు, కాశీ విశాలాక్షి గారు ఈ ప్రయాణంలో నాకెంతో సపోర్ట్ చేశారు. 'ఆరిజిన్ ఆఫ్ అగధ' కూడా చాలా వైరల్ అయింది. ముమ్ముందు ఈవెంట్లలో టీం అందరికీ గురించి చెబుతాను. ఆగస్ట్ 14న 'అగధ' రిలీజ్ కాబోతోంది. అది నాకు మంచి డేట్ అనిపిస్తోంది. ఆ డేట్‌కి వచ్చే ప్రతీ సినిమా హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. మంచి కంటెంట్‌తో వచ్చే ప్రతీ చిత్రాన్ని ఆడియెన్స్ ఆదరిస్తారు. 'అగధ' సినిమాని అంత సులభంగా తెరకెక్కించలేరు. వీఎఫ్ఎక్స్, గ్రాఫిక్స్ వంటివి ఎక్కువగా ఉన్న ఈ మూవీని ఏడాదిలోనే పూర్తి చేశాం. కామాక్షి భాస్కర్ల మాట్లాడుతూ .. 'డిఫరెంట్ కారెక్టర్స్‌ను పోషించాలని ప్రతీ నటికి ఉంటుంది. 'పొలిమేర' తర్వాత మళ్లీ ఆ స్థాయి పాత్ర నాకు లభించలేదు.శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ .. ''అగధ' జర్నీ నాకెంతో ప్రత్యేకం. నేను ఎప్పుడూ సింపుల్ సినిమాల్ని చేయలేదు. రాజు గారి మీద నాకు నమ్మకం ఉంది. కాశీ విశాలాక్షి మాట్లాడుతూ .. ''అగధ' చిత్రీకరణ సమయంలో నేను కూడా సెట్‌కి వెళ్లాను.



## 50 కోట్ల క్లబ్‌లో 'చెన్నై లవ్ స్టోరీ'

**వుదయం సినిమా:** హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా నటించిన "చెన్నై లవ్ స్టోరీ" బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని నమోదు చేస్తూ రూ.50 కోట్ల క్లబ్‌లో చేరింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ హార్ట్ టచింగ్ ఎమోషనల్ లవ్ స్టోరీకి విమర్శకులతో పాటు సినీ ప్రముఖుల ప్రశంసలు కూడా లభిస్తున్నాయి. టాలీవుడ్‌లో ప్రేమకథా చిత్రాలకు ఇంకా ఎంతటి ఆదరణ ఉందో మరోసారి ఈ సినిమా నిరూపించింది.ఈ విజయోత్సాహంలో దర్శకుడు రవి నంబూరి తన తొలి సినిమా ఇంతటి విజయం సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో సినిమా రూపకల్పన నుంచి విజయం వరకు పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.ప్రేక్షకుల ఆదరణే అసలైన విజయం ఒక మంచి సినిమాను ప్రేక్షకులకు సరైన రీతిలో అందించగలిగాననే నమ్మకం ఈ విజయం కలిగించిందని రవి నంబూరి తెలిపారు.



దర్శకుడు రవి నంబూరి

బాక్సాఫీస్ వసూళ్ల కంటే ప్రేక్షకుల ప్రశంసలు, భావోద్వేగ అనుబంధమే తనకు మరింత సంతృప్తినిచ్చిందన్నారు. తొలి సినిమానే రూ.50 కోట్ల వసూళ్లు సాధించడం ఆనందంగా ఉందని, ఈ ఫలితాన్ని ముందే ఊహించానని కూడా చెప్పారు. సాయి రాజేష్ ఇచ్చిన అవకాశమే జీవితాన్ని మార్చింది.

**వుదయం సినిమా:** "కమిటీ కుర్రోళ్లు" మూవీ ఫేమ్ త్రినాథ్ వర్మ, యశ్వంత్ పెండ్యాల, "సిద్ధార్థ్ రాయ్" సినిమా ఫేమ్ తన్వీ నేగి, సహర్ కృష్ణన్ హీరో హీరోయిన్స్‌గా నటించిన సినిమా "అదే నీవు అదే నేను". ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మి వీరభద్ర క్రియేషన్స్ బ్యానర్ పై గోవిందు కాంద్రేగుల నిర్మించారు. రొమాంటిక్ థ్రిల్లర్ కథాంశంతో యువ దర్శకుడు కొండల్ రూపొందించారు. "అదే నీవు అదే నేను" సినిమా రీసెంట్ గా ప్రేక్షకుల ముందుకొచ్చి మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ విజయంపై మూవీ నిర్మాత గోవిందు కాంద్రేగుల, చిత్ర దర్శకుడు కొండల్, ఇతర టీమ్

## విజయాన్ని సొంతం చేసుకున్న "అదే నీవు అదే నేను"



– ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపిన దర్శకుడు కొండల్

సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు కొండల్ మాట్లాడుతూ – మా "అదే నీవు అదే నేను" సినిమా జూలై 31న విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. మా మూవీ రెండు తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులకు విపరీతంగా నచ్చింది. చూసిన వాళ్లంతా మూవీ అద్భుతంగా ఉంది, స్క్రీన్ ప్లే డిఫరెంట్ గా ఉందని చెబుతున్నారు. రొటీన్ చిత్రాలకు భిన్నంగా ఉందని, ఇలాంటి స్క్రీన్ ప్లే తాము చూడలేదని ప్రేక్షకులు చెబుతుండటం సంతోషంగా ఉంది. సినిమా ఫస్టాఫ్ లో మనకు కలిగే అపార్థాలు తొలగిపోయేలా సెకండాఫ్ లో మన వివాహ వ్యవస్థ గొప్పదనం చెప్పడం ఫ్యామిలీ ఆడియెన్స్ కు బాగా కనెక్ట్ అవుతోంది. గేటెడ్ కమ్యూనిటీలో ఆరు ప్రధాన పాత్రలతో రూపొందించిన చిత్రమిది. ఒక్క పోలీస్ పాత్ర లేకుండా రొమాంటిక్ క్రైమ్ థ్రిల్లర్ సినిమా చేయడమే ఒక ప్రయోగం. మా సినిమాను హిట్ చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. మా సినిమాను మరింతగా ఆదరిస్తారని కోరుకుంటున్నా. మీకు సినిమా నచ్చితే మరో 20 మందికి చెప్పండి. మాలాంటి కొత్త దర్శకులను, టీమ్ ను ఎంకరేజ్ చేయండి. అన్నారు.నటీనటులు – త్రినాథ్ వర్మ, యశ్వంత్ పెండ్యాల, తన్వి నేగి, సహర్ కృష్ణన్, కల్పలత, సునయన, బిత్తిరి సత్తి, మీర్, సూర్యతేజ, నరేందర్, రమణ భార్గవ్, తదితరులు.

## #KJQ ప్రెస్ మీట్ లో హీరో దీక్షిత్ శెట్టి

**వుదయం సినిమా:** సక్సెస్ ఫుల్ నిర్మాత సుధాకర్ చెరుకూరి SLV సినిమాస్ బ్యానర్ పై నిర్మించిన పీరియడ్ క్రైమ్ డ్రామా #KJQ (కింగ్ – జాకీ – క్వీన్). 1990ల నాటి నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో 'దసరా', 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రాలతో గుర్తింపు పొందిన దీక్షిత్ శెట్టి హీరోగా నటిస్తున్నారు. వీరితో పాటు నూతన నటుడు శశి ఓదెల, యుక్తి తరేజా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గత ఏడాది కన్నుమూసిన దర్శకుడు KK(కిరణ్ )కి ఇది చివరి చిత్రం. ఆయన క్రియేటివిటీ, సినిమా పట్ల ఆయనకున్న అంకితభావానికి ఇది ఒక నివాళిగా నిలుస్తుంది. ఇప్పటికే విడుదలైన థియేట్రికల్ ట్రైలర్ సినిమా పై అంచనాలు పెంచింది. ఈ చిత్రం ఆగస్టు 7న గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్ లో హీరో దీక్షిత్ శెట్టి మాట్లాడుతూ: తెలుగు ప్రేక్షకులందరికీ నమస్కారం. నేను చేసిన ప్రతి సినిమాను మీరు ఎంతగానో ఆదరించారు. ఈ సందర్భంగా మీ అందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ప్రతి సినిమా రిలీజ్ సమయంలో ఒక ఎక్సైట్మెంట్, ఒక భయం ఉంటుంది. కానీ ఈసారి మాత్రం చాలా బాధగా ఉంది. సినిమా విడుదల సమయంలో దర్శకుడు మన మధ్య లేకపోవడం... సినిమా తండ్రి లేని కొడుకులా అనిపిస్తోంది. సినిమా గురించి ఏదైనా అడగాలన్నా, ఏదైనా తెలుసుకోవాలన్నా ఎవరిని అడగాలనే ప్రశ్న మా టీమ్ అందరిలో ఉంది. అయితే శ్రీకాంత్ గారు, నిర్మాత సుధాకర్ గారు మాకు అండగా నిలబడ్డారు. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఆగస్టు 7న విడుదల అవుతోంది. తప్పకుండా థియేటర్‌లో చూసి ఆదరించండి.



Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.